
ISSN 0971-278X

# ప్రజాసాహితి

సాహిత్య సాంస్కృతికోద్యమ మాసపత్రిక

సంచిక : 469
వెల : రూ.20/-
మే 2024




జనసాహితి ప్రచురణ

కవిత

# సూర్యుడు ప్రజ్వలిస్తూనే వుంటాడు!

- బాహుదా

చీకట్లు - చిమ్మచీకట్లు కమ్ముకొస్తున్నాయ్!
దారికనబడదా? తీరుతెన్నులు తెలియవా?
నేను సంధ్యను.
నేను పట్టుకున్నాను సూర్యుని చేతిని.
చీకట్లని చీల్చుకుంటూ,
తోడ్కొని వచ్చి ఉదయానికి అప్పగిస్తాను.
మన సూర్యుడు, బాల సూర్యుడిగా
ఉదయానికి ఉషస్సులిస్తాడు.
వెలుగులు విరజిమ్ముతాడు.

సంధ్యా! ఒక ప్రశ్న?
సూర్యుడు సాయంత్రానికి చల్లబడి
నీ దగ్గరకేగా వచ్చేది.
తిరిగి తోడువెళ్తావు.
ఉదయానికి అప్పగిస్తావు.
రోజూ ఇంతేనా? ఇంతేనా?
అంది క్రాంతిలక్ష్మి
సూర్యుడిని తీసుకెళ్ళబోకు.
సంధ్యా అతడికి తోడెళ్లబోకు.

కాదు క్రాంతిలక్ష్మి!
సూర్యుడిని నిందించబోకు,
నిందించుతూ
నీవు నిస్పృహ చెందబోకు.
పరిణామక్రమానికి అలిగి
ఒడ్డున కూర్చోబోకు.
దానిలో భాగమవ్వు, మమేకమవ్వు.
సూర్యుడు అస్తమించడు.
ఉదయించడు.
నిరంతరం నిప్పులు చెరుగుతూనే వుంటాడు.
ఎన్నో పరిణామాలకు కారణభూతుడు.
ప్రకృతికాతడు ప్రాణదాత
సంధ్య సందేశమిచ్చింది, ఏమని?
ఉదయ సంధ్యలు వేరుకాదని,
విడదీయ సాధ్యం కానివని!

సంధ్య సందేశం దారి చూపింది.
ప్రణాళికలు వేశారు, వ్యూహాలు రూపొందించారు.
విశ్వశ్రామికులై విశ్వక్రాంతికి దారులు వేస్తున్నారు.
వారే
నేటి యువకులు, విద్యార్థులు.
కలలను సాకారం చేస్తారు.
లక్ష్యాన్ని చేరుకుంటారు.
భారతిని విముక్తి చేస్తారు.
శాంతిని, క్రాంతిని నింపుతారు ఈ అవనిపై.
ప్రపంచ శాంతి, క్రాంతి నిజమవుతుంది.
క్రాంతితో శాంతి లభిస్తుంది.
అవినాభావ సంబంధం అది.
ఉత్తేజం నిండిన విద్యార్థులు, యువకులు
శత్రువులెవరో, మిత్రులెవరో తేల్చుకుని
స్పష్టతతో కదులుతున్నారు.

సంధ్యా! ఉదయం పిలిచింది.
ఏమిటి ఉదయం?
ఈ రోజు సూర్యుడు మసకబారాడేమిటి?
కారుమబ్బులు అడ్డువచ్చి ఆటంకపరిచాయి.
అలాగా అది శాశ్వతం కాదు, అలాగే వుండదు.
అన్ని చోట్లా కాదు; ఒకే సమయంలోనూ కాదు.
సూర్యుడు కాంతులీనుతూనే వుంటాడు సదా
ఇక్కడి కారుమబ్బులను తొలగించే,
ప్రభంజనం వస్తూ వుంది చూడు.
చీకట్లు, కారు చీకట్లు తొలగిపోతాయి.
ఉదయం! నీవు ఉషస్సులనిస్తూనే వుంటావు
సూర్యుడు కాంతులు విరజిమ్ముతూనే వుంటాడు
అవిశాంత్ర యోధులందరికీ ఆయనే మార్గదర్శి,
ఆయనే స్ఫూర్తిదాత!

47 ఏళ్ళుగా నిరంతరాయంగా ప్రచురింపబడుతున్న

జనసాహితి ప్రచురణ

# ప్రజాసాహితి

సాహిత్య సాంస్కృతికోద్యమ మాసపత్రిక

469

సంపుటి : 47
సంచిక : 10
మే 2024

website : www.prajaasaahithi.com

## ఈ సంచికలో...

| | | | | |
|---|---|---|---|---|
| ముఖచిత్రం | : | ఉచితాల ఉన్మాదం – చిత్రం (అంతర్జాలం నుండి) | | .....01 |
| రెండవ అట్ట | : | సూర్యుడు ప్రజ్వలిస్తూనే వుంటాడు (కవిత) | – బాహుదా | .....02 |
| మూడవ అట్ట | : | డాన్ కోర్ జెస్యూ ఇంగ్లీషు కవితలు రెండు (కవితలు) అనువాదం : కొత్తపల్లి రవిబాబు | | .....35 |
| నాల్గవ అట్ట | : | మేడే – చిత్రం (అంతర్జాలం నుండి); హైకూ – పి. మోహన్‌రాంప్రసాద్ | | .....36 |
| సంపాదకీయం | : | మతతత్వాన్ని ఓడిద్దాం! | | .....05 |
| కథ | : | కులంగాడి అంత్యక్రియలు | – కొడవటిగంటి కుటుంబరావు | .....07 |
| కవితలు | : | ఎ. మన్మధరావు (28); వై. నేతాంజనేయప్రసాద్ (32) | | |
| వ్యాసం | : | 1917–22 మధ్యకాలంలో సోవియట్ రష్యాలో వికసించిన చిత్రకళ, శిల్పకళ అనువాదం : కొత్తపల్లి రవిబాబు | | .....09 |
| | : | ఆజాదీ – అమృతకాల్ – అచ్ఛేదిన్ సింహావలోకనం – భవిష్యదర్శనం | – అడ్మిరల్ ఎల్. రామదాస్ | .....11 |
| | : | గిరిజనోద్యమాన్ని నడిపిన అల్లూరి శ్రీరామరాజు | – ఐ.టి.ఆర్.వి. శివాజీరావు | .....20 |
| | : | గిరిజనోద్యమ నిర్మాణమే సీతారామరాజుకి నిజమైన నివాళి – దివికుమార్ | | .....23 |
| ధారావాహిక | : | దేశ విభజన వస్తువుగా సాహిత్యం (19) జ్యోతిర్మయీదేవి బెంగాలీ నవల "ఇపార్ గంగా, ఉపార్ గంగా" – కొత్తపల్లి రవిబాబు | | .....14 |
| పుస్తక పరిచయం | : | 'ఫాసిజం ఎలా పనిచేస్తుంది' | పరిచయం : జి.వి.భద్రం | .....16 |
| సినిమా సమీక్ష | : | 'ఆర్టికల్ 370' | – బాలాజీ (కోల్‌కతా) | .....29 |
| వ్యంగ్యం | : | మేక్ ఇన్ ఇండియా సూచీ | – శంకరం | .....27 |
| వివిధ | : | ముప్ఫై ఏళ్ళ క్రితం 'ప్రజాసాహితి' (04); చిత్రకారుడు సుదర్శన్ స్మృతి (13); హేతువాది పేరలింగం స్మృతి (19); వరంగల్లులో సాహిత్యసభపై జరిగిన దాడిని ఖండిద్దాం (26); కృతజ్ఞతలు (15); ఈ పుస్తకాలు అందాయి (33); వార్తాసాహితి (34) | | |

ప్రధాన సంపాదకుడు : **కొత్తపల్లి రవిబాబు** ఫోన్ : 9490196890 E-mail : ravibabujs@yahoo.co.in

చందాలు, పుస్తకాలు పంపవలసిన చిరునామా :
**డా॥ బి. అరుణ,** జనసాహితి ప్రధాన కార్యదర్శి
జనసాహితి కార్యాలయం : ప్రజాసాహితి
30–7–6, అనపర్తివారివీధి, అన్నదాన సమాజం రోడ్డు,
దుర్గాఅగ్రహారం, విజయవాడ – 520002.
ఫోన్ : 70759 57010 prajasahithi1977@gmail.com

ISSN INTERNATIONAL STANDARD SERIAL NUMBER
ISSN 0971-278X
LIBRARY OF CONGRESS LCCN 94903393

రచనలు పంపవలసిన చిరునామా :
**పి.ఎస్.నాగరాజు,** సంపాదకుడు, ప్రజాసాహితి
ప్లాట్ నెం. 59, రాధాక్రిష్ణ నగర్ కాలనీ
ఆర్మీ క్యాంటీన్ దగ్గర, దగ్గస్ స్కూల్ ఎదురు వీధి,
శ్రీకాకుళం – 532001
ఫోన్ : 78936 97469 prajasahithi1977@gmail.com

'ప్రజాసాహితి'
కెనరాబ్యాంకు అకౌంటు వివరాలు
"అకౌంట్ నెం.
**0680101004936**
*IFSC No. CNRB0000680*
**ఫోన్ : 70759 57010**

| | |
|---|---|
| వ్యక్తులకు సం॥ చందా | రు. 300-00 |
| ఐదేళ్లకు చందా | రు. 1300-00 |
| సంస్థలకు సం॥ చందా | రు. 500-00 |

**చందాలు, విరాళాలు**
మనియార్డరు, డి.డి.ల. ద్వారా పంపండి.
చిరునామా స్పష్టంగా తెలియ జేయాలి.
డి.డి.లపై 'ప్రజాసాహితి, విజయవాడ' అని రాయండి

## ప్రజాసాహితి ప్రకటనల ధరలు
**1/4 డెమ్మీ పరిమాణం**

| | |
|---|---|
| 2వ, 3వ అట్ట మల్టీకలర్ | రు. 20,000 |
| లోపలి పూర్తి పేజి | రు. 15,000 |
| లోపలి అరపేజి | రు. 7,000 |

ప్రజాసాహితి పాఠకులు, అభిమానులు తమతమ ప్రాంతాల నుండి (దేవుళ్ళు, సినిమాలు, వైన్‌షాపులు లాంటివి తప్ప) ప్రకటనలు సేకరించి పంపించవలసిందిగా విజ్ఞప్తి చేస్తున్నాం


## చందాదారులకు విజ్ఞప్తి


1. మీ చిరునామా పైన మీ చందా ప్రారంభమైన నెల, సంవత్సరం - చందా పూర్తయ్యే నెల, సంవత్సరం వివరాలు పోస్టల్ శాఖవారి ఆదేశాల ప్రకారం ముద్రించటంలేదు. ప్రజాసాహితి కార్యాలయం నుండి చందా పూర్తికాకమునుపే మీకు సమాచారం పంపుతాము. వెంటనే చందా పంపిస్తే, పత్రిక ఆగకుండా మీకు చేరుతుంది.
2. ప్రతినెల పత్రిక మొదటివారంలో పోస్టు చేస్తున్నాం. 10వ తేదీ లోపు మీకు పత్రిక రాకపోతే పోస్టుమాన్‌ని వాకబు చేయండి. కార్యాలయానికి ఫోన్‌చేసి తెలియచేయండి.
3. చందా పూర్తయి కొన్ని సంవత్సరాలు దాటినా కొందరికి పత్రిక పంపిస్తున్నాము. ఇకముందు చందా పూర్తికాగానే, ఆపై నెల వచ్చే సంచిక నుండీ ఆపేస్తాము.
4. మీ మిత్రుల చేత, సన్నిహితుల చేత 'ప్రజాసాహితి'కి చందాలు, విరాళాలు సేకరించండి.

– సంపాదకవర్గం

# ముప్పై ఏళ్ళ క్రితం ప్రజాసాహితి

**సంచిక : 10 సంపుటి : 17 మే 1994**





**మేడే** ప్రపంచ కార్మిక దినోత్సవం సందర్భంగా ఒక కార్మికుడు, కార్మికురాలు వారి పనిముట్లనెత్తి చేతిని ముందుకు చాచి వడివడిగా నడుస్తున్న ఓ ఆంగ్ల పోస్టరు దృశ్యాన్ని ముఖచిత్రంగా ప్రచురించారు. రెండవ కవరుపేజీ హెన్రీ జార్జ్ వైస్ రచన "మార్చ్‌టుడే"ను కె. రవిబాబు అనువదించారు. మూడవ కవరుపేజీ "రసాత్మక వాక్యం చలం" కవితను ఛాయరాజ్ రచించారు. నాల్గవ కవరుపేజీ చలం శతజయంతి సందర్భంగా చలం చిత్రాన్ని ప్రచురించారు.

"కార్మికవర్గ సాంస్కృతిక ప్రతీక – 'మేడే'" అనే సంపాదకీయాన్నీ, శశి రాసిన కవిత "మేడే సమరం"ను 1886లో అమెరికన్ కార్మికులు పాడుకున్న 'ఎనిమిది గంటల పనిదినం' అనే పాటకు కె. రవిబాబు అనువాదాన్ని ప్రచురించారు. "ఆంక్షలు–నిషేధాలు" శీర్షికన, ఇండెక్స్ ఆన్ సెన్సార్‌షిప్ 1/2 1994 ఆధారంగా డా॥ కిరణ్మయి రాసిన 'చెరసాలల్లో రచయితలు' అనే వ్యాసాన్నీ, 1994 ఫిబ్రవరి 25, 26 తేదీల్లో హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం పరిశోధక విద్యార్థులు నిర్వహించిన "చలం–జీవితం–సాహిత్యం" సదస్సులో కాత్యాయని విద్మహే ప్రసంగ పాఠం "చలం సాహిత్య సామాజిక నేపథ్యం"ను ప్రచురించారు. "చలం శతజయంతి సంఘం విజ్ఞప్తి"నీ ప్రచురించారు. జయ రాసిన "చలం పురాణ స్త్రీ పాత్రలు" అనే వ్యాసాన్ని, గోపీచంద్ రాసిన "వెంకటాచలం పాత్ర" అనే కథనీ, చలం శతజయంతి సందర్భంగా సంవత్సరం పొడుగునా ఆయన రచనలు ప్రచురిస్తామని, రచనలు పంపమని సంపాదకవర్గం విజ్ఞప్తినీ ప్రచురించారు. "చలం ఎప్పుడు పుట్టాడు?" వ్యాసాన్నీ, నాళేశ్వరం శంకరంగారి "దాంపత్యదూరం" కవితనూ, తెలుగు కథకి కొత్తచూపు అంటూ – 'కథ 92' పై అప్సర్ రాసిన సమీక్షనూ, గోపరాజు నారాయణరావు రాసిన 'బిడ్డల శిక్షణ'పై సమీక్షా వ్యాసాన్నీ, పి. చంద్రశేఖర్ అజాద్ నిర్వహిస్తున్న 'పిల్లల ప్రపంచం' శీర్షికన "పిల్లలకి తన హృదయాన్ని అంకితం చేసిన చలం" వ్యాసాన్నీ, 'పాఠకులకు, సానుభూతిపరులకు మనవి ప్రజాసాహితికి పంపే ప్రకటనల పట్ల తెలుసుకోవలసిన జాగ్రత్తలు' గూర్చి సంపాదకవర్గం సూచనలు ప్రకటించారు.

వై. సుకన్య రాసిన పాట – "రాజన్న పేట మృతవీరులకు జోహర్లు", రాజన్నపేట బూటకపు ఎన్‌కౌంటర్‌కి ప్రతిస్పందిస్తూ మధు రాసిన కవిత – "ఉదయించే ఎర్ర మందారాలు", చికాగో అమరవీరులను స్మరించుకుంటూ – టి.వి. రాసిన "మరో చికాగో పోరాటం కోసం" అనే కవితనూ, 6–4–94న బూటకపు ఎన్‌కౌంటర్‌లో మరణించిన రాజన్నపేట ఆరుగురన్నలకు అక్షర నివాళులర్పిస్తూ.. శోధన్ కవిత "మృత్యువే మరణిస్తుంది", చందర్ రాసిన "కరెంటు కోత గుండె కోతయి....." కవిత. చివరగా సాంస్కృతిక సామ్రాజ్యవాద వ్యతిరేక సదస్సులో వెలువడిన జనసాహితి ప్రచురణలు ప్రకటించారు.

1/8 డెమ్మీలో 60 పుటలు. వెల : రూ. 6/-

సంపాదకీయం

# మతతత్త్వాన్ని ఓడిద్దాం!

**మీ** మదిలో విద్వేషమే మతం
అది గద్దెనెక్కి అరాచకీయం అయ్యింది!
దొంగలింపబడ్డ మా గదిలో దేవుడు
మీ కషాయి పాలక ఎన్నికల జెండా – ఎజెండా ఇప్పుడు!
మా బతుకు ఎప్పుడో
ప్రపంచం పెద్ద బజారు సరుకయ్యింది!
మా కష్టం కట్టుబానిస కన్నీరయ్యింది!
మీ ఆధిపత్య మౌనం
అది మానవతుల మానాలను కోరుతోంది!
ఇప్పుడు కాకపోతే ఎప్పుడు?!
మా ధిక్కారం గుండె నిబ్బరమే
రేపటి భవితను నిలిపే పిడుగుల పిడికిలి!!

235 ఏళ్ళనాటి ప్రపంచ మేడే చైతన్యస్ఫూర్తి – భారతదేశంలో వందేళ్ళ శ్రామిక పోరాట చైతన్య చరిత్ర – ఈ ముప్పాతికేళ్ళ భారత స్వాతంత్ర్య దేశంలో – గత 10 ఏళ్ళ కాలంలో ఏ దుస్థితికొచ్చిందో దేశ కార్మికవర్గం స్థితిగతులు చెబుతున్నాయి. 8 గం॥ల పనిదినం 15–16 గంటలకి దిగజారింది. పనిదినాల వెసులుబాటు ఆవిరై పోయింది. కార్మికవర్గ ప్రయోజనాలు మతతత్త్వ ఫాసిస్టు తరహా పోకడలకు అడుగంటిన పరిస్థితి.

ఈ గత పదేళ్ళ కాలంలో కంచంలో తిండి నేరమయ్యింది. కట్టుకున్న బట్ట కన్నెర్రయ్యింది. బడుగుల పుట్టుక పాపమయ్యింది. ఆడినమాట దేశద్రోహం అయిపోయింది. అడిగిన ప్రశ్న విద్రోహం అయ్యింది. 'నిజం' – దేశంలో ఉండడం కంటగింపు అయిపోయింది. ప్రపంచ ఆధిపత్యానికి – భారతదేశాన్ని సాగిలపడేట్టు చేసింది – మతతత్త్వ సంకుచితత్త్వం. సామాజికంగా, సాంస్కృతికంగా మతోన్మాదమే జీవనశైలిగా మారిపోయిన దుర్భరమైన పరిస్థితిని ఈ దేశంలో ప్రతి సామాన్యుడూ భరిస్తున్నదే.

ఈ చిమ్మ చీకట్లో 18వ లోక్‌సభ ఎన్నికలు; ఆంధ్రప్రదేశ్‌కి 16వ శాసనసభ ఎన్నికలు. ఎలాగైనా గెలవాలి అని మతోన్మాద పాలకపక్షం నేలబారు అదరగండాలు పెంచుకుంటూ పోతోంది. ధరలు అదుపుతప్పి మరింత దుర్భిక్షం ఏర్పడుతుంది. కల్తీకి హద్దు లేకుండా పోయి, ప్రజల జీవన, ఆరోగ్య స్థితిగతులు వికృతంగా మారతాయి. పాలకపక్షంగా ప్రతిపక్షాల ఖాతాలను కూడా నిలిపివేయడం, మీడియా స్వేచ్ఛను గుత్తగా కొనుగోలు చేసేయడం, ప్రశ్నించే నాయకుల్ని నిర్బంధించడం, సాహిత్యకారుల్ని, పత్రికా రచయితల్నీ, సామాజిక కార్యకర్తల్ని, అగంతక దాడుల్లో హతమార్చడం, ముస్లిం మైనారిటీ ప్రజానీకం మీద, దళితులపై హంతక, హత్యాచార మూకదాడులు చేయడం; ఆదివాసీ, మూలవాసీల పాదాల కింద నేలను – తప్పిపారేయడం; మహిళలపై, బాలికలపై హత్యాచారాలకు అదుపు లేకుండా పోవడం – అగ్రకుల దాష్టీకాలుగా – రాజకీయ పాచికలుగా మహిళల్ని పైశాచికంగా, లైంగికంగా, నగ్నంగా, నీచంగా, హింసించి చంపడం – ఇదీ పదేళ్ళ భారతదేశ ఛిద్రపటం!!

ఈ ఎన్నికల తర్వాత అసలు ఎన్నికలే రద్దు అవుతాయా అన్నవిధంగా భీతిని కల్పిస్తున్నది మతతత్త్వ పాలక గూండాయిజం.

భారత రాజ్యాన్ని కార్పొరేటు రాజ్యంగా, మనువాదాన్ని సాంస్కృతిక స్మృతిగా ప్రవేశపెట్టడానికి మతతత్త్వాన్ని అడ్డుపెట్టుకొని, పదవీ వ్యాపార జూదరులు ఉబలాటపడుతున్నారు. ప్రతిపక్షం అనేదే లేకుండా ఏకపక్ష పాలనను నడపడానికి ఉరకలేస్తున్నారు.

ఇక ఎన్నికల్లో అవినీతిని గమనిస్తే – హద్దూపద్దూ లేని పోకడలు జడలు విచ్చుకుంటున్నాయి. ఎన్నికల్లో నిలబడే అన్ని పాలకముఠాల అభ్యర్థులూ నేరచరితలుగానే తమ అర్హతను చాటుకుంటున్నారు. లక్షల కోట్ల రూపాయలకు ప్రజాధనంతో నిండిన బ్యాంకుల్ని ముంచి, ప్రజల్ని మోసగించి, ఆకాశహర్మ్యాలు కట్టుకోడానికి ఎన్నికల వైకుంఠపాళీలోకి దిగారు. అయితే, పావులు మాత్రం ప్రజలే. పందేలుగా ఒడ్డేది మాత్రం ప్రజల అవసరాలు, సమస్యలే! రౌడీలూ, గూండాలూ, హంతకులూ వీళ్ళూ – ఈ దేశ అధినాయకులు! ఒక ఉదాహరణ చెప్పుకోవాలంటే – మైనింగ్ మాఫియాగా జైలుశిక్ష అనుభవిస్తున్న ఒక కరడుగట్టిన నేరస్తుడు – తిరిగి ఈరోజు మతతత్త్వ పాలకపక్షానికి ఎన్నికల అభ్యర్థి. అవినీతిరహితమైన పాలకపక్షంగా జబ్బలు చరచుకొని వచ్చిన కషాయ జెండా ఈరోజు అవినీతి మురికి కూపంలో పీకలుదాకా కూరుకు పోయింది. అలా కూరుకుపోవడం – ఒక డాబూ – దర్పంగా చెలామణీ చేయిస్తున్నారు. ఆధునిక ప్రగతిశీల సామాజిక విలువల్నీ, నైతిక విలువల్నీ చెల్లని సంస్కృతిగా ముద్రవేసి – రాచరిక సంస్కృతికి పట్టం గట్టదల్చుకుంటున్నారు.

ఈ పదేళ్ళ పాలనలో కార్మికరంగం ప్రయోజనాలను కుప్పకూలేలా నిర్ణయాలు తీసుకుంది – ఈ మతతత్త్వ పాలకపక్షం. నూతన శ్రామిక నియమావళి – 2019తో ప్రవేశపెట్టిన లేబర్‌కోడ్ వల్ల 90%గా వున్న అసంఘటిత కార్మికవర్గం కట్టుబానిసలుగా ఈరోజు మిగిలారు. ఈ లేబర్‌కోడ్‌ని ప్రతిపక్షాలు గూడా మౌనంగా అంగీకరించాయి. ప్రజల్ని దోచుకు తినడంలో, కాల్చుకు తినడంలో పాలకపక్ష ముఠాలన్నీ ఒక తానులో ముక్కలే. పనిచేసే బాధ్యత తప్ప – గౌరవంగా బతికే హక్కు కనీసంగా కూడా ఇవ్వని లేబర్‌కోడ్ ఇది. దీంతో ఇప్పటివరకు – అమల్లో వున్న 44 కార్మిక చట్టాలు రద్దుచేసిన నియంతృత్వం నేటి పాలకులది.

మేడే స్ఫూర్తితో గత వంద సంవత్సరాల నుండి కార్మికులు సాధించుకున్న వేతన చట్టాలూ, కార్మికుల భద్రతా నియమావళి, భీమా

చట్టాలూ, భవిష్యనిధి చట్టాలూ – చట్టుబండలైనాయి. ఉద్యోగుల నమోదు కార్యాలయం చట్టం, ప్రసూతి ప్రయోజన చట్టం, ఇలాంటివి ఆనవాలు లేకుండా చేస్తున్నారు.

అలాంటి నల్ల చట్టాల్లో చాలా కీలకమైనవి – మూడు వ్యవసాయక చట్టాలు. ఒక చట్టం – రైతు ఎక్కడైనా ఎంత ధరకైనా తమ పంటను అమ్ముకోవచ్చని చెబుతున్నారు. ఆచరణలో ఆ చట్టం రైతులకు కనీస మద్దతు ధరను లేకుండా చేస్తుంది. రైతును అనాధ చేసే చట్టం అది. ఇక రెండో చట్టం – పెద్ద పెద్ద కార్పొరేట్ కంపెనీలతో ఒప్పంద వ్యవసాయం చేసుకోవడానికి సంబంధించినది. దానివల్ల రైతుకు నచ్చిన పంట వేసుకునే హక్కు ఉండదు. కార్పొరేట్ కంపెనీ చెప్పిన పంటే వెయ్యాలి. నచ్చిన ధరకు, నచ్చినప్పుడు అమ్ముకునే అవకాశం వుండదు. ఒప్పందం చేసుకున్న ధరకే – అమ్మితీరాలి – పంట చేతికొచ్చిన కాలానికి పెరిగిన ధర మరి రాదు. ఈ ఒప్పంద వ్యవసాయం కార్పొరేట్ కంపెనీలకు మాత్రమే ఉపయోగపడుతుంది. రైతు దిక్కులేనివాడు అవుతాడు. ఇక మూడవ చట్టం నిత్యావసర సవరణ చట్టం. ఈ చట్టం చెప్పేది ఒకటి. చేసేది మరొకటి. ఇది అమల్లోకి వస్తే ఇప్పుడు వున్న MRTP నియంత్రణ రద్దయి – ఆహార భద్రత పెనుప్రమాదంలో పడుతుంది. రైతు – పంట నిల్వచేసుకునే సామర్థ్యం కోల్పోతాడు. గిడ్డంగులన్నీ కార్పొరేట్ రంగంలోనే వుంటాయి. ప్రభుత్వ ఆహార గిడ్డంగుల్ని ఇప్పటికే మూసివేత ప్రారంభించారు. ధరపై రైతుకు అదుపు వుండదు కూడా.

ఈ నల్ల చట్టాలూ – నోటితో పొగుడుతాయి రైతుని. నొసటితో వెక్కిరించి – కార్పొరేట్ సాగుని ప్రవేశపెడతాయి.

అందుకే ఏడాదికి పైగా భారత రైతాంగం – మతతత్వ మొండి ప్రభుత్వాన్ని దిగ్బంధం చేసింది. ఎండకి – చలికి – కోవిడ్‌కి 750 మంది రైతుల్ని బలిపెట్టుకుంది. దేశ వ్యవసాయం – కార్పొరేట్‌వర్గం పాలుకోకూడదని, దేశ ప్రజలు బెంగాల్ కరువులాంటి ఆకలి చావులకు గురికాకూడదని.

అటు కాశ్మీరీ – ఇటు మణిపూర్ నడుమ భారతదేశం అంతా ప్రజల రక్తమాంసాల నరమేధంగా మార్చింది 10 ఏళ్ళ మతతత్వ పాలన. అటువంటి కిరాతక కేంద్ర పాలక పక్షానికి – ఆంధ్ర రాష్ట్రంలో అధినాయకులు సాగిలపడుతున్నారు. ఒకరు గద్దెను నిలబెట్టుకోవాలని; ఇంకొకరు గద్దెను దక్కించుకోవాలని;

వీళ్ళెవరికీ – ప్రజలు, ప్రజల ప్రయోజనాలూ, ప్రజల భవిష్యత్తూ, ప్రజల స్వయం జీవనశక్తి సామర్థ్యాలూ అవసరంలేదు. బిచ్చం వేసినట్టు – ఎంగిలి మెతుకులు విదిల్చినట్టు – సంక్షేమం పేరుతో – నగదు బదిలీ పేరుతో చట్టబద్ధంగా – ఓట్లు కొనుగోలుకి పోటీపడుతున్నారు.

ఈ నేపథ్యంలో – ఈనాటి ఎన్నికలు ఒక ప్రత్యేకతను సంతరించుకున్నాయి. ఎప్పుడూ లేనంతగా మొత్తం దేశ జనాభాలో సుమారు 50 కోట్లమంది యువత ఓటుహక్కుని కలిగి వుంది. ఇక్కడే యువత విచక్షణతో ఆలోచిస్తే – దేశ భవిష్యత్తు మారిపోతుంది. భగత్‌సింగ్ వారసత్వాన్ని అందిపుచ్చుకోడానికి – నిరుద్యోగ జడత నుండి, నిష్క్రియాతత్వం నుండి, రికామీ తిరుగుళ్ళ నుండి, రకరకాల మద్యం, మాదకద్రవ్యాలూ, సెల్‌ఫోన్, సినిమాలూ – ఈ మత్తులన్నింటినీ విదుల్చుకుని నిలబడితేనే దేశ భవిత ఏమైనా కాస్త మిగులుతుంది.

నిజానికి ఈ ఎన్నికల సందర్భంగా మనం చేసుకోవాల్సిన కొన్ని మౌలిక ప్రశ్నలు మనం ఇప్పటికైనా వేసుకోకపోతే – అవి దేశం ముఖం మీద తరతరాల గాయాల శేష ప్రశ్నలుగానే మిగిలిపోతాయి.

జల్లెడతో నీళ్ళు పడుతున్న "ఎన్నికల కమీషన్" –

పదవీ వ్యాపార జూదరులైన మన దళారీ పాలకముఠా నాయకుల – "చట్టసభలు" –

ఇల్లు తగలబడుతుంటే – చుట్ట కాల్చుకునే బాపతు "పోలీసు వ్యవస్థ" –

తోలుబొమ్మగా మార్చబడిన "న్యాయవ్యవస్థ" –

డబ్బు చేతిలో కీలుబొమ్మైపోయిన "మీడియా" –

సచ్చినోడికి దక్కిందే కట్నం – అన్నట్లు దొరికినంత నొల్లుకుంటున్న "పాలనా యంత్రాంగం" –

ఇవన్నీ ప్రజలకు జవాబుదారీ కాగల్గుతాయా?!

ఇప్పుడు దేశానికి మార్గదర్శకత్వం అందించేదెవరు?

ప్రజా ఉద్యమ చైతన్యాన్ని పెంచే శక్తుల్ని పెంచుకోవడం ఎలా? ప్రజా ఉద్యమ చైతన్యాన్ని ఎలా రాజెయ్యాలి?

ఈ కుహనా ప్రజాస్వామిక బూటకపు ఎన్నికలకు ప్రత్యామ్నాయం ఏమిటి? మతతత్వ రాజకీయాల అరాచకానికి జవాబుగా శ్రామికతత్వ రాజకీయాలను మేడే చైతన్యాన్ని ఎలా పదును పెట్టుకోవాలి?

ప్రజలందరం ఈ వెనుకపట్టు మతతత్వ పాలకముఠానీ, దాని అనుకూల పాలక ముఠాల్నీ చిత్తుగా ఓడించడమే ఇప్పటి ఎన్నికల తక్షణ కర్తవ్యం!!

జనాన్ని కదిలించడం ఎలా?

ప్రజలు తమంతట తాముగా ఈ దౌర్జన్యాలను వ్యతిరేకించడం ఎలా?

ఈ ప్రశ్నలకు జవాబులు వెతుక్కోవడం ద్వారానే సరైన ప్రజాఉద్యమ చైతన్యం – మేడే స్ఫూర్తితో సరైన ప్రత్యామ్నాయం అవుతుంది!! ✷



కథ

# కులంగాడి అంత్యక్రియలు

– కొడవటిగంటి కుటుంబరావు

**పాపం!** కులంగాడు చచ్చిపోయాడు. అమిత వృద్ధుడు. ఎంతోకాలం డాబు మీద కొట్టుకొచ్చాడు. తనకు జరామృతి లేదని ఎంతోమందిని జయప్రదంగా నమ్మించి తన గొయ్యి తనే తవ్వుకున్నాడు. ఇవాళ వాడి శవం చివికి దుర్గంధం కొడుతున్నా, వాడికి అంత్య క్రియలు చేసేవాళ్ళు లేరు! వాడింకా యేమూలో ఉక్కుతునకల్లే తిరుగుతున్నట్టే నటిస్తున్నాడు. కులంగాడు బతికుండగా చేసిన పాపం యీ విధంగా వాడి శవంమీద పగతీర్చుకుంటున్నదేమో!

నిజానికి కులంగాడిది వింత జీవితం. వాడు మొదటినుంచీ పరమపాపి! అయితే యేం? ప్రపంచం వాడి కొకప్పుడెంతగా బ్రహ్మరథం పట్టింది! యేం వెలుగు వెలిగాడు – ఛండాలుడు! వాడిది సుగ్రీవాజ్ఞ! అధికారానికి తిరుగులేదు! వాడు చెప్పిందే వేదం! బ్రాహ్మణులు వాణ్ణి ప్రతిష్టించారు. వాడికి జరిగిన గౌరవ మర్యాదలూ, వాడికి చూపించిన వినయ విధేయతలూ, భయభక్తులూ, మానవజాతి మరెవరికీ చూపించలేదు.

వాణ్ణి ప్రతిష్ఠించిన బ్రాహ్మల ప్రభ అయినాక కూడా వాడి శకం అయిపోలేదు. మనుష్యులను శాసించటానికి అధికారంగా ఒకడు వచ్చాడు – నిజమే. అధికారంగాడు తన ప్రభ కులంగాడి ప్రభ కన్న యెక్కువైనదని యెరుగును – అదీ నిజమే. కాని యెందువల్లో అధికారంగాడు కులంగాడితో ఆట్టే తగూ పెట్టుకోలేదు. కులంగాడి పలుకుబడి చూసి అధికారంగాడు కూడా జంకాడనే చెప్పాలి. కులంగాడు అధికారంగాడి మీదికి పోక తన పరువు నిలబెట్టుకున్నాడు. ఈ యిద్దరూ యెదురైనప్పుడల్లా ఒకరికొకరు దూరంనించే అతి గౌరవంగా సలాము చేసుకుని యెవరి దారిన వారు వెళ్ళటం చూసి కులంగాడి ప్రభ యింకా ఉచ్ఛస్థితిలోనే వుందని భ్రమపడ్డారు. కులంగాడు దర్పానికి పోయి అధికారంగాడితో జట్టీ పట్టుకుని వుంటే కులంగాడి బండారం యెప్పుడో బయటపడి వుండును. కులంగాడికింకా చాలా మంచిరోజులు.

మొత్తంమీద వాడు అద్భుత జాతకుడు!

కులంగాడింకా రొమ్ము విరుచుకుని మీసాలకు రంగు వేసుకొని తిరుగుతుండగానే అధికారంగాడి పటుత్వం ఉడిగిపోయింది. మనుష్యులను పాలించటానికి ధనంగాడొచ్చాడు.

ధనంగాడు పరమ కర్కోటకుడు. మానవ సహజమైన దౌర్బల్యాలేవీ వాడిలో లేవని మనోవైజ్ఞానికులు తేల్చారు. దయా, ఓర్పూ, అపేక్షా, భయమూ, విశ్వాసమూ, పశ్చాత్తాపమూ, గౌరవమూ – ఇటువంటి గుణాలకు వాడతీతుడు. కులంగాడు డాబుచేసీ, అధికారంగాడు అదలగొట్టీ, జనాన్ని పాలిస్తే, ధనంగాడు తన అలిఖిత శాసనాన్ని నిశ్శబ్దంగా నిష్కర్షగా పాలించాడు. ధనంగాడి శాసనం వాతపడే వరకూ ఎవరికీ అటువంటి శాసనం ఉందనే తెలియదు, ధనంగాడికి పబ్లిసిటీ అవసరం లేదు. వాడు అన్ని వీధులూ తిరిగేవాడు కాదు. ముఖ్యమైన రాజవీధులలోనే తన ప్రభ వెలిగించాడు. వాడి సమగ్ర స్వరూపాన్ని తనివిదీర చూసే అదృష్టం బహుకొద్దిమందికే దక్కింది.

వాడి నడవడికలో ఒక కళ చూశాడు. వాడి నాజూకూ, మరువరాని వాడి మందహాసమూ, వాడి నాగరికతా, శ్రావ్యమైన వాడి కంఠధ్వనీ, అతి మెత్తని వాడి సంభాషణా జనాన్ని ముగ్ధుల్ని చేసేది. వాడి కర్కశతత్వాన్ని ఎవరూ పాటించేవారుకారు. వాడి దయ కోల్పోయి రాజవీధి నుండి సందులలోకీ గొందులలోకీ తరమబడిన వాళ్ళు పైకి వాణ్ణి నానా మాటలూ అన్నా లోలోపల వాడి పాలన కోసం తపించేవాళ్ళు ఎట్లాగైనా వాడి అనుగ్రహం సంపాదించి రాజవీధి నుండి సందులలోకీ గొందులలోకీ తరమబడిన వాళ్ళు పైకి వాణ్ణి నానా మాటలూ అన్నా లోలోపల వాడి పాలన కోసం తపించేవాళ్ళు ఎట్లాగైనా వాడి అనుగ్రహం సంపాదించి రాజవీధి కెక్కటానికి రాజవీధికి పొయ్యే సందులలో జనం కిటకిటలాడుతూ ఒకరినొకరు తోసుకునేవాళ్ళు. వాడి దర్శనం అయితే చాలునని ఒకర్ని వెనక్కు తోసి మరొకరు ముందుకు వచ్చేవాళ్ళు. ధనంగాడి కొరడా దెబ్బలను కూడా ముందున్నవాళ్ళు లక్ష్యం చేసే వాళ్ళుకారు.

కులంగాడిమీద విశ్వాసంకొద్దీ కోట్లాది జనం తరతరాలు అతి నీచమైన జీవితం జీవించారు. అధికారంగాడి కెదురాడే అనేకమంది అక్రమ శిక్షకు లోనై అవసరమైనప్పుడు ప్రాణ త్యాగం కూడా చేశారు. కాని ధనంగాడి మహత్యం ఏమిటో వాడికోసం ప్రతి తరంలోనూ అనేక కోట్లమంది మనస్ఫూర్తిగా బలి అయినారు. కేవలమూ వాడి అనుగ్రహం పొందలేకా, కోల్పోయీ ఆత్మహత్యలు చేసుకున్నవాళ్ళ సంఖ్యే ఎంతో పెద్దది.

అయితే ధనంగాడు జాస్తిగా రాజ వీధులలోనే తన పరిపాలన సాగించటం కులంగాడికి చాలా కలిసివచ్చింది. అధిక సంఖ్యాకులైన జనం గల్లీలలోనూ, సందు గొందుల్లోనూ ఉండి ధనంగాడి మొహమైనా చూసిన పాపాన అయినా పోయినవారుకారు. (ధనంగాడి పాలనలో ఈ సందులు జాస్తిగా విస్తరించి, పూర్వం ఎన్నడూ లేనంత అనారోగ్యకరంగా పరిణమించినట్టు రుజువయింది.) వృద్ధాప్యంలో కులంగాడు తన దర్జాయావత్తూ ఈ సందు గొందులలో వెలగబెట్టాడు. ఇక్కడ ఉండే దౌర్భాగ్యులు, ఇంకా ప్రపంచాన్ని పాలిస్తున్నవారు కులంగాడేనని నమ్మారు. ధనంగాడు వట్టిపాపి అనీ, వాడి పరిపాలనలో ఇహం ఉందేమోగాని పరం బొత్తిగా లేదనీ, ఇహంకంటె పరమే చాలా ముఖ్యమనే విషయం నిస్సందేహమని కులంగాడు ప్రచారం చేసి జనాన్ని నమ్మించాడు.

వీడి ప్రచారాన్ని నమ్మనివాళ్ళున్నారు. ఈ సందులు గొందులు ఇంత అనారోగ్యకరంగా దుర్గంధపూరితంగా ఉంచినందుకు వారు ఈ కులంగాణ్ణి తప్పుపట్టారు. అందులో కొందరు ప్రాపంచిక సుఖంయావత్తూ రాజవీథులలోనే ఉందని కూడా గుర్తించారు. రాజవీథులలోకి పోవటానికి జీవితమంతా ధారపోసి విఫలు లైనవాళ్ళూ, ధనంగాడి తడాఖా విని రాజవీథి నుంచి పారిపోయి సందులలో నివసించటానికి వచ్చినవాళ్ళు కులంగాణ్ణి తెగ పొగడి వాడి ప్రచారంలో తమ వృద్ధాప్యం గడిపి ధన్యులైనారు.

కులంగాడు మంచానపడింది ఈ అనారోగ్య కరమైన సందులలో తిరగడంవల్లనేనని కొందరు శాస్త్రవేత్తలు అభిప్రాయపడుతున్నారు. ఏమయితేనేం వాడికి వ్యాధి అంటుతుందని ఎవరూ విశ్వసించక పోవటంచేత వాడికి సరి అయిన చికిత్స జరగలేదు. కాకపోయినా కాటికి కాళ్ళు చాచుకున్నవాడికి చికిత్స యేమిటి? అయితే ధనంగాడి శకం కూడా అయిపోయినట్లు కనిపిస్తున్నది. ఎక్కడినించో ఒక బ్రహ్మాండమైన నీడ వచ్చి పడుతున్నది. దీని ప్రమాణం చూస్తే ఈ వచ్చే మనిషి మహారాక్షసుడి ప్రమాణం కలవాడల్లే కనిపిస్తుంది. ఈ నీడ చూస్తేనే ధనంగాడి గుండెల్లో రైళ్ళు పరుగెత్తుతున్నై. "ఆ వచ్చే భూతం మనల్నందర్నీ చదునుగా తొక్కేస్తుంది. దాని కాళ్ళకింద పడి మనం మన సంస్కారమూ, నాగరికతా, ప్రాణాలూ కోల్పోతాం!" అని ధనంగాడు కేకలు పెడుతున్నాడు.


ఎన్నడూ ధనంగాడి దయకు పాత్రులు కానివాళ్ళు సయితం, లోపల యే మూలో, వాడిమీద గౌరవం ఉండి యీ భూతాన్ని గురించి భయపడుతున్నారు. కాని కొంతమంది కుర్రకారు యీ సందుల్లో జనాన్ని భయపడవద్దని హెచ్చరిస్తున్నారు.

"ఈ వచ్చే భూతం మన పీడలన్నీ విరుగుడు చేస్తుంది. రాజవీథులూ, సందులూ యేకం చేస్తుంది. ఈ దిక్కుమాలిన సందులూ, దుర్గంధపూరితమైన యిళ్ళూ నాశనమవుతాయని యేడుస్తారెందుకు? సంతోషించక! ఈ ధనంగాడి పరిపాలన అంతంచేసి యీ భూతానికి స్వాగతం యివ్వండి!'

"కాని మన కులంగాడి పరిపాలన పోతే మన గతి యేమిటి?" అని గొందుల్లోవాళ్ళు గోలెత్తుతున్నారు.

ఈ లోపుగా కులంగాడి శరీరం కుళ్ళి దుర్వాసన కొడుతున్నది.

రచనా కాలం : సెప్టెంబర్ 1945



వ్యాసం

**ఇది లెనిన్ శత వర్ధంతి సంవత్సరం....**



# 1917-22 మధ్యకాలంలో సోవియట్ రష్యాలో వికసించిన చిత్రకళ, శిల్పకళ

అనువాదం : కొత్తపల్లి రవిబాబు

**లలితకళల** గురించి క్లారా జెట్కిన్‌తో మాట్లాడుతూ లెనిన్ ఇలా అన్నారు. దీనిని క్లారా జెట్కిన్ తను 1924 జనవరిలో రాసిన 'లెనిన్ జ్ఞాపకాలు' (Reminiscences of Lenin) అనే వ్యాసంలో ఉదహరించారు.

"కళలపై మన అభిప్రాయాలు ముఖ్యంకాదు. కొన్ని వందలో, వేలో వున్న మనలాంటి వారికి కళలు ఏమి ఇస్తాయి అన్నది ప్రధానం కాదు. కళ ప్రజలది. శ్రామికవర్గ ప్రజలలో అది ప్రగాఢమైన ప్రభావాన్ని కలిగించాలి. అది తేలిగ్గా అర్థమయ్యేట్లు వుండి వారి అభిమానాన్ని చూరగొనాలి. దాని మూలాలు ప్రజల ఆలోచనల్లో. భావాలలో ఆకాంక్షలతోపాటు అభివృద్ధి చెందాలి. వారిలో వున్న కళాత్మకతను బయటకు తెచ్చి వారిని కళాకారులుగా తీర్చిదిద్దాలి. శ్రామిక జనావళి, రైతాంగం కనీసం మాడిపోయిన రొట్టె కూడా లేని పరిస్థితుల్లో అతితక్కువ సంఖ్యలో వున్న కొందరికి మాత్రమే కేకు, పంచదార మనం ఇవ్వాలా? అంటే ఈ వాక్యాన్ని వున్నది వున్నట్లుగా గాక, దానిలో దాగిన అసలు భావాన్ని తీసుకోవాలి. కార్మికులు రైతులు ఎప్పుడూ మన కళ్ళముందు మెదలుతూ వుండాలి. వారిని పరిగణనలోకి తీసుకొని వారితో వ్యవహరించాలి. కళలు, సంస్కృతి అనే అంశాలలో కూడా! "కళ సాధారణ ప్రజలకు సన్నిహితం కావాలి. ప్రజలు కళలను ఆదరించాలి. ముందుగా సమాజంలో విద్య, సంస్కృతి స్థాయిని పెంచాలి".

ఒక సమాజంలో – ఆదిమ సమాజం నుండి నేటివరకూ – భవిష్యత్తులో కూడా లలితకళల ప్రభావం గురించి ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. అవి మానవ జీవన సంస్కృతిలో ఒక భాగం. 1917 అక్టోబర్‌లో విప్లవం విజయవంతమై, పాలనాధికారం రష్యాలో అశేష శ్రామికుల చేతుల్లోకి వచ్చిన తర్వాత కమ్యూనిస్టు (బోల్షెవిక్) పార్టీ లెనిన్ నాయకత్వాన, ఒకవైపు కరువునూ, అంతర్యుద్ధాన్నీ ఎదుర్కొంటూనే లలితకళల అభివృద్ధివైపు దృష్టిపెట్టి కృషిచేసింది. 1917 నుంచీ 1921 వరకూ – కేవలం ఐదేళ్ళ కాలంలో చిత్రలేఖనం, శిల్పంకు ప్రోత్సాహానిచ్చి వాటిని ప్రజోపయోగకరంగా తీర్చిదిద్దింది.

విప్లవ విజయానంతరం లెనిన్ ఆనాటి విద్యాశాఖ ప్రజాకమిస్సార్‌గా వున్న విద్యావేత్త అనటోల్ లునచార్స్కీతో విప్లవ వీరులకు జ్ఞాపక చిహ్నాలు ఏర్పాటు చేయడం గురించి సలహా ఇచ్చారు. మాస్కోలోనూ, రష్యన్ సోవియట్ ఫెడరేటివ్ సోషలిస్ట్ రిపబ్లిక్ (RSFSR)లోని నగరాలలో ప్రతిష్టించాల్సిన 76 మంది విగ్రహాల జాబితా లెనిన్ తయారుచేశారు. నగరాలలోని ప్రధాన రహదారుల్లోనూ, నాలుగు రోడ్ల కూడలిలోనూ ఈ జ్ఞాపక చిహ్నాలను 1918 వసంతకాలం నాటికి పూర్తికావాలని నిర్ణయించారు. ఈ జ్ఞాపక చిహ్నాలలో మార్క్స్, ఎంగెల్స్‌లతోపాటు, 18, 19 శతాబ్దాలనాటి రాద్రేవ్, పెస్టెల్, హెర్జెన్, చెర్నాషెవస్కీ, ఖైతురిన్, సోఫియా పెట్రోవస్కాయ, డాంటన్, మరాట్, సెయింట్ సైమన్, ఫోరియర్, గారిబాల్డి, బ్లాంక్వీ, జౌరస్.... ఇలా రచయితలు, పండితులు, సంగీతకారులున్నారు.

చాల తక్కువ సమయంలో శిల్పులు వీటిని తయారుచేయాలి. అది కరువుకాలం. ప్రజలందరిలో భాగమైన శిల్పులు సరైన ఆహారం లేక బలహీనంగా వుండి పూర్తికాలం పనిచేయలేని పరిస్థితిలో వుండి కూడా లక్ష్యాన్ని చేరుకున్నారు. అప్పట్లో వారికి బ్రాంజ్, మార్బుల్, గ్రానైట్ అందుబాటులో లేవు. కాంక్రీటుతోనూ, ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తోనూ తయారుచేశారు. వీటిలో లియోనిడ్ షెర్వుడ్‌తో తయారుచేసిన అలెగ్జాండర్ రాడిశ్చవ్ విగ్రహం మొట్టమొదటిది.

1918 అక్టోబరు విప్లవ మొదటి వార్షికోత్సవం నాటికి చాలావరకు అనుకున్న విగ్రహాలు తయారయ్యాయి. వీటిలో "శాంతి కోసం పోరాడుతూ మరణించిన అమరుల కోసం", అనే శిల్పమూ, 'జాతీయ సౌభ్రాతృత్వం' అనే శిల్పమూ ప్రసిద్ధమైనవి. 19వ శతాబ్దపు విప్లవకారుడు మైకేల్ బకూనిన్ శిల్పాన్ని బోరిస్ కొరోలియల్ క్యూబిజం పద్ధతిలో తయారు చేశాడు. అయితే ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో తయారు చేయడం వల్ల ఇవి కాలక్రమేణా శిధిలమయ్యాయి.

'ప్రతి వార్షికోత్సవం విప్లవం కొరకు కృషి చేసిన వీరులను జ్ఞాపకం చేసుకునే రోజులాగా వుండాలి' అన్నాడు లెనిన్. విగ్రహావిష్కరణ జరిగే రోజు సెలవు ప్రకటించేవారు. ప్రజలు పెద్దఎత్తున హాజరై పండుగ వాతావరణం సృష్టించేవారు. ఈ కార్యక్రమాలలో వీలున్నచోటల్లా లెనిన్, ఇతర నాయకులు పాల్గొనేవారు.

ఇవన్నీ గతాన్నీ, వర్తమానాన్నీ అనుసంధానిస్తూ సుందర భవిష్యత్తు వైపుకు చూస్తున్న భావాన్ని వీక్షకులలో కల్గించేవి. "ది సోవియట్ కాన్‌స్టిట్యూషన్" అనే నికొలాయ్ ఆండ్రెయేల్ శిల్పమూ, ఒసిపోడ్ తయారు చేసిన 'స్వాతంత్ర్య విగ్రహం' ప్రసిద్ధమైనది. టాట్లిన్ అనే శిల్పి, మూడవ ఇంటర్నేషనల్ కోసం తయారుచేసిన 'టవర్ మాన్యుమెంట్'పై ప్రసిద్ధ రచయిత, విమర్శకుడు ఇల్యా ఎహ్రెన్‌బర్గ్ "ఒక కన్నంలోంచి 21వ శతాబ్దాన్ని చూస్తున్న అనుభూతి కలుగుతోంది" అని ప్రశంసించాడు.

వెల్‌రుడ్నెవ్ అనే శిల్పి తయారుచేసిన శిల్పం "విప్లవ పోరాటంలో మరణించిన అమరవీరులు"ను పెట్రోగ్రాడ్‌లో ఫీల్డ్ ఆఫ్ మార్స్‌లో ప్రతిష్ఠించారు. దాని పీఠంపై ఈ క్రింది వాక్యాలు చెక్కారు.

"ఒక గొప్ప ఆశయం కోసం మరణించినవారు అమరులు. ప్రజల కోసం తమ ప్రాణాలు అర్పించినవారు, సుందరమైన భవిష్యత్తు కోసం కృషిచేస్తూ చనిపోయినవారు ప్రజల హృదయాలలో చిరస్థాయిగా వుంటారు".

1917 నాటికే రష్యాలో వున్న చిత్రకళా ప్రదర్శనశాలలు, శిల్పాలు మొదలైనవాటి రక్షణ గురించి ఒక ప్రకటన వెలువడింది. "మన పూర్వీకులు వీటిని మనకు వారసత్వంగా వదలి వెళ్ళారు. ఇప్పుడు ఇవన్నీ ప్రజలందరివీ. ఈ చిత్రాలు, విగ్రహాలు, భవనాలు మన పూర్వీకుల ఆత్మిక బలాన్ని సూచిస్తాయి".

1919 ఏప్రిల్‌లో అన్ని రకాల కళాకారుల చిత్రాలతో ఒక పెద్ద కళాప్రదర్శనను వింటర్ పాలెస్‌లో ఏర్పాటుచేశారు. దేశంలో వున్న చిత్రకళా గ్యాలరీలు, చిత్రాలు, శిల్పాలు అన్నిటినీ జాతీయం చేశారు. ప్రజలు శ్రామికుల, సైనికుల గురించిన చిత్రాలు, జార్ చక్రవర్తి భవనాలను చూసి వెళ్ళేవారు. చిత్రకారులు వ్యక్తిగతంగా కూడా తమ చిత్రాలను ప్రదర్శించేవారు. స్ఫూర్తిదాయకంగా వున్న చిత్రాలను ప్రభుత్వమే కొనుగోలు చేసేది కళాకారులకు స్టూడియోలు ఏర్పాటు చేసేది.

ఇందాకే ప్రస్తావించినట్లు అది గడ్డు సమయం. ఆహార కొరతతో కరువు పరిస్థితులు ఏర్పడిన కాలం. పెట్రోవ్ వోడ్కిన 1918లో 'హెర్రింగ్' (సముద్రపు చేప) అనే చిత్రంలో ఆనాటి పౌరులకు లభిస్తున్న పరిమిత రేషన్ ఆహారం వస్తువుగా చిత్రించారు. ఆనాటి కరువు పరిస్థితులకు ప్రతీక ఈ చిత్రం.

ప్రసిద్ధ చిత్రకారుల చిత్రాలు హోటళ్ళలో ఏర్పాటు చేసుకున్నారు. 1918లో విప్లవ ప్రథమ వార్షికోత్సవ వేడుకల సందర్భంగా కొత్తగా తయారైన చిత్రాలు, శిల్పాలు, జెండాలు, ప్లకార్డులు, స్థూపాలు మొదలైనవాటిని పెట్రోగ్రాడ్‌లోనూ, మాస్కోలోనూ అలంకరించారు.

ఎన్నో పోస్టర్లు స్ఫూర్తివంతమైన నినాదాలతో, చిత్రాలతో తయారు చేశారు. మయకొవస్కీ ఒక్కడే వందలాది పోస్టర్లు రూపొందించాడు. ఆ ప్లకార్డులు, పోస్టర్లపై కవిత్వ పంక్తులు ఉదహరించేవాడు. లెబెడేవ్ రూపొందించిన "రష్యా సరిహద్దుల రక్షణలో ఎర్రసైన్యం, నౌకాదళం" అనే పోస్టరు ఒక చారిత్రక పత్రమంత విలువను సంపాదించింది.

చిత్రాలు, పోస్టర్లు విరివిగా రైళ్ళలోనూ, ఓడల్లోనూ, రవాణా వాహనాలపైనా అంటించి ప్రచారం చేసేవారు. దీనిని వారు Agitation ప్రాపగాండా (agit prop) అంటే ఆందోళనల ప్రచారం అని పిలిచేవారు.

నికొలాయ్ ఆండ్రియేవ్ (1878–1932) రూపొందించిన లెనిన్ నిలువెత్తు విగ్రహమూ, రొమ్ము వరకు వున్న లెనిన్ విగ్రహమూ ఒక గొప్ప శిల్పంగా పరిగణింపబడింది. జాన్ రీడ్ (1887–1920) తన పుస్తకం 'ప్రపంచాన్ని కుదిపేసిన ఆ పదిరోజులు'లో లెనిన్‌ను వర్ణించిన – "చిన్ని కళ్ళు, చట్టి ముక్కు, వెడల్పైన నోరు, అనాకర్షణీయమైన రూపం" – కు ప్రతీకగా నిలబడింది ఆ శిల్పం.

కరెన్సీ నోట్లపైనా, నాణేలపైనా పింగాణీ కప్పులపైనా – ఇలా ప్రతిచోటా నూతన సమాజం, నూతన మానవుడు విభిన్న చిత్రాలలో ప్రత్యక్షమయ్యారు. "పేద రైతాంగ కమిటీ సమావేశం" అనే మొరావోవ్ (1806–1874) చిత్రం నూతన మానవుని కృషిని చిత్రించింది. కాన్‌స్టాంటిన్ యువాన్ 'ఎ న్యూ ప్లానెట్' (ఒక కొత్త గ్రహం), కుస్టోడీవ్ 'ది బోల్షెవిక్', ప్రసిద్ధ చిత్ర కళాఖండాలు. "రవాణా మరల సాధారణ స్థితికి వచ్చింది" (Transport Return to Normal) అనే బోరిస్ యెకోవ్లెవ్ (1890–1972) చిత్రంలో రైలుపట్టాలు, పొగ, రైల్వే వాగన్లు, లోకోమోటివ్‌లు మాత్రమే రాబోయే మంచిరోజులను సూచిస్తూ వుంటుంది. చిత్రంలో ఎక్కడా ప్రకృతిగానీ, మనుషులు గానీ వుండరు.


రాబర్ట్ ఫాల్క్ (1886–1958) చిత్రించిన 'వర్కింగ్ వుమన్' చిత్రమూ, పెట్రోవ్ వోడ్కిన్ చిత్రించిన 'ఆఫ్టర్ ది బాటిల్' (After the Battle) చిత్రమూ ఆనాటి ప్రజల పరిస్థితులను ప్రతిబింబిస్తూ వున్నాయి.

రష్యన్ విప్లవాన్ని చిత్రించిన ఐదు పెయింటింగ్‌ల పరిచయంతో ఈ వ్యాసం ముగిస్తాను.

1. The Uprising (పెల్లుబికిన ఉద్యమం). దీనిని క్లిమంట్ రెడెకో చిత్రించారు. 1924లో ప్రారంభించి, లెనిన్ చనిపోయిన తర్వాత పూర్తిచేశారు. మాస్కోలోని స్టేట్ ట్రెట్సకోవ్ గ్యాలరీలో వుంది.
2. The Petrograd Madonna : (Petrograd in 1918) ఈ చిత్రానికి 'పెట్రోగ్రాడ్ 1918లో' అని పేరు పెట్టినా, చిత్రంలో వున్న మహిళను ఉద్దేశించి అందరూ పెట్రోగ్రాడ్ మడొన్నా అని పెట్టుడు పేరు పెట్టారు. ఇది కూడా పైన పేర్కొన్న గ్యాలరీలో వుంది.
3. 'Beat the Whites with the Red Wedge' (1920) బోస్టన్ మ్యూజియం ఆఫ్ ఫైన్ ఆర్ట్స్‌లో వున్న ఈ లితోగ్రాఫిక్స్ సోవియట్ ప్రచార పోస్టర్ చిత్రాన్ని ఎల్. విస్కిట్‌జ్కీ చిత్రించారు.
4. The Defence of Petrograd (1928) – ఇది మాస్కోలోని సెంట్రల్ ఆర్మ్‌డ్ ఫోర్సస్ మ్యూజియంలో వుంది. అలెగ్జాండర్ డెయెంకా 1928లో చిత్రించారు.
5. Lenin on the Tribune (1930) – అలెగ్జాండర్ గెరాసిమోవ్ చిత్రం మాస్కోలోని స్టేట్ హిస్టారికల్ మ్యూజియంలో వుంది. ✷


1


2



3


4


5

వ్యాసం

# ఆజాదీ – అమృతకాల్ – అచ్ఛేదిన్ సింహావలోకనం – భవిష్యదర్శనం

– అడ్మిరల్ ఎల్. రామదాస్, విశ్రాంత భారత నౌకాదళాధిపతి

## సింహావలోకనం

1947 ఆగస్టు 14 అర్ధరాత్రి, ఆగస్టు 15 ఉదయం మనం మన భవిష్యత్తును నిర్ణయించుకున్న సమయానికి నేను 14 ఏళ్ళ యువకుడిని ఆనాడు 'స్వాతంత్ర్యం' అంటే నేను ఏం అర్థం చేసుకున్నానో చెబుతాను. మా వద్ద వున్న ఒక చిన్న రేడియో చుట్టూ చేరి నెహ్రూ ఆనాడు చేసిన ప్రసంగం విన్నాం.

1947 అగస్టు 15 తెల్లవారు ఝామున – ఇప్పటికీ 75 సంవత్సరాల తర్వాత కూడా స్పష్టంగా జ్ఞాపకం వుంది – ఇండియా గేట్ సమీపాన వున్న ప్రిన్సెస్ పార్క్‌కు, బెంగాలీ మార్కెట్‌లో వున్న మా ఇంటి నుండి పరుగెత్తుకుని వెళ్ళాను. లక్షలాది ఉత్సాహభరిత పౌరులతో బాటు నేను కూడా మొదటి ప్రధానమంత్రి జవహర్లాల్ నెహ్రూ భారత జాతీయ త్రివర్ణ పతాకను విప్పడమూ, అదే సమయంలో ఆఖరి వైస్రాయి, మొదటి భారత గవర్నర్ జనరల్ ఐన అడ్మిరల్ లార్డ్ లూయీ మౌంట్ బాటెన్ బ్రిటీషు జాతీయ పతాక యూనియన్ జాక్‌ను అవనతం చేయడమూ చూసాను.

మన స్వాతంత్ర్యం అనే తన్మయత్వంతో నిండిన ఆనాటి భావోద్వేగాలను నేనెన్నటికీ మరువలేను. ఆనాడే ఈ విశాల నేత్రాలు గల 14 ఏళ్ళ యువకుడు. లార్డ్ మౌంట్ బాటెన్ ధరించిన శ్వేతవస్త్రాలు, మెరుస్తున్న పతకాలు చూసి పరవశుడై నౌకాదళంలో చేరాలని తలిచాడు.

స్వాతంత్ర్యం లభించిన వెంటనే, పూణే సమీపంలోని ఖరక్‌వస్లాలో నేషనల్ డిఫెన్స్ అకాడమీ స్థాపించాలని నిర్ణయించారు. దానిని 1954 డిసెంబరులో ప్రారంభించారు. ఈ మధ్యకాలంలో నేను అప్పటికే వున్న ఆర్మ్‌డ్ ఫోర్సెస్ అకాడమీలో ఇంటర్ సర్వీసెస్ వింగ్‌లో చేరాను. మమ్మల్నందరికీ డెహ్రాడూన్ సమీపంలోని క్లెమంట్ టౌన్‌లోని పాత POW (prisoners of war) శిబిరంలో 1949 జనవరిలో వసతి కల్పించారు. 1950 డిసెంబరులో మేము ఉత్తీర్ణులయ్యే వరకు రెండేళ్ళపాటు ఇది మాకు స్వగృహంగా, మా పాఠశాలగా, మా శిక్షణా ప్రదేశంగా వుండింది.

మేమందరం ఆదర్శాలు మెండుగా కలిగినవారం. యువకులుగా ఈ స్వాతంత్ర్య దేశంలో మాకున్న అపారమైన అవకాశాల గురించి ఎంతో ఉత్సాహంగా ఆలోచిస్తున్నవాళ్ళం. మా మొదటి హెడ్‌మాస్టర్, జాక్ గిబ్సన్ భవిష్యత్తులో సేవారంగంలో అధికారులం కాబోతున్న మా మొదటి బాచ్ విద్యార్థులకు కొత్తగా రూపొందించుకున్న రాజ్యాంగం గురించీ, అది వాగ్దానం చేస్తున్న న్యాయం, సమానత్వం, స్వేచ్ఛ, సౌభ్రాతృత్వం గురించి పరిచయం చేశారు. ఇండియా రిపబ్లిక్‌గా మారిన 1950 జనవరి 26న రాజ్యాంగం అమలులోకి వచ్చింది. ఈ రాజ్యాంగమనే 'పవిత్ర గ్రంథం' నా జీవితంలో కార్యకలాపాలకు, భవిష్యత్తుకు సంబంధించిన నిర్ణయాలకు వెలుగును చూపే మార్గదర్శిగా కొనసాగింది. సైన్యంలో చేరేటప్పుడు మేమంతా రాజ్యాంగానికి కట్టుబడి వుంటామని వాగ్దానం చేశాం.

ఇక ఇప్పుడు వర్తమానానికి వస్తే అంటే ఆగస్టు 14 / 15 2022లో మనం ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ విస్తృతంగా జరుపుకుంటున్నాం. నేను 2022 సెప్టెంబర్ 5వ తేదీన 90వ ఏడాదికి చేరుతున్నాను. ఈ సెప్టెంబర్ 5ని మనం పూర్వదేశాధ్యక్షుడు డా॥ ఎస్. రాధాకృష్ణన్ జన్మదినాన్ని ఉపాధ్యాయ దినోత్సవంగా జరుపుకుంటున్నాం.

అవును. మన స్వతంత్ర భారతదేశ ప్రయాణం సుదీర్ఘంగా సాగింది. కాని ఈరోజు నా మదిలో మెదిలే మొదటి ఆలోచనలు ఏమిటంటే 75 ఏళ్ళ తర్వాత కూడా మన పిల్లలు అన్యాయమైన వివక్షాపూరితమైన విద్యావిధానంలో మగ్గుతున్నారు. మరోవైపున అందరికీ న్యాయం, సమానత్వం, స్వేచ్ఛ వుండేట్లు చేస్తామని వాగ్దానం చేశారు.

పేదరికం, నిరుద్యోగం, నిరక్షరాస్యత సర్వత్రా చూస్తున్నాం. చాలా రంగాలలో మనం వాగ్దానం చేసిన లక్ష్యాలను చేరుకోవడంలో విఫలమయ్యాం. విశ్వవ్యాప్తంగా ఉన్న అభివృద్ధి కొలమానాలను మనం అందుకోలేకపోయాం.

అత్యధిక సంఖ్యలో బాలలు విద్యకు దూరంగా వున్నారు.

అత్యధిక విద్యార్థులు సరైన వసతులు లేని, నిర్లక్ష్యం చేయబడిన ప్రభుత్వ విద్యాలయాల్లో వుండి, 'డ్రాప్ అవుట్స్' పేరుతో స్కూళ్ళ నుండి గెంటివేయబడుతున్నారు. దీని ఫలితంగా ఎక్కువమందికి అధమ తరగతి విద్య అందుతుండగా, కొద్దిమంది శిష్టవర్గాలవారికి మంచి విద్య అందుతోంది.

ఈ పిల్లలకు, వారి కుటుంబాలకు 'స్వాతంత్ర్యం' అంటే ఏమిటని మనం మనల్ని ప్రశ్నించుకోవాలి.

స్వాతంత్ర్యం అంటే వెలిసిపోని మూడురంగుల జెండాలను తయారుచేయడం కాదు. ప్రతి ఇంటిపైనా దాన్ని ఎగురవేయమని అధికారులు ఆజ్ఞాపించడం కాదు!

మనది నిజమైన ప్రజాస్వామిక రిపబ్లిక్ అయితే, ఒడిదుడుకులకు తట్టుకొని నిలబడిన మన రాజ్యాంగ వ్యవస్థలు క్రమంగా శిథిలం కావడం

చూసేవాళ్ళంకాదు. మన పౌరులనే, భయపెట్టి అదుపులో పెట్టడానికి రాక్షస చట్టాలను ప్రవేశపెట్టేవారంకాదు.

స్వాతంత్ర్యం గురించి ఆలోచించడం ప్రారంభిస్తే ఎన్నో అంశాలు మనముందు ప్రత్యక్షమౌతాయి.

2. ఇక మనం వాడుతున్న పదబంధం 'అమృతకాలం' గురించి చర్చిద్దాం.

నిజం చెప్పాలంటే ఈ పదబంధాన్ని నేను పూర్తిగా మరచిపోయాను. ప్రొఫెసర్ గూగుల్ సహాయం తీసుకోవాల్సి వచ్చింది. దీని గురించి, దీని వేర్వేరు రూపాల గురించి, దీని సిద్ధాంతం గురించి మాట్లాడేవారి మనస్తత్వాన్ని బట్టి కొన్ని అర్థాలను మనం పరిశీలించవచ్చు. ఈ పదబంధం మూలం ఒకచోట ఇలా వుంది.

"ఈ పదబంధం వైదిక జ్యోతిష్యం నుండి వచ్చింది. అమృతకాలం అంటే అనంతమైన ఆనందానికి దోవ తెరవడం. ఒక నూతన కార్యక్రమాన్ని ప్రారంభించడానికి అమృతకాలం అత్యుత్తమమైనది".

'మిలీనియం పోస్టు'లో 'అమృతకాలం' సమర్థకుడు ఇలా అంటున్నాడు : "ఒక పాతిక సంవత్సరాల కాలానికి ప్రధానమంత్రి 'అమృతకాలం' అనే పేరు పెట్టారు. ఈ పాతికేళ్ళలో భారతదేశం ప్రపంచ శక్తిగా ఎదగాలి. తన ప్రత్యేకతను చాటుకోవాలి. ఈ అమృతకాలం 75వ స్వాతంత్ర్యదినం నుండి 2047లో స్వాతంత్ర్య శతాబ్ది వరకు వర్తిస్తుంది. కొన్ని దశాబ్దాలుగా నెహ్రూ పాలన ఉత్తుత్తి సిద్ధాంతాలతోనూ, శూన్యంగానూ సాగింది".

చాలా పత్రికలు మన ఆర్థికశాఖా మంత్రి శ్రీమతి సీతారామన్ పదేపదే వుపయోగిస్తున్న 'అమృతకాల్' పదాన్ని బడ్జెట్ ప్రవేశబెట్టిన సందర్భంగా ఉపయోగించారు.

"మనం ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ జరుపుకుంటున్నాం. ప్రస్తుతం మనం అమృత కాలంలోకి ప్రవేశించాం. స్వాతంత్ర్య శత వార్షికోత్సవంపై రాబోయే పాతిక సంవత్సరాలు కృషిచేద్దాం. ఈ బడ్జెట్ కూడా భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని అమృతకాలంకు సమాంతరంగా రూపొందించాం. ఇది యువజనులకు, మహిళలకు, రైతులకు, షెడ్యూలు కులాలకు, తెగలకు లాభదాయకంగా వుంటుంది".

మరోపత్రం ప్రకారం – అమృతకాలం ప్రతి రంగంలోనూ అత్యుత్తమ స్థాయి సాధించడం లక్ష్యంగా వుంటుందనీ, పౌరుల జీవితాలను మెరుగుపరచడం ధ్యేయంగా వుంటుందనీ, గ్రామాలకు, పట్టణాలకు మధ్య అంతరాన్ని తగ్గిస్తుందనీ, ప్రజల జీవితాలలో ప్రభుత్వం కల్పించుకోవడాన్ని తగ్గిస్తుందనీ ఈ పత్రం ప్రకటిస్తోంది. మరికొన్ని మరింత విమర్శనాత్మకంగానూ, సూక్ష్మంగానూ వున్నాయి.

"2022–23 కేంద్ర ప్రభుత్వ బడ్జెట్ ఏదైనా కావచ్చుగాని బడ్జెట్టే కాదు. అది బంగారు భవిష్యత్తును సూచిస్తోంది. కాని ఆర్థికంగా బలోపేతమయ్యే చర్యలు సూచించలేదు. ఆర్థికమంత్రి సోషల్‌మీడియాలో వాడుతున్న అమృతకాలం పదబంధాన్ని పదేపదే వాడారు. ఇండియా 75 సంవత్సరాల ఉత్సవం నాటికి చేసిన వాగ్దానాల గురించి మాత్రం ప్రస్తావనలు లేవు".

"ఆర్థికవ్యవస్థ నాలుగు ట్రిలియన్ల డాలర్లకు (ఒక ట్రిలియన్ అంటే లక్ష కోట్లు రూపాయలలో – దానిని డాలర్ల నుండి రూపాయలలోకి మార్చుకోండి – అను) చేరేట్లు అభివృద్ధి సాధించడం, మహిళలకు ఉద్యోగాలను కల్పించడం, రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేయడం, పేదరికాన్ని పారదోలడం, వీరి వచ్చే 25 ఏళ్ళ వ్యూహంలో ఇలా మొత్తం 41 లక్ష్యాలున్నాయి. వీటిలో 17 లక్ష్యాలను 2022లోనే సాధించాను కున్నారు. ప్రభుత్వం మనలను అమృత కాలంలోకి నేరుగా తీసుకెళ్తోంది గనుక ఈ లక్ష్యాల సాధన గడువును 2047 నాటి 'సరికొత్త ఇండియా'కు పొడిగించారు. అది భారత స్వాతంత్ర్య శతవార్షిక సంవత్సరం. ఈ ఏడాది చేరాల్సిన లక్ష్యాలను, రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేసే ఒక బృహత్తరమైన, క్లిష్టమైన లక్ష్యం గురించి ప్రస్తావనే లేదు.

ఆర్థికవ్యవస్థ పరిమాణం గురించి కూడా ఏమీ చెప్పడంలేదు. వివిధ మీడియా సంస్థలవారితో మాట్లాడుతూ ఆర్థికమంత్రి "ఇండియా 5 ట్రిలియన్ల డాలర్లకు చేరే మార్గంలో వుంది" అని చెప్పారు.

నా ఇతర మిత్రులు ఈ విషయంపై వ్యాఖ్యానిస్తారన్న అభిప్రాయంలో నాకేమీ సందేహం లేదు. అయితే కేవలం గతంలో మిలటరీ సర్వీసు చేసిన వ్యక్తిగా; 'అమృతకాలం' గురించి నా భయాలు నాకు వున్నాయి.

ఈ 'అమృతకాలం' గురించి చేసే భజన అంతా ప్రజలను కీలకమైన విషయాల నుంచి, వారు పడే బాధల గురించి దృష్టి మరలించే మరో ప్రయత్నంగా నాకు అనిపిస్తోంది.

ఈ పాలనలో సైనిక దళాలలో రాజకీయాలను ప్రవేశబెట్టడం క్రమంగా పెరుగుతోంది. ఈ కాలంలో జరుగుతున్న అనేక సంఘటనలపై వివిధ రంగాలకు చెందిన పెద్దలు చేస్తున్న విజ్ఞప్తులను సైనికదళాల అధిపతి ఐన దేశ అధ్యక్షురాలు, ఎన్నికల ప్రధానాధికారి పట్టించు కోకపోవడం నిరాశ కలుగచేస్తోంది. సైనిక విభాగాలు రాజకీయాలకు దూరంగా వుండే సంప్రదాయం క్రమంగా తగ్గిపోతోంది. 'ఒక ర్యాంకు, ఒక పెన్షన్' విధానాన్ని వాగ్దానం చేసినా అమలుచేయలేదు. ఇదంతా దేశ రక్షణకు గానీ, వ్యక్తుల రక్షణకు గానీ ఉపయోగపడదు.

## ప్రజలను వంచించే మరో నినాదం – అచ్ఛేదిన్ గురించి

రాజ్యాంగంలో రాసుకున్నట్లు సమన్యాయం, సమానత్వం, స్వేచ్ఛ అనే లక్ష్యాలకు మనం చేరుకోగలిగామా అని మనకు మనం ఆత్మ పరిశీలన చేసుకోవాలి.

మనం ఉపాధ్యాయులుగా, సమాజంలో పెద్దవారిగా, పౌరులుగా విద్యావిధానం ద్వారా నేర్చుకుంటున్న విషయాలపై, విద్య యొక్క ధ్యేయంపై లోతుగా ఆలోచిస్తున్నామా?

మన విద్యాసంస్థలు, ఉపాధ్యాయులు తమ విద్యార్థులను స్వంతంగా ఆలోచించేవారిగా, ప్రశ్నించేవారిగా, హేతుబద్ధంగా ప్రవర్తించేవారిగా, తమ భావాలను వ్యక్తపరిచేవారిగా తయారు చేస్తున్నారా?

మన యువజనుల్లో శాస్త్రీయ అభినివేశం కల్పించడంలో ముందడుగు వేశామా లేక ఇంకా మనం మూఢవిశ్వాసాలతోనే వున్నామా?

తొందరపడి చేసిన పెద్దనోట్ల రద్దు కార్యక్రమం, కోవిడ్ కాలంలో విధించిన లాక్‌డౌన్, జీఎస్టీని విధించడం, అగ్నిపథ్, అగ్నివీర్ పథకాలు వల్ల సమాజపు అట్టడుగు పొరల్లోని సాధారణ ప్రజల సమస్యలు పట్టించుకొని పరిష్కరించడంలో మనం విఫలమయ్యామా? ఇదే సమయంలో అభద్రతాభావం సృష్టించిన సి.ఏ.ఏ, ఎన్.ఆర్.సి లకు వ్యతిరేకంగా చేసిన నిరసనలను మనం మరచిపోరాదు.

పైన పేర్కొన్నవన్నీ, పేద, వలస కార్మికులకు, రైతులకు, ఆదివాసీలకు, మైనారిటీలకు ఎంతో కష్టనష్టాలను కలుగచేసాయనడంలో నాకెంతమాత్రం సందేహం లేదు.

చివరగా – మన రాజ్యాంగ ప్రవేశికలో వాడిన ఒక కీలకమైన పదం – సౌభ్రాతృత్వం గురించి మీ దృష్టికి తేవాలనుకుంటున్నా. రాజ్యాంగ నిర్ణయసభ మొదటి మూడు అంశాలను అంగీకరించిన తర్వాత ఒక ఏడాదికి బాబాసాహెబ్ అంబేద్కర్ ఈ నాలుగోది కలిపారన్న విషయం చాలమందికి తెలియదు.

గతంలో సైన్యంలో పనిచేసినవానిగా, సైనిక దుస్తులు ధరించిన వాళ్ళంగా, మేము కులం, మతం, జాతిపరంగా ఎవరిపట్లా వివక్ష చూపించము అని చెప్పడానికి గర్వపడుతున్నాను.

మా నౌకాదళంలో వాడుకలో వున్నట్లు – కలసి ఈత కొడదాం లేక కలసి మునిగిపోదాం.

1947 నాటి మతహింసను వారసత్వంగా – అహింసాయుత చర్యలను యువకునిగా దేశ విభజనకు ముందు వ్యక్తిగతంగా చూచినవానిగా ముందుకు తీసుకుపోతూ అన్ని రాజకీయ పార్టీలు ఎన్నికల రాజకీయం కోసం వాడుకుంటున్న దురదృష్టకర సందర్భంలో మనమున్నాం. ఈనాటి పాలకుల వివక్షాయుత సిద్ధాంతాలతో ఈ మతహింస కలసి – ఆర్ఎస్ఎస్ సిద్ధాంతంపై ఆధారపడి – ప్రజాస్వామ్యాన్ని అతి పెళుసుగా, అస్థిరపరిచాయి.

'ధర్మసంసద్' పేరుతో అల్పసంఖ్యాక మతంవారిని మొత్తంగా చంపివేయమని పిలుపునిచ్చే ఇండియాలో – ప్రత్యేకంగా ముస్లిములను ఒక జాతిగా ఈ దేశంలో అంతం చేయమనే ఇండియాలో – సైనిక దళాలను కూడా వారికి వ్యతిరేకంగా ఆయుధాలు పట్టమని చెప్పే ఇండియాలో రాజ్యాంగ మౌలిక సిద్ధాంతం – సౌభ్రాతృత్వ వాగ్దానం భగ్నమైపోతున్నాయి. మరో 'ధర్మ సంసద్' మనుధర్మంపై వర్ణ సిద్ధాంతంపై ఆధారపడిన కొత్త రాజ్యాంగ రచనను బహిరంగంగా సమర్ధించింది.

కనుక ఈ స్వాతంత్ర్య 75వ వార్షికోత్సవం తీవ్రమైన ఆత్మ పరిశీలన చేసుకోవాల్సిన సమయం. దీనిని ముగించేముందు, మరాఠీ భాషలో ఈరోజు ఉదయం నాకందిన సందేశాన్ని మీతో పంచుకుంటున్నాను.

"సాబ్

ముందు మా పళ్ళాలు వాయించమని మొదట చెప్పావు

తర్వాత దీపాలు వెలిగించమన్నావు

మూడురంగుల జాతీయ జెండాను మా ఇళ్ళపై ఎగుర వేయమన్నావు

అదంతా బాగానే వుంది

కానీ

ఏనాడైనా మా పళ్ళేలలో తినడానికి అన్నం వుందా లేదా అని తెలుసుకోవడానికి ప్రయత్నించావా?

దీపాలు వెలిగించడానికి నూనె వుందా?

జెండా ఎగురవేయడానికి ఇల్లంటూ ఏదైనా వుందా?

జైహింద్!!"

మన స్వాతంత్ర్య పునాది అపాయంలో వుంది. ప్రక్కదారులు పట్టించే 'అమృత కాలం' నుండి తప్పించుకోవచ్చు. ఇక 'అచ్ఛేదిన్' సాధించడానికి చాల చాల సుదీర్ఘమైన ప్రయాణం చేయాల్సి వుంటుంది.

కాని ఇప్పటికీ నాకు రాజ్యాంగం మీదా, ప్రజల శక్తిపై అపారమైన నమ్మకముంది. అందరం కలసి "మనం – దేశ ప్రజలం – నిజంగా స్వతంత్రం, సమానత్వం, వాక్స్వాతంత్ర్యం – అన్నిటికన్నా ముఖ్యంగా సౌభ్రాతృత్వం – మానవత్వం సాధించడానికి కృషిచేయాలి'. ✺

# చిత్రకారుడు, ప్రగతిశీలవాది 'దాసి' సుదర్శన్ మృతి



**చిత్రకారునిగా,** జర్నలిస్టుగా, ఫోటోగ్రాఫర్‌గా, కళాదర్శకునిగా, డ్రాయింగ్ టీచర్‌గా విశేష కృషి చేసిన ప్రగతిశీల సాహిత్యాభిమాని పిట్టంపల్లి సుదర్శన్ 1-4-2024న తన 72వ ఏట మిర్యాలగూడలో మరణించారు. ఆయన 2-2-1952లో జన్మించారు.

సుదర్శన్ తండ్రి మట్టయ్య. పౌరాణిక రంగస్థల నటుడు. వారి స్వగ్రామం చెండూరు. మిర్యాలగూడకు వలస వచ్చారు. సుదర్శన్‌కు విద్యార్థి దశ నుండి లలితకళలపై ఆసక్తి పెరిగింది. బి.ఏ., బి.ఇడి చదివి టైపింగ్ హయ్యర్ నేర్చుకొని, టి.టి.సి. పూర్తిచేసి 1978 నుండి నాగార్జునసాగర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చిత్రకళోపాధ్యాయునిగా పనిచేశారు. 2009 మార్చిలో ఉద్యోగ విరమణ చేశారు.

తెలంగాణలో నిజాం పరిపాలనలో దొరల దాష్టీకాన్ని చిత్రించిన బి. నరసింగరావు 'దాసి' చిత్రంలో జాతీయ స్థాయిలో ఉత్తమ దుస్తుల డిజైనర్‌గా ఆయన బహుమతినందుకున్నారు. 'మావూరు' లఘు చిత్రానికి అసోసియేట్ కళాదర్శకునిగా పనిచేశారు. 'ఈ చరిత్ర చెరిపేద్దాం' అనే లఘు చిత్రానికి కళాదర్శకునిగా 1984లో నంది అవార్డు అందుకున్నారు. రామానాయుడు చిత్రం 'హరివిల్లు'కు దుస్తుల డిజైనర్‌గా పనిచేశారు. గురజాడ, శ్రీశ్రీ, రావిశాస్త్రిలను పరిచయం చేస్తూ ప్రతి ఉన్నత పాఠశాలల్లో చిత్రకళా ప్రదర్శనలు నిర్వహించారు.

1991లో 'అల' కళల వేదిక స్థాపించారు. 1-10 తరగతులకు డ్రాయింగ్ సిలబస్‌ను రూపొందించే కమిటీలో సభ్యునిగా వున్నారు. 1992లో ఉత్తమ ఉపాధ్యాయునిగా ఎన్నికయ్యారు. ✺

దేశ విభజన వస్తువుగా సాహిత్యం, కళలు : 19

# జ్యోతిర్మయీదేవి బెంగాలీ నవల 'ఇపార్ గంగా, ఉపార్ గంగా'

- కొత్తపల్లి రవిబాబు

**బెంగాలీ** రచయిత్రి జ్యోతిర్మయీ దేవి సేన్ రాజస్థాన్‌లోని జైపూర్‌లో 23 జనవరి 1894లో జన్మించారు. తన 94వ యేట 17 నవంబరు 1988లో కలకత్తాలో మరణించారు.

ఆమె తాత, బ్రిటీషువారి పాలనా కాలంలో జైపూర్‌కు వలస వెళ్ళారు. ఆయన జైపూర్ సంస్థానపు మహారాజుకు దివాన్‌గా అంటే ప్రధానమంత్రిగా పనిచేశారు, మంచి చదువరి. ఆయన గ్రంథాలయంలో వున్న పుస్తకాలను జ్యోతిర్మయి చదివారు. ఆమె ఏ స్కూలుకూ వెళ్ళి చదువుకోలేదు. అంతా ఇంట్లో కూర్చుని సొంతంగా నేర్చుకున్న చదువే. ఆమెకు 10వ ఏట వివాహమైంది. ఆరుగురు పిల్లలు. ఆమె 25వ యేట భర్త ఫ్లూ జ్వరంతో మరణించారు. తన పిల్లలతో తలిదండ్రుల వద్దకు బెంగాల్ చేరారు. అక్కడ ఛాందస హిందూ వితంతు జీవితం గడిపారు. అంటే సమాజంలో ప్రక్కకు నెట్టివేయబడి, ఇంటి చాకిరీ చేస్తూ, ఒంటరి జీవితం గడపడమన్నమాట. లభించిన ఏకాంతం, తాతగారి గ్రంథాలయంలోని పుస్తక పఠనం ఆధారంగా రచనా వ్యాసంగంలో ప్రవేశించారు. జైపూర్‌లో వున్న కాలంలో రాజస్థానీ మహిళల జీవితాలను పరిశీలించి 10 కథలు రాశారు. అవి Behind Latticed Marble Inner Worlds of Women అనే పేరుతో పుస్తకంగా వెలువడింది. జైపూర్ రాచరిక కుటుంబాలలో స్త్రీల పరిస్థితి, స్త్రీల విద్య, ఉద్యోగాలు, ఆస్తిహక్కు, విడాకులు, హిందూ కోడ్‌బిల్లు, అస్పృశ్యత, దేశ విభజన – ఇలా పలు సమస్యలకు ఆమె తన వ్యాసాలలో, కవిత్వంలో, నవలల్లో, కథల్లో, జ్ఞాపకాలలో చిత్రించారు. బెంగాలీ అగ్రకులాలు కుటుంబాల పేర్ల వెనుక 'దేవి' అని తోక తగిలించుకునే సంప్రదాయంలో భాగంగా ఆమె పేరులో 'దేవి' చేరింది. అంతేకాని ఆమె పేరులో 'దేవి' లేదు.

'ఇపార్ గంగా ఉపార్ గంగా' నవలను బెంగాలీలో మొదట 1967లో 'ప్రవాసి' పత్రికలో 'ఇతిహాస స్త్రీ పర్వ' అనే పేరుతో ధారావాహికగా వెలువడింది. దీనిని 2005లో 'The River Churning' (నదీమథనం) అనే పేరుతో ఇంగ్లీషులోకి ఏనాక్షి చటర్జీ అనువదించారు. జ్యోతిర్మయిపై రాజాసేన్ మూడు భాగాలుగా యూట్యూబ్‌లో 44 నిముషాల డాక్యుమెంటరీని నిర్మించారు.

1946లో నౌఖాలీలో కథ ప్రారంభమౌతుంది. బెంగాల్‌లోని చిట్టగాంగ్ డివిజన్లో వున్న నౌఖాలీ జిల్లాలో 1946 అక్టోబరు, నవంబరు నెలల్లో ముస్లిములు హిందువులపై హింసాయుతమైన దాడులు జరిపారు. అటువంటి ఒక దాడిలో ఈ నవల కథానాయకురాలైన సుతార, ఆమె తలిదండ్రులు, అక్క ముస్లిముల చేతుల్లో హతులౌతారు. ఇల్లు తగల బెట్టేస్తారు. సుతార ఆ దృశ్యాలు చూసి, నిశ్చేష్టురాలై, స్పృహ కోల్పోతుంది. సుతార తండ్రికి సన్నిహితుడైన తమీజుద్దీన్ కుటుంబం ఆమెను రక్షిస్తుంది. సుతార ఆయన్ను తమీజ్ కాకా అని పిలుస్తుండేది. తమీజుద్దీన్ కూతురు సబీనా సుతారకు స్నేహితురాలు. ఇద్దరూ స్కూలులో కలిసి చదువుకున్నారు. తమీజ్ ఇద్దరు కొడుకులు, అజీజ్, మొయిన్, వారి తల్లి, కూతురు సబీనా, తమీజుద్దీన్ – మొత్తం వారి కుటుంబం సుతార కోలుకునేంతవరకు ప్రేమగా, ఆప్యాయంగా సేవలు చేస్తారు. అలా హిందూ బాలికను తమ ఇంట్లో వుంచుకోవడం అపాయమని వారికి తెలుసు. అయినా వెంటనే పునరావాస కేంద్రానికి అప్పచెప్పకుండా ఆరు నెలలపాటు తమవద్దే వుంచుకుంటారు.

తమ కుటుంబంపై జరిగిన దాడి, ఆ భయానక దృశ్యం సుతారకు పదేపదే గుర్తుకు వస్తుంటుంది. అది "తలచుకుంటే ఆమె కాళ్ళూ, చేతులూ ఇప్పటికీ గజగజా వణికిపోతుంటాయి. ఆమె శరీరం ఝల్లు మంటుంది. ఏదో విపత్తు శరీరానికీ, మనసుకీ జరిగినట్లు భావన. ఏమిటో తెలియదు. ఆమె శరీరంపైనా, గుండెపైనా ఏదో బరువుతో నొక్కినట్లు – ఒక భయంకరమైన భావన. అదొక పీడకల. అది ఒక దుర్భరమైన రాత్రి. ఒక అమానవీయమైన రాత్రి. అది ఒక దయ్యంలాగ, రాక్షసంగా ఆమె ముందు ప్రత్యక్షమౌతుంది." (పేజి 142). ఆ హింసా కాండను రచయిత్రి చిత్రించిన తీరు మొత్తం విభజన సాహిత్యంలోనే అపూర్వం. కొందరు రచయితలకు ప్రత్యక్షంగా విభజన గాయాల అనుభవం వున్నట్లు జ్యోతిర్మయికి ఆ అనుభవం లేదు. కాని వాటిని చిత్రీకరించడంలో అందరికంటే ముందు స్థానంలో వున్నారు. ఆ చిత్రీకరణ చదివినప్పుడు అసలు విభజనలో వున్న హేతుత్వాన్ని ప్రశ్నిస్తాం. నిజానికి ఈ దారుణాలను చిత్రీకరించడానికి వందలాది మంటోలు, వందలాది అఖ్తరుద్దీన్ విలియాస్‌లు సరిపోరు.

ఆరు నెలల తర్వాత తమీజుద్దీన్ సుతారను హిందూ పునరావాస కమిటీకి తీసుకువెళ్తాడు. అక్కడ ఆ సభ్యులు వేసే అనాలోచితమైన, అసభ్యమైన, దారుణమైన ప్రశ్నలకు సుతార దిగ్భ్రాంతి చెందుతుంది. ఆ అపరిచితులు అడిగే ప్రశ్నలకు భయభ్రాంతురాలై సుతార "కాకాసాహెబ్! నన్ను నీతో తీసికెళ్ళు! వాళ్ళతో వెళ్ళను" అంటుంది.

మతోన్మాదులను ఉద్దేశించి తమీజుద్దీన్ భార్య ఇలా అంటుంది: "మీకు విభజన కావాలి. దానికోసం పోరాడండి. అంతేకాని స్త్రీలను అవమానించడాలు, దాడులు చేయడం ఏమిటి? వారి పరువు తీసే ఈ అకృత్యాలేమిటి? మీ మతం ఇలా చేయడాన్ని అంగీకరిస్తుందా? గ్రామంలో విద్యావంతులైన లాయర్లు, ఉపాధ్యాయులు ఎందుకు ఈ

అకృత్యాలకు వ్యతిరేకంగా గొంతెత్తి ఖండించలేకపోతున్నారు? నిజమే. అత్యల్పంగా వున్న మతోన్మాదులను మిగిలినవారు అడ్డుకోకుండా మౌనంగా వుండటం చరిత్రలో జరిగిన ఒక మహా విషాదం!

ఈ సందర్భంగా శరణార్థి స్త్రీలతో నేరుగా మాట్లాడి, వారి మాటలను రికార్డు చేసిన రీతూమీనన్, కమలాబాసిన్‌లతో ఒక హిందూ శరణార్థి స్త్రీ ఇలా అంటుంది.

"స్త్రీకి మతం లేదు. ఆమె మతం స్త్రీత్వమే! ఆమె మనిషికి జన్మనిస్తుంది. ఆమె సృష్టికర్త. ఆమే దేవుడు. ఆమే మాత. అమ్మలకు మతం లేదు. వారి మతం స్త్రీత్వమే! వారు ఏ మతంవారైనా సరే!" (మీనన్–భాసిన్ 1998 పేజి 243).

నౌఖాలీ నుంచి విస్తాపన చెందిన సుతార ఆరు నెలల తర్వాత కలకత్తాలోని సోదరుల ఇంటికి చేరుతుంది. ఆమె వదిన, అన్నల అత్తలు, సుతార ముస్లిముల ఇళ్ళలో ఆరు నెలలపాటు వున్నది కనుక ఆమెను అంటరానిదానికంటే హీనంగా చూస్తారు. ఆమెను అంటుకోవడమంటే మైలపడిపోవడమే. ఇది సుతారకు మానసిక విస్తాపన. తన మతంవారితోనే మానసిక ప్రవాసం ఇది.

"ఆరు నెలలపైగా ముస్లిముల ఇంట్లో వున్నామెను ఇంట్లోకి తీసుకువచ్చావు. ఒక మూలపడి వుండమను. అక్కడ ఏమి తిన్నదో, ఏమి చేసిందో, దేవుడికే తెలియాలి" అని సుతారను దూరంగా పెడతారు. దీనికి పరాకాష్టగా ఇంట్లో జరిగిన ఒక వివాహ వేడుకలో సుతారను అతిథులకు దూరంగా, ఒక మూల కూర్చుని పెళ్ళి భోజనం చేసేదానిగా, ఒక పనిమనిషిగా చూస్తారు.

వీటన్నిటి నుండి తప్పించడానికి సుతార సోదరుడు ఆమెను ఒక రెసిడెన్షియల్ కళాశాలలో చేరుస్తాడు. ప్రత్యక్షంగా గాయమైన బాధకంటే, ఇది అంతర్గతంగా జరిగిన గాయం. మనిషిని ఏకాకి చేసి వేదనతో నింపడం. ఆమె సోదరుని ఇంట్లో ఒక న్యూసెన్స్‌గా పరిగణింపబడింది.

కొన్నేళ్ళ తర్వాత ఎం.ఏ. హిస్టరీ చదివి సుతార ఢిల్లీలో లెక్చరర్ ఉద్యోగంలో చేరుతుంది. ఆర్థికస్తోమత లభించినా ఈ కొత్త జీవితం నిజమైన స్వేచ్ఛనిస్తుందా అని భయపడుతుంది. తన కుటుంబ సభ్యులతోనే తిరస్కరణకు గురైన స్త్రీగా గతం, వర్తమానం, భవిష్యత్తులో – మూడు కాలాలలోనూ కష్టాలు చవిచూడాల్సి వస్తోందని గ్రహిస్తుంది. తాను చేయని తప్పుకు స్త్రీ సత్య, త్రేతా, ద్వాపరయుగాలలో అవమానింపబడుతోంది.

చరిత్ర బోధించే లెక్చరర్‌గా సుతార తనలాంటి వారి చరిత్రనీ, విభజన గురించి చరిత్రకాని పాఠ్యపుస్తకాలలో లేకపోవడాన్ని తప్పు పడుతుంది. చరిత్ర బోధించే క్రమంలో – ఫ్లాష్‌బాక్ టెక్నిక్ ద్వారా తన జీవితాన్ని జ్ఞాపకం చేసుకుంటూ వుంటుంది. ఈ సమయంలో బాల్యస్నేహితురాలు సకీనా ఆమెను చూడటానికి ఢిల్లీ వస్తుంది. హిందూ సమాజంలో ఆమెకు వరుడు దొరకడు గనుక సకీనా తన సోదరుడు అజీజ్‌ను వివాహం చేసుకొమ్మని అడుగుతుంది. కాని సుతార అంగీకరించదు. ముస్లిముల చేతుల్లో దారుణంగా హత్య చేయబడిన తన తల్లిదండ్రులను, అక్కలను ఈనాటికీ సుతార మరచిపోలేదు.

ఆ తర్వాత తన స్నేహితురాళ్ళతో మానసిక విశ్రాంతి కోసం హిమాలయాల్లోని యాత్రా స్థలాలకు వెళ్తుంది. అక్కడ కూడా గతం వెన్నాడుతుంది. ఒక యాత్రా స్థలంలో చనిపోయిన తల్లిదండ్రులకు పిండదానం చేసే క్రమంలో కన్నీరు మున్నీరవుతుంది. ఆనాటి భయానక దృశ్యం ఒక పీడకలగా ఆమెను వెన్నాడుతూ వుంటుంది.

అన్న కొడుకు ప్రమోద్ సుతారను పెళ్ళి చేసుకొంటానంటాడు.

ఈ నవలను రచయిత్రి మూడు భాగాలుగా రాశారు. మొదటిది : ఆదిపర్వం – ప్రారంభం. అల్లర్ల సమయంలో సుతార ఎదుర్కొన్న అగ్నిపరీక్ష దీనిలో కథావస్తువు. రెండవది : అనుశాసన పర్వం. ఇది మహాభారతంలో 13వ పర్వం. సుతార ప్రవాస పరీక్షను ఎదుర్కోవడం. మూడవది స్త్రీ పర్వం. ఇది మహాభారతంలో 11వ పర్వం.

నవల అంతా సుతారను ద్రౌపదితో, సీతతో పోల్చారు. సుతార పనిచేసిన కళాశాల పేరు యాజ్ఞసేని కళాశాల.

సుతార శరణార్థే కాదు. ఒక ప్రవాసి కూడా. ✸

# కృతజ్ఞతలు




**ప్రముఖ** కథారచయిత, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత పెద్దిభొట్ల సుబ్బరామయ్య 18 మే 2018న విజయవాడలో మరణించారు. ఆయన 15 డిశెంబరు 1938న ప్రకాశంజిల్లా వల్లూరులో జన్మించారు.

సుబ్బరామయ్య 40 సం॥ల పాటు తెలుగు అధ్యాపకునిగా ఆంధ్ర లయోలా కళాశాలలో పనిచేశారు. 1959 నుండి రచనలు చేశారు. ఆయన మొదటి కథ 'చక్రనేమి' ఆంధ్రపత్రిక వారపత్రికలో ప్రచురితమైనది. 200లకు పైగా కథలు రాశారు. కథలతోపాటు నవలలూ రాశారు. తను రాసిన కథలకు కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డుతోపాటు పలు సాహిత్య సంస్థల అవార్డులను అందుకున్నారు. ఆయన చివరి రోజుల్లో ఉత్తమ కథారచయితలకు ప్రతి సంవత్సరం 'పెద్దిభొట్ల సాహిత్య స్ఫూర్తి' అవార్డులను ఇచ్చారు. ఆయన మరణించిన తర్వాత కూడా కొద్దికాలం 'పెద్దిభొట్ల సాహిత్య స్మారక' అవార్డులను ఇచ్చారు.

పెద్దిభొట్ల సుబ్బరామయ్యను స్మరించుకుంటూ వారి జీవనసహచరి పెద్దిభొట్ల గీతారాణి 'ప్రజాసాహితి' ఈ నెల సంచిక ప్రచురణకు ఆర్థిక సహాయం అందించారు. వారికి మా కృతజ్ఞతలు. – సం॥

పుస్తక పరిచయం




# ఫాసిజం ఎలా పనిచేస్తుంది

## (మనమూ - వాళ్ళూ అనే రాజకీయాలు)

– జేసన్ స్టేన్లీ

పరిచయకర్త : జి.వి. భద్రం

**జేసన్** స్టేన్లీ, యేల్ యూనివర్శిటీలో తత్త్వశాస్త్ర ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు. ఈయన వ్రాసిన పుస్తకాలకు అమెరికన్ తత్త్వశాస్త్ర సంఘ బహుమానం, అమెరికన్ అసోసియేషన్ ఆఫ్ పబ్లిషర్ల బహుమానాలు వచ్చాయి. ఈయన తరచుగా 'ది న్యూయార్కు టైమ్స్', 'ది వాషింగ్టన్ పోస్టు', 'బోష్టన్ రివ్యూ', 'ది క్రానికల్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్' లాంటి పత్రికలకు వ్యాసాలు రాస్తూ వుంటారు.

1939లో జేసన్ స్టేన్లీ నాయనమ్మ ఇల్సీ అతడి తండ్రి మేన్‌ఫ్రెడ్ (ఆరేళ్ళ బాలుడు)తో బాటు నాజీ జర్మనీ నుండి పారిపోయి వచ్చింది. అనేకచోట్ల దాగుకొంటూ, అనేక నెలలు అజ్ఞాతంలో గడిపి ఆమె 1939లో న్యూయార్కు నగరం చేరుకొంది. జర్మనీలో జేసన్ స్టేన్లీ తాత (తండ్రి తండ్రిని)ను నాజీ గూఢచారి పోలీసులు అరెస్టు చేశారు. అందుకు కారణమేమిటయ్యా అంటే, అతడు గతంలో రెండుసార్లు చిన్న, చిన్న ట్రాఫిక్ ఉల్లంఘనలకు పాల్పడినందుకు కోర్టులో జుల్మానా కట్టాడట! ఆ కారణాన్ని చూపిస్తూ అతడ్ని యూదు జాతికి చెందిన నేరస్తుడిగా ముద్రవేసి, యూదుజాతి నేరస్తులను నిర్మూలించే కార్యక్రమంలో భాగంగా అతడ్ని నాజీ పోలీసులు అరెస్టు చేశారు.

అటువంటి కుటుంబ నేపథ్యం గల జేసన్ స్టేన్లీ, ఇటీవలి సంవత్సరాలలో, ప్రపంచమంతటా అనేక దేశాలలో అతిమితవాదము అనూహ్యంగా పెరిగిపోవటమూ ఒక రకమైన అతిమితవాద జాతీయతావాదం ముందుకు చొచ్చుకురావటం – రష్యా, హంగేరి, పోలెండ్, భారతదేశం, టర్కీ, అమెరికా దేశాల్లో ఈ అతిమితవాద జాతీయతావాద రాజకీయాలు ప్రాబల్యం సంపాదించి, ప్రభుత్వాధికార స్థాయికి చేరుకొంటున్న పరిణామాలు – ఆయా అతిమితవాద జాతీయవాద రాజకీయ పార్టీలు అనుసరించి, అమలుజరుపుతున్న ఫాసిస్టు విధానాల పట్ల కలవరం చెంది, ఈ విషయమై పరిశీలన జరిపి తాను కనుగొన్న విషయాలను (పరిశీలించిన విషయాలను) యీ 'ఫాసిజం ఎలా పనిచేస్తుంది' అనే పుస్తకం ద్వారా తెలియచేశారు.

ఏదో ఒక రకానికి చెందిన (జాతిపరమైన, మతపరమైన, సాంస్కృతికపరమైన) తీవ్ర జాతీయతావాదం, ఒక నిరంకుశ నాయకుడి ద్వారా ఒక జాతికి ప్రాతినిథ్యం వహిస్తూ, ఆ జాతీయతావాదం తరపున మాట్లాడే, దాని ప్రతినిధిగా వ్యవహరించే స్థితికి ఆయన 'ఫాసిజం' అనే పేరును తగిలించారు.

ఈ పుస్తకంలో ఫాసిస్టు రాజకీయాలపట్ల, అధికారాన్ని సంపాదించటం కోసం ఫాసిస్టు ఎత్తుగడలు ఒక మెకానిజంగా ఎలా పనిచేస్తున్నాయి అనే అంశం పట్ల ప్రత్యేక దృష్టిని పెట్టారు.

ఆయన అభిప్రాయం ప్రకారం నేడు ఫాసిజం సరిగ్గా 1930లలో వున్న మాదిరిగానే కనబడకపోయినా, అనేక దేశాలలో నేడు కాందిశీకులు రోడ్డునపడటం, వారి దురవస్థ అన్నవి, ఫాసిస్టులు జరిపే అబద్దపు ప్రచారమైన "మన జాతి ముట్టడిలో వుంది, దేశంలో అంతర్గతంగానూ – సరిహద్దుల బయటా పరాయివారి ప్రమాదం ముంచుకొచ్చింది" అనే ప్రచారానికి మరింత బలాన్ని చేకూర్చుతున్నాయి. పరాయివారి బాధలు, కష్టం, వేదనలు, దుఃఖం అన్నవి ఫాసిజం నిర్మాణాన్ని మరింతగా ఘనీభవింపజేస్తాయి.

ఫాసిస్టు రాజకీయాల ప్రమాదాలు, అవి జనాభాలోని కొన్ని భాగాలవారిని ఒక ప్రత్యేకమైన పద్ధతిలో అమానవీకరణం చేయటం అనే దాని నుండి వస్తాయి. సమూహాలను వెలివేయటం (మొత్తం జనాభా నుండి మినహాయించటం) అన్నది అమానవీయంగా వ్యవహరించటం, అణచివేత, స్వేచ్ఛలను రద్దుచేయటం, మూకుమ్మడి అరెస్టులు జరపటం, బహిష్కరించటం, కొన్ని తీవ్రమయిన సందర్భాలలో మూకుమ్మడిగా సంహరించటం అన్నవి ఫాసిస్టు చర్యలకు సమర్ధతను కల్పిస్తాయి.

ఫాసిస్టు రాజకీయాలలో అనేకమయిన, విలక్షణమైన వ్యూహాలు యిమిడి వుంటాయి : కల్పితమయిన గతం, ప్రచారం, మేధోవ్యతిరేకవాదం, అవాస్తవం, అధికారక్రమం (ఒక వరుసలో ఏర్పరచబడిన విభిన్న స్థాయిల సమాజ వర్గీకరణ), బాధితులమన్న భావన (విక్టిమ్ హుడ్), శాంతిభద్రతల సమస్య, లైంగిక సంకరత్వం జరిగింది – జరుగుతుందనే మనోవ్యథ, ప్రజాసంక్షేమాన్నీ, ప్రజా ఐక్యతను రద్దుచేయటం, మొదలైన వ్యూహాలు ఫాసిస్టు రాజకీయాలలో భాగంగా వుంటాయి.

స్పష్టంగా ఫాసిస్టు రాజ్యం తలెత్తి ఏర్పడకపోయినా ఫాసిస్టు రాజకీయాలు మైనారిటీ గ్రూపులవారిని అమానవీకరించగలవు.

స్పష్టంగా వ్యక్తీకరించబడే ఫాసిస్టు రాజకీయాల లక్షణం, జనాభాను మనమూ – వాళ్ళూగా విడదీసి, విభజించటం. ఫాసిస్టు రాజకీయాలు ఒక ప్రత్యేకమైన పద్ధతిలో, మనమూ – వాళ్ళూ అనే విధంగా విభేదాన్ని ప్రజల జాతిపరమైన, మతపరమైన, తెగపరమైన ప్రత్యేక లక్షణాల గురించిన విశిష్టతలన్నవాటికి విజ్ఞప్తులు చేస్తూ, యీ విభజనను ఉపయోగించుకొని తన సిద్ధాంతాన్నీ, అంతిమంగా విధానాలనూ రూపుదిద్దుకొంటుంది.

ఫాసిస్టు రాజకీయాల వలన వాస్తవం పట్ల సాధారణంగా వున్న (విషయాల పట్ల) అవగాహన కుప్పకూలిపోతుంది. ప్రమాదకరమైన, అబద్ధమైన విశ్వాసాలు వేర్లు పాదుకొనటానికి జాగా కల్పింపబడుతుంది.

మైనారిటీ గ్రూపులు పురోగతి చెందుతుంటే, ఫాసిస్టు రాజకీయాలు

ఆధిపత్య గ్రూపులవారిలో తాము బాధితులమనే భావాన్ని, అనుభూతులను రెచ్చగొడతాయి. శాంతిభద్రతల రాజకీయాలు, 'మనం' చట్టాన్ని పాటించే వారమన్నట్లు, 'వారు' చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడేవారు, నేరస్థులూ అనే అబద్ధపు అభిప్రాయాన్ని రెచ్చగొడతాయి.

జండర్ సమానత్వం పెంపొందటం వలన, పితృస్వామిక అధికార వ్యవస్థకు ప్రమాదం ఏర్పడుతుందనీ, మన జాతి యొక్క మగతనపు మనుగడకు ప్రమాదం ఏర్పడబోతోంది అనే మనోవేదనను ఫాసిస్టు రాజకీయాలు పెంపొందిస్తాయి.

1948లోనే మానవహక్కుల సార్వత్రిక ప్రకటనను అమెరికా దేశం అంగీకరించి, ప్రకటించినప్పటికీ, ఫాసిస్టు ఆలోచనలకు అమెరికా దేశ చరిత్రలో ఎన్నడో వ్రేళ్ళుపాదుకొన్నాయనేది జేసన్ అభిప్రాయం.

1939 నాటికే 'అమెరికా ఫస్ట్' అనే ఫాసిస్టు అనుకూల భావం (సెంటిమెంట్) అమెరికా దేశంలో వుందనీ, 2016లో డొనాల్డు 'అమెరికా ఫస్ట్' అనే నినాదాన్ని తాను అధ్యక్ష పదవి చేపట్టిన మొదటి వారంలోనే తిరిగి లేవనెత్తాడనీ, అతడి ప్రభుత్వం నిరంతరాయంగా వలసదారుల ప్రయాణాలపై నిషేధాన్ని, కాందిశీకులతో సహా అమలు జరిపిందనీ, ప్రత్యేకించి అరబ్ దేశాల వలసదారులను వేరుచేసిందనీ, అంతేకాక ట్రంప్ మధ్య, దక్షిణ అమెరికాకు చెందిన శ్వేతేతర జాతి అనధికారక వలసదారులను త్రిప్పి వెనక్కు పంపించేస్తానని వాగ్దానం చేశాడనీ, 2017లో వచ్చేఏడు (2018లో) తమ దేశంలోకి ప్రవేశించే కాందిశీకుల సంఖ్యను 45 వేలకే పరిమితి విధించాడనీ ఆయన తెలియజేశారు.

ఫాసిస్టులు కల్పించే కట్టుకథలు, సాధారణీకరింపబడే ప్రమాదం ముంచుకొచ్చిందని అనధికారిక వలస కార్మికులపై ఆయన అభిప్రాయ పడుతున్నారు. ఇటీవలి కాలంలో అమెరికా దేశంలో మూకుమ్మడి కాల్పులు సాధారణ విషయాలు అయ్యాయనీ, ఈమధ్య కాలంలోనే ఉదారవాద ప్రజాస్వామ్య దేశాలుగా వున్న హంగేరీ, పోలెండు దేశాల్లో అతివేగంగా ఫాసిజం సాధారణీకరింపబడు (క్రమబద్ధీకరింపబడు) తున్నట్లు స్పష్టమైన ఉదాహరణలున్నాయన్నారు. ప్రపంచమంతటా అనధికారిక వలస కార్మికులపై బహిరంగంగానే అమానవీయంగా వ్యవహరిస్తున్నారనీ ఆయన తెలియజేస్తున్నారు. డోనాల్డు ట్రంప్ యొక్క వలసదారుల వ్యతిరేక ప్రచారోద్యమం తీవ్రతరం అయిందనీ, ఆ ఉద్యమం బయటకు వెల్లడించబడని సంఖ్యలో అసంఖ్యాకమైన అనధికార కార్మికులు (అన్ని నేపథ్యాలకు చెందినవారూ) అప్రకటితమైన – పేరు తెలియని, ప్రైవేటుగా నిర్వహింపబడే నిర్బంధ కేంద్రాలలో బందీలుగా వున్నారని ఆయన తెలియజేస్తున్నారు.

ఈ రోజున ఫాసిస్టు రాజకీయాల యొక్క దురాక్రమణను గురించి వాటియొక్క అర్థం, ఎత్తుగడలను గురించి నిర్దిష్టమయిన, స్పష్టమయిన అవగాహన ఏర్పర్చుకోవాల్సిన అవసరం వుందని ఆయన దృఢంగా అభిప్రాయపడుతున్నారు.

రాజకీయ లాభం కోసం ఫాసిస్టు ఎత్తుగడలను వాడుతున్నవారికి వివిధ లక్ష్యాలుంటాయనీ, ప్రస్తుతానికి వారు ప్రజలను, ప్రపంచాధిపత్యం కోసం (నాడు హిట్లర్ చేసినట్లు) సమీకరించుతున్నట్లు కనబడక పోయినా, విభిన్న లక్ష్యాలతో పనిచేస్తున్న ఫాసిస్టు ఆలోచనలు, రాజకీయాల్లో సమన్వయంతో పనిచేస్తున్న సామాన్య అంశంగా కనబడుతోందనీ, తాను అమెరికా దేశస్థుడు కాబట్టి, ఫాసిస్టు ఎత్తుగడల ఒక లక్ష్యం, జాతీయతా జెండాను మధ్యతరగతి, కార్మికవర్గ శ్వేత జాతీయుల మధ్య ఎగురవేస్తూ ప్రభుత్వం కొల్లగొట్టిన సంపదనంతనూ కొద్దిమందిగా వున్న ఒలిగార్క్‌లు చేతుల్లోకి చేర్చటంగా వుందని ఆయన అభిప్రాయ పడుతున్నారు.

ఫాసిస్టు రాజకీయాలు సూటిగా కాందిశీకులను, ఫెమినిజాన్ని, కార్మికసంఘాలను, జాతి–మత–లైంగిక మైనార్టీలను లక్ష్యం చేసుకోవటాన్ని బట్టి అది మనందరని విభజించటం కోసం ఎటువంటి పద్ధతులను ఉపయోగిస్తున్నాయో అర్థం చేసుకోగలము.

ఫాసిస్టు రాజకీయాలు విషాదకరంగా ధ్వంసమయిన ప్రాచీన గతాన్ని తిరిగి లేవనెత్తుతాయి. ఇది కల్పితమయిన పౌరాణిక గతం – వాస్తవమయిన గతం కాదు. అవి ఒక జాతిని నిర్వహించే దానిని బట్టి ఆ పౌరాణిక కల్పిత గతం మతపరంగానైనా కల్తీలేని పరిశుద్ధమైన దవుతుంది, లేదా జాతిపరంగానైనా లేదా సాంస్కృతికపరంగానైనా లేదా అన్నీ కల్సిన పరిశుద్ధమైన, కల్తీలేని స్వచ్ఛమైన గతంగా వుంటుంది. ఫాసిస్టు రాజకీయాల క్రింద యీ కల్పిత (పౌరాణిక) గాథలు ఒక జాతి యొక్క గుర్తింపుకు ఆధారం (పునాది)గా వుంటాయి. ఈ ఫాసిస్టు కల్పిత కథలు, ఒక కీర్తివంతమయిన జాతీయ చరిత్రను సృష్టించి, తమను తాము ప్రత్యేకమయినవిగా వర్గీకరించుకొంటాయి.

ఇటువంటి కల్పిత గాథలను సృష్టించే విషయం యొక్క లక్ష్యం, స్వభావం గురించి 1922లో బెనిటోముస్సోలినీ, నేపుల్స్ నగరంలో ఫాసిస్టు కాంగ్రెస్‌కు ఉపన్యాసం యిస్తూ యిలా వివరించాడు : "మనం మన యొక్క పౌరాణిక గాథను సృష్టించాము. ఈ పౌరాణిక కట్టుకథే ఒక విశ్వాసం, ఒక తీవ్రోత్సాహం..... మన పౌరాణిక కట్టుకథే మన జాతి. మన పౌరాణిక కల్పనే మన జాతి యొక్క మహత్తరత. ఈ పౌరాణిక కట్టుకథ వాస్తవం కానవసరంలేదు. మనం యీ పౌరాణిక కట్టుకథనే, యీ మహత్తరతనే వాస్తవం చేయ కోరుతున్నాం. దీనికి ప్రతీ విషయాన్నీ అధీనపరుస్తాం!".

ఈ రకంగా ఫాసిస్టు పౌరాణిక గతం అన్నది ఉద్దేశ్యపూర్వకంగానే కట్టు కథ అనీ (కల్పిత గతం అనీ) ఫాసిస్టు రాజకీయాలలో యీ పౌరాణిక కల్పిత గతం యొక్క పని, గతాన్ని గురించి వ్యామోహపూరిత ఉద్వేగాన్ని పెంచటమేననీ, ముస్సోలినీ స్పష్టపరిచాడు. ఫాసిస్టు సిద్ధాంతానికి కేంద్ర అంశాలు అధికారవాదం, స్వచ్ఛత, అధికార క్రమ సోపాన పరంపర, సంఘర్షణ అని స్పష్టపరిచాడు.

ఫాసిస్టు రాజకీయవేత్తలకు పితృస్వామిక కుటుంబం అన్నది ఆదర్శం. వారు పితృస్వామిక కుటుంబాన్ని ఒక జాతి యొక్క సాంప్రదాయాలకు కేంద్ర భాగంగా ఎల్లప్పుడూ ప్రాతినిధ్యం వహించిందనీ, అది యిటీవలి కాలంలో ధ్వంసమయిందని చెప్తూ, తిరిగి అటువంటి పితృస్వామిక కుటుంబాన్ని సృష్టించటానికి పూనుకొంటున్నామనీ ప్రకటిస్తూ, ఫాసిస్టు రాజకీయాలకు పితృస్వామికతను వ్యూహాత్మకంగా కేంద్ర స్థానంలో వుంచారు.

ఫాసిస్టు సమాజంలో జాతి నాయకుడు, పితృస్వామిక కుటుంబంలోని తండ్రి స్థానానికి సాదృశ రూపంగా (పోలికగా) వుంటాడు. ఫాసిస్టులు

సమాజంలో స్త్రీ స్థానాన్ని పిల్లల్ని కనే, పెంచే, జాతికవసరమయిన వాళ్ళను కనే స్థానానికి కట్టిపడేసి, మాతృమూర్తి స్థానం అంటూ కీర్తిస్తూ స్త్రీలను పురుషుల అధీనంలో వుండే జీవులుగా కుదిస్తారు. జండర్ పాత్రను ఆ రకంగా నిర్దేశిస్తూ ఫాసిస్టు రాజకీయాలు పురుషాధిక్య విధానాలను అమలు జరుపుతాయి. 2015లో పోలెండులో అధికారానికి అతిమితవాద పార్టీ అయిన లా అండ్ జస్టిస్ పార్టీ ప్రభుత్వం, రువాండాలోని హుతు ప్రభుత్వం, తమ జాతి స్త్రీలు వేరొక జాతి పురుషులను, తమ జాతి పురుషులు, మరోజాతి స్త్రీలను వివాహం చేసుకోవటాన్ని విద్రోహంగా ప్రకటించాయి. ఏఏ జాతుల మధ్య వివాహాన్ని నిషేధించాలో చట్టాలు చేశాయి. 2016 ఎన్నికల సందర్భంగా, అమెరికా దేశంలో అభ్యర్థి అయిన డోనాల్డు ట్రంప్ స్త్రీలను నీచపరిచే వ్యాఖ్యలు చేశాడు. 2011లో హంగేరి దేశ ప్రధాని అయిన విక్టర్ జిర్బన్ "ది ఫండమెంటల్ లా ఆఫ్ హంగేరి"ని ప్రవేశపెడుతూ, కుటుంబం అన్నది వివాహం మీద ఆధారపడి, తల్లిదండ్రులూ – పిల్లలకూ మధ్య గల సంబంధాలపై ఆధారపడి వుండాలని, హంగేరిని తిరిగి వెయ్యేళ్ళ క్రిందటి క్రిస్టియన్ యూరోపులో భాగం చెయ్యాలని" ప్రకటించాడు.

ఫాసిస్టు రాజకీయాలలో ఘనమైన పితృస్వామిక గతానికి ప్రమాదం ఏర్పడిందనే (ఉదారవాద ఆదర్శాల వలన) వాదనతో, ప్రచారంతో, ఆధిపత్య గ్రూపు యొక్క అధికార స్థాయికీ, అది తనను తాను తన యొక్క స్వచ్ఛతను పరిరక్షించుకోగల సమర్ధతకూ ముప్పు వాటిల్లిందనే భయాన్ని రెచ్చగొట్టడమన్నది ప్రధాన లక్ష్యంగా వుంటుంది.

ఒక ప్రజాసమూహాన్ని (జనాభాను) వారు ధర్మబద్ధంగానే ప్రత్యేకమైనవారనీ, ప్రకృతిపరంగానూ – మతం ప్రకారం వారు యితర ప్రజాసమూహాలను పరిపాలించవలసినవారుగా విధించారనీ నమ్మించగలిగితే, ఫాసిస్టు రాజకీయం విజయాన్ని సాధించే అవకాశాలు మెరుగవుతాయి.

నాజీ నాయకులైన రోసెంబర్గు, హిమ్లర్ తదితరులు పెంపొందించిన ఎత్తుగడలు యితర దేశాల్లో కూడా ఫాసిస్టు రాజకీయాలకు స్ఫూర్తినిచ్చాయి.

భారతదేశంలో హిందుత్వవాద ఉద్యమ అనుచరులు "హిందువులంటే భారతదేశానికి స్వదేశీ (స్థానిక) జనాభా అని, ఈ హిందూ జనాభా, దేశంలోకి ముస్లింలు, క్రిస్టియన్లు చొరబడేవరకూ, పితృస్వామిక ఆచారాలను పాటిస్తూ వచ్చారనీ, ఎంతో నిష్ఠతో, స్వచ్ఛమయిన లైంగిక (శృంగార) కార్యకలాపాలను ఆచరించేవారనీ చెప్తూ వుంటారు. హిందుత్వ ఉద్యమం పౌరాణిక గతాన్ని గురించి ఒక కట్టుకథ అల్లి, అది హిందువుల యొక్క స్వచ్ఛమైన, పవిత్రమైన జాతిగా వుండేదనే కథనాన్ని ప్రచారం చేస్తూ వుంటారు. భారత వాస్తవ చరిత్రను గురించి విద్యావేత్తలు భావించి చెప్పేదానికి, నాటకీయంగా వారు తమ కథనాన్ని అదనంగా జోడిస్తారు. భారతదేశంలో ప్రధాన జాతీయవాద పార్టీగా వున్న బిజెపి హిందుత్వ సిద్ధాంతాన్ని అనుసరిస్తూ, భారతజాతి తిరిగి కట్టుకథాపూర్వకమైన, పితృస్వామికమైన మొరటుగా మితవాదమైన జాతికి చెందిన – మతానికి చెందిన పవిత్రమైన, స్వచ్ఛమైన గతానికి వెళ్ళాలనే, భావోద్వేగతను రెచ్చగొట్టి, ప్రభుత్వాధికారానికి వచ్చింది. హిందువులు కానివారందరినీ అణగద్రొక్కాలనీ వాదిస్తూ, ప్రభోదిస్తూ వున్న అతివాద, అతిమితవాద సంస్థ అయిన ఆర్.ఎస్.ఎస్ నుండి దిగివచ్చినదే యీ బిజెపి; గాంధీని హత్యచేసిన నాథూరామ్ గాడ్సే యీ ఆర్.ఎస్.ఎస్. సంస్థ సభ్యుడు. ప్రస్తుత భారతదేశ ప్రధానమంత్రి కూడా యీ ఆర్.ఎస్.ఎస్. సభ్యుడే. ఆర్.ఎస్.ఎస్. పాశ్చాత్య ఫాసిస్టు ఉద్యమాలచేత స్పష్టంగా ప్రభావితం కాబడిన సంస్థ. ఈ సంస్థ ప్రధాన నాయకులందరూ 1930–1940ల మధ్యకాలంలో హిట్లర్‌నూ, ముస్సోలినీని పదేపదే నిరంతరాయంగా పొగిడినవారు.

గత 'ఘన'చరిత్రను గురించి కట్టుకథలల్లి వాస్తవాన్ని మరుగుపరచ పూనుకొన్న యీ ఫాసిస్టు రాజకీయాలు, గత చరిత్రలో కల అసౌకర్యమైన, యిబ్బందికరమైన వాస్తవాలను చెరిపివేస్తాయి. ఇలా క్రొత్తగా కనుగొని, కల్పించిన చరిత్రలు, ఒక జాతి యొక్క గతకాలపు పాపాలను పూర్తిగా తుడిచివేస్తాయి లేదా వాటి ఘోరాన్ని తగ్గించివేస్తాయి.

గతకాలం పట్ల కేవలం వ్యామోహాన్ని పెంచటం కోసమే, యీ కట్టుకథా చరిత్రలు అల్లబడవు. ఫాసిస్టు రాజకీయాలు కొన్ని గతకాలపు అంశాలనే ఎంచుకొని, జాతి యొక్క కీర్తిని తగ్గించివేస్తాయి అన్న అంశాలను చెప్పకుండా తప్పించివేస్తాయి.

అమెరికావాళ్ళు (అతిమితవాదులు) నీగ్రో బానిస వ్యవస్థను తక్కువ చేసి చూపిస్తారు. పోలెండు దేశపు అతిమితవాదులు తమ యూదు వ్యతిరేక గత చరిత్రనూ తక్కువ చేసి చూపిస్తారు. టర్కీవాళ్ళు, గతంలో ఆర్మీనియన్లపై జరిపిన అత్యాచారాలను తగ్గించి చూపిస్తారు. తప్పుడు చరిత్రలను సృష్టిస్తారు.

రాజకీయ ప్రచారం అన్నది ఫాసిస్టు రాజకీయాల్లో ప్రధానపాత్ర నిర్వహిస్తుంది. ఆ ఫాసిస్టు ఉద్యమం యొక్క సమస్యాత్మకమైన లక్ష్యాలను, విస్తృతంగా అంగీకరింపబడే ఆదర్శాల ముసుగు వేస్తుంది. ఫాసిస్టు ప్రచారోద్యమం, తన అభ్యంతరకరమైన లక్ష్యాల వెనుక ప్రజలను ఐక్యం చేయటం కోసం, సుగుణపూరితమైన ఆదర్శాలకు చెందిన భాషను ఉపయోగించుకొంటుంది.

తాను ఒకవేపు అవినీతికరమైన, నీతిబాహ్యమైన ఆచరణలు జరుపుతూనే, ఫాసిస్టు రాజకీయాలు, తాము యితరులపై తప్పుడు – అబద్ధపు అవినీతి ఆరోపణలు ప్రచారం చేస్తూ, ఫాసిస్టు రాజకీయ ఉద్యమాలు తరచుగా అవినీతి వ్యతిరేక ఉద్యమాలను నిర్వహిస్తూ వుంటాయి.

ముస్లింలు, నల్లజాతివారు, యూదులు, అవినీతికి పాల్పడతారు. వారే ప్రభుత్వ సంక్షేమ పథకాలను కొల్లగొడ్తారనేది, ఫాసిస్టు ఉద్యమాలలో ప్రముఖ ప్రచార అంశంగా వుంటుంది. అవినీతికి, అవినీతి వ్యతిరేకమయిన ముసుగు తగిలించటం అన్నది ఫాసిస్టు ప్రచారోద్యమపు వ్యూహం యొక్క ప్రమాణ చిహ్నం (హాల్‌మార్క్).

చారిత్రకంగా చూస్తే, ప్రజాస్వామ్య ఎన్నికల ద్వారానే ఫాసిస్టు నాయకులు అధికారానికి చేరుకొని, ఆనక ప్రజాస్వామ్య సూత్రాలనే అందుకు వ్యతిరేకంగా ప్రయోగిస్తారు. అమెరికా దేశంలో యిటీవలి కాలంలో అతిమితవాద జాతీయతావాద గ్రూపులు వాక్స్వాతంత్రాన్ని గూర్చి ప్రజలను ఆకట్టుకొనే ఉపన్యాసాలు దంచుతున్నాయి. 2017లో 'ట్రంపు వాక్స్వాతంత్ర' ర్యాలీలు నిర్వహింపబడ్డాయి. ఈ ర్యాలీల ద్వారా వారు తమ తీవ్రవాద మితవాద చర్యలను సమర్ధించుకొంటూ, "మీరు తీవ్రవాదమనండి' కానీ అది దేశభక్తివాదం!" అంటూ ప్రకటిస్తున్నారు.

ఫాసిస్టు రాజకీయాలు విద్వత్తుపైనా, నైపుణ్యతపైనా, భాషపైనా దాడులు జరుపుతూ, వాటి విలువను తక్కువచేసి చూపిస్తూ, వాటిని పట్టించుకోకుండా వుండేందుకు ప్రయత్నిస్తాయి. స్కూళ్ళలో కట్టుకథా రూపమైన ఆధిపత్య సంస్కృతిని కట్టుకథా గతాన్ని, పాఠ్యాంశాలుగా నిర్దేశిస్తాయి, నిర్ణయిస్తాయి. ఆరకంగా విద్యను తమ యొక్క కట్టుకథా పూర్వకమైన జాతీయతకు మద్దతునిచ్చేదిగా మలుస్తాయి. గత 50 సంవత్సరాలుగా యూనివర్శిటీలపై ఫాసిస్టు రాజకీయాలు దాడులు జరుపుతూ, ప్రజాస్వామ్య పూరిత ఆలోచనలు, అధ్యయనం, ఆచరణలకు పలు రూపాల్లో అడ్డుకట్టలు వేస్తున్నాయి. ఫాసిజం, ఫాసిస్టు ప్రతినిధులూ యూనివర్శిటీలను, స్కూళ్ళనూ మార్క్సిస్టు సిద్ధాంతాలను భోదించే కేంద్రాలుగా నిందిస్తూ, ఖండిస్తూ, ప్రొఫెసర్లు, అధ్యాపకులతో అమర్యాదకరంగా వ్యవహరిస్తూ, వారిపై పలు దాడులు జరుపుతున్నారు. వారిపై ఆంక్షలు విధింపజేస్తున్నారు. ఆర్యజాతికి చెందిన మహిళల గర్భదారణ శక్తిని విచ్ఛిన్నం చేసేందుకు, యూదులు చేసిన కుట్రే ఫెమినిజం అని ఫాసిస్టు సిద్ధాంతాలు ఆరోపిస్తున్నాయి.

ఫాసిస్టు రాజకీయాలు సైద్ధాంతిక సంఘర్షణ కోసం జరిగే చర్చలను తగ్గించివేస్తాయి. అటువంటి వ్యూహాల ద్వారా ఫాసిస్టు రాజకీయాలు సమాచార విశాల స్థలాలను, వాస్తవం యొక్క పీకనొక్కే విధంగా దిగజార్చి, కుదించివేస్తాయి.

ఫాసిస్టు ఉద్యమాలు 'వాళ్ళు (యితరులు)' కుట్రలు పన్నుతున్నారనే సిద్ధాంతాలు ప్రచారం చేస్తూ, లాభపడుతూ వుంటాయి. ఉదాహరణకు 2017లో, టెక్సాస్ గవర్నరు "టెక్సాస్ రాష్ట్రంలోకి ముస్లింలు చాటుగా ప్రవేశించి టెక్సాస్ రాష్ట్రాన్ని ఇస్లామిక్ రిపబ్లిక్‌గా మార్చివేస్తారనే 'కుట్ర' సిద్ధాంతాన్ని ఆధారం చేసుకొని 'అమెరికన్ కోర్టులకు అమెరికన్ చట్టం' అనే బిల్లుపై సంతకం చేశాడు.

జాతీయతావాదం అన్నది ఫాసిజం యొక్క కీలక సారాంశం.

భారతదేశంలో హిందూ జాతీయతావాదులు, నిరంతరాయంగా ముస్లిం – వ్యతిరేక సెంటిమెంట్లను రెచ్చగొట్టే ఉద్యమాలు నిర్వహిస్తున్నారు. హిందూ వారసత్వానికి ముస్లిం పురుషులు ప్రమాదమనే సెంటిమెంటు రెచ్చగొడుతూ, "లవ్ జిహాద్" లాంటి ఆందోళనలు నిర్వహిస్తున్నారు. ముస్లింలపై మత విద్వేష దాడులు జరుపుతున్నారు.

ఫాసిస్టు రాజకీయాలు – రాజకీయవేత్తలూ వలసలకు (అమెరికా, యూరోపు దేశాలకు) వచ్చే కార్మికులు, కాందిశీకులను నేరస్తులుగా ప్రచారం చేస్తూ వలస కార్మికులకు వ్యతిరేకంగా అనేక చట్టాలు (వివిధ సంపన్న దేశాలలో) చేయటానికి కారణమవుతున్నారు.

నిరుద్యోగానికీ, దేశవాసులకు ఉద్యోగాలు దొరకకపోవటానికీ, వేతనాలు – సౌకర్యాలు కుంచించుకుపోవటానికీ యీ వలస కార్మికులే కారణమని ఆరోపిస్తూ, ఫాసిస్టు రాజకీయవేత్తలు కార్మికుల మధ్య సహజంగా ఏర్పడే వర్గ ఐక్యతా, అంతర్జాతీయతా భావాలకు అడ్డుపడుతూ, కార్మికవర్గ ఐక్యతను ధ్వంసం చేస్తూ, కార్మికవర్గాన్ని ఐక్యం కాకుండా నిరోధిస్తున్నారు.

ఫాసిస్టు రాజకీయాలు వర్గపోరాటపు ప్రాధాన్యతను అతితక్కువ చేసి, దాన్ని పట్టించుకోకుండా వుండేందుకు నిరంతరం ప్రయత్నం చేస్తూ వుంటాయి.

ఇటీవలి కాలంలో అమెరికా దేశంలో ప్రజలపై మూకుమ్మడి కాల్పులు సాధారణీకరించబడటం మనం చూస్తున్నాం. ఇటీవలనే ప్రజాస్వామ్య దేశాలైన పోలెండు, హంగేరిలలో ఫాసిజం చాలా వేగవంతంగా సాధారణీకరింపబడటం జరుగుతోంది.

ఈ రకంగా ప్రస్తుత సామ్రాజ్యవాద గ్లోబలీకరణ అమలు జరుగుతున్న ప్రపంచంలో, ఫాసిజం తలెత్తుతూ, అనేక రూపాల్లో పనిచేస్తున్న వైనాన్ని జేసన్ స్టేన్లీ, యీ పుస్తకంలో వివరించారు. 'మనమూ–వాళ్ళూ' అనే రాజకీయాల రూపంలో, ప్రపంచమంతటినీ ముంచెత్తుతున్న, ముంచుకొస్తున్న ఫాసిస్టు ప్రమాదం గురించి చాలా విపులంగా వివరించారు.

భారతదేశంలో ఫాసిస్టు పాలనకు పునాదులు వేయబడుతున్న నేటి తరుణంలో 'ఫాసిజం ఎలా పనిచేస్తోంది' అన్న యీ పుస్తకాన్ని చదవటం ద్వారా ముంచుకొచ్చిన యీ ఫాసిస్టు ప్రమాదాన్ని, ప్రభావ వంతంగా ప్రతిఘటించటానికి అవసరమైన మరింత స్పష్టమయిన అవగాహనను పొందగలుగుతాం! ✷

# హేతువాది దేవగుప్తపు పేరలింగం మృతి



**విశిష్ట** హేతువాది, రచయిత దేవగుప్తపు పేరలింగం రాజమండ్రిలో తన 82వ యేట 14-4-2024న మరణించారు. ఆయన 6-9-1942లో జన్మించారు. ఆయన నేత్రాలు, శరీరం జి.ఎస్.ఎల్ వైద్యకళాశాలకు ఇచ్చారు.

ఆయన వృత్తి వడ్రంగం. ఐదో తరగతివరకే చదువుకున్నారు. ప్రవృత్తి హేతువాద భావోద్యమ ప్రచారం. తన సైకిల్‌నే ప్రచార వాహనంగా తీర్చిదిద్దుకున్నారు. దానికి 'హేతువాద చైతన్యరథం' అనే పేరు పెట్టుకున్నారు. మతవాదులు సృష్టించిన అడ్డంకులను ధైర్యంగా ఎదుర్కొన్నారు. ఆయన 80వ పుట్టినరోజును రాష్ట్రవ్యాప్తంగా హాజరైన హేతువాద మిత్రుల సమక్షంలో 4-9-2022న రాజమండ్రిలో జరిగింది. ఆ సందర్భంగా 80 వేల రూపాయలు వారికి ఇచ్చి సన్మానం చేశారు. తెలుగు విశ్వవిద్యాలయం వీరి కృషిని గుర్తించి కీర్తి పురస్కారాన్ని అందించింది. కరీంనగర్ మలయశ్రీ నెలకొల్పిన హేతువాద అవార్డును అందుకున్నారు.

పేరలింగం మొత్తం 12 హేతువాద గ్రంథాలు రాసి ప్రచురించారు. ఆయన 1982లో రావిపూడి వెంకటాద్రి, పింగళి దశరథరామ్‌ల ప్రసంగాలు విని హేతువాదిగా మారారు. 'మూఢాచార నిర్మూలనోద్యమం' అనే శీర్షికతో కరపత్రాల పరంపరను ప్రచురించి, పంచారు. ✷

వ్యాసం

శ్రీరామరాజు శతవర్ధంతి (07.05.1924 - 07.05.2024) సందర్భంగా :

# బ్రిటీష్ వలస పాలన నుండి ప్రజలకు స్వాతంత్ర్యం సమకూర్చడానికి గిరిజనోద్యమాన్ని నడిపిన అల్లూరి శ్రీరామరాజు

- ఐ.టీ.ఆర్.ఐ. శివాజీరావు



**అల్లూరి** శ్రీరామరాజు 1897 జూలై 4న విశాఖ జిల్లాలోని పాండ్రంకిలో వాళ్ళ మాతా మహుల ఇంట్లో, భారత ప్రజలు స్వాతంత్ర్యం కోసం ఉద్యమిస్తూన్న కాలంలో పుట్టారు.

అంతకు నలభై సంవత్సరాల ముందు ప్రథమ భారత స్వాతంత్ర్య సంగ్రామం మొదలయ్యింది. దానిని బ్రిటీష్ ప్రభుత్వం తీవ్రంగా అణిచివేశారు. ఆ తదుపరి యేళ్ళల్లో ప్రజల జీవితాలలో అది తెచ్చిన మార్పులు చేర్పులు, ఒక పెద్ద పోరాటం తర్వాత ఒక నిశ్శబ్దం, నిస్తబ్దత ఆవరించి ఆ పోరాటం ప్రజల గుసగుసలుగాను, ఆ తదుపరి కొన్ని కల్పనలు జోడించి జానపదుల కథలుగా చెప్పుకొని, పాడుకొన్న పాటలుగా తర్వాతి తరాలకు చేరాయి. ఆ విధంగా ఒక పోరాటపు చారిత్రక ఘట్టం ప్రజా క్షేత్రంలో ఎప్పటికీ మిగిలి వుండడమే కాక తర్వాతి తరాల భౌతిక ఆచరణకు స్ఫూర్తిగా వుంటుంది. ఇది ఒక రాజకీయ ఆవరణను సృష్టిస్తుంది.

ఆ తర్వాత స్తబ్ధత నుంచి తేరుకొని తమ బానిసత్వాన్ని యెరిగి ఒక్కసారిగా ఒళ్ళు దులుపుకుంది ఆధునిక విద్యావంతుల భారతం. ఒక బీభత్స స్వప్నం తర్వాత ఒక ఉద్యమాన్ని మళ్ళీ మొదలు పెట్టాలని అనుకున్నప్పుడు, దానికి మితవాద జోలి దొరికింది. దానినే ప్రజల చేతుల్లో పెట్టింది అల్లూరి కన్నా రెండేళ్లు ముందు పుట్టిన కాంగ్రెస్.

కాంగ్రెస్ - విద్యావంతులలోనూ,మధ్య తరగతి ప్రజల్లోనూ ఇటువంటి ఆకాంక్షలు రేకెత్తించగలిగింది. 1857 తిరుగుబాటు తర్వాత ప్రజలలో కొంతైనా స్వాతంత్ర్యం పట్ల ఆశలు రేకెత్తించగలిగింది కాంగ్రెస్.

అల్లూరి పుట్టకముందు, పుట్టిన తర్వాత అనేక రైతాంగ పోరాటాలు, గిరిజనోద్యమాలు జరిగాయి. ఆ తర్వాత వచ్చిన కాంగ్రెస్ ఉద్యమము, గదర్ వీరుల వంటివారు చేసిన విప్లవ పోరాటము వీటన్నిటినుంచీ కవ్వం చిలకగా వచ్చిన వెన్నలా ఒక భావజాల తెట్టు బయటికి వచ్చి అప్పటి రాజకీయ వాతావరణాన్ని ఆవరించింది. ఆ తెట్టులో అనేక భావజాలాలు కలగా పులగంగా ఏర్పడి ప్రజలను ప్రభావితం చేశాయి.

అల్లూరికి కొంత వయసు వచ్చాక అప్పటికే గాంధీ ఆధ్వర్యంలో జరుగుతున్న స్వాతంత్ర్య పోరాటం ఆకర్షించింది. ముఖ్యంగా బిపిన్ చంద్రపాల్ రాజమండ్రి వచ్చి ఉత్తేజకరంగా ప్రసంగించడం. ఆ సమావేశంలోనే చిలకమర్తివారు "భరత ఖండంబు చక్కని పాడియావు" అనే పద్యాన్ని చదివారు. ఈ సభకు అల్లూరి తన తండ్రితో కలిసి వెళ్ళాడు. అల్లూరి తండ్రి కూడా తన ఫోటో స్టూడియోలో స్వాతంత్ర్య సమర యోధుల పటాలు ఫోటో ఫ్రేమ్ కట్టించి గోడలకు వేలాడ దీసేవాడు. ఈ భావజాలం అల్లూరిని నిరంతరం వెంటాడుతూ వుండేవి.

ఒక రోజు రాజమండ్రి పురవీధుల్లో ఒక తెల్లదొర గుర్రంపై స్వారీ చేసుకుంటూ వస్తుంటే తండ్రితో కలిసి వస్తున్న అల్లూరి ఆ దొరకు నమస్కారం చెయ్యబోయ్యాడు. తండ్రి "ఈ దేశాన్ని దోచుకుపోతున్న తెల్లవాడికి నమస్కారం చేస్తావేమి" అని మందలించాడట.

ఇలాంటి అనేక సంఘటనలు రాజు మదిలో ఒక నిర్దిష్టమైన రాజకీయ అభిప్రాయాలు ఏర్పడడానికి దోహదం చేశాయి.

రాజు చిన్ననాడే కాకినాడలోని పిఠాపురం రాజా వారి స్కూల్ లో చదువుతుండగా అతను వేసిన నాటికలోని వేషానికి బహుమతిగా జార్జ్ చక్రవర్తి బొమ్మ వున్న పతకాన్ని ఇచ్చారట. చిన్ననాటి నుండీ బ్రిటీష్ వాళ్ళను తీవ్రంగా ద్వేషించే రాజు ఆ పతకాన్ని తన గుండెల మీద ధరించేవాడు. అతని సహాధ్యాయి అయిన మద్దూరి అన్నపూర్ణయ్య అదే విషయాన్ని ప్రస్తావిస్తే "వాడు మన గుండెల మీద వున్నాడని ఇది నిరంతరం గుర్తు చేస్తుందని", బదులిచ్చాడు.

మరో సందర్భంలో చదువులో వెనకబడి వున్న రాజుని సరిగ్గా చదవొచ్చు కదా అని ప్రశ్నిస్తే "ఇదీ ఒక చదువేనా? దీనిలో ఏముంది", అని కొట్టి పడేశాడు. పైగా "దేశసేవ చేయాలి గానీ ఈ చదువెందుకురా", అనేవాడు. అంత చిన్న వయసులోనే అతని గ్రహింపుకి ఆశ్చర్యపడ్డానని అన్నపూర్ణయ్యగారు తన జీవిత చరిత్రలో రాసుకున్నారు.

ఆనాటి అందరి నవ యువకులలాగానే అల్లూరి, గాంధీగారు ప్రారంభించిన ఉద్యమాల మీద ఆశలు పెట్టుకున్నాడు. కానీ ఉద్యమం తర్వాత ఉద్యమం జరగడమే గానీ స్వాతంత్ర్య సాధనవైపు దేశం కదులుతున్న దాఖలాలు ఏమీ కనపడ్డం లేదు. ప్రజలు నిరంతర ఉత్తేజంతో వున్నారు. కానీ గాంధీ నాయకత్వంలోని కాంగ్రెస్ పార్టీ

స్తబ్దతలో వుంటూ ఒక ఉద్యమం మొదలు పెట్టిన తర్వాత ఆ ఉద్యమ లక్ష్యాలు సాధించకుండానే దాన్ని ఏదో ఒకరకంగా విరమించేది.

1920లో కాంగ్రెస్ ఆధ్వర్యంలో సాగిన సహాయ నిరాకరణోద్యమం దేశవ్యాప్తంగా యువకులను,విద్యావంతులను తనవైపు లాక్కుంది. కానీ 1922లో చౌరా చౌరీ ఘటన జరగడం ఆ తర్వాత ఉద్యమం హింసా రూపం తీసుకుందనే కారణంతో గాంధీజీ ఉద్యమాన్ని అర్ధాంతరంగా నిలిపివేశారు. దీనితో దేశంలో కాంగ్రెస్ మీద ఆగ్రహం పెల్లుబికింది. గాంధీజీ మీద వాళ్ళు పెట్టుకున్న నమ్మకాలన్నీ వమ్మయిపోయాయి. ముఖ్యంగా యువకులు ఒక్కసారిగా నీరుకారిపోయారు. దానితో స్వాతంత్ర్య సాధనలో ఎవరి మార్గం వాళ్ళు ఎంచుకోవడం ప్రారంభించారు.

అప్పటికే రష్యాలో సోషలిస్టు విప్లవం విజయవంతమయి ఒక కొత్త బంగారులోకం ఆవిష్కృతమైంది. అంతకు ముందు కార్మిక, కర్షకులు రాజ్యాలని యేలగలరని ఎవరూ వూహించలేదు. ఇక ఉటోపియా ఎంతమాత్రమూ వూహాలోకం కాదని అది సాధ్యమయ్యే తీరుతుందని లెనిన్ నాయకత్వంలోని రష్యా నిరూపించింది. ప్రపంచ వ్యాప్తంగా విప్లవాలు వూపందుకొని, విస్తరించడానికి రష్యన్ విప్లవం ఒక దిక్సూచిగా నిలబడింది. సహజంగా భారతదేశంలో కూడా రష్యా నమూనాను అనుసరించి సోషలిస్టు విప్లవం ఒక్కటే బ్రిటీష్ సామ్రాజ్యవాదం నుంచి విముక్తి ప్రసాదించగలదని నమ్మిక ఏర్పడింది. అందుకే భగత్ సింగ్ లాంటివాళ్ళు కమ్యూనిస్టు చైతన్యాన్ని అందుకొని కాంగ్రెస్ రాస్తాకు భిన్నంగా విప్లవ మార్గంలో ప్రయాణించారు.

అల్లూరిపై ఆయన ప్రత్యక్షంగా చూసిన సహాయ నిరాకరణోద్యమం ప్రభావం ఉంది. సహాయ నిరాకరణోద్యమం ఆంధ్రాలో పెద్దఎత్తున సాగింది. ఒక విధంగా జాతీయోద్యమాన్ని దాటి పన్నుల నిరాకరణో ద్యమంగా పరిణితిని ప్రదర్శించింది ఆంధ్రప్రదేశ్‌లోని ఈ ఉద్యమం. అయితే గాంధీగారు పన్నుల నిరాకరణను ఖండించడం వేరే విషయం. గుంటూరు ప్రాంతంలో పర్వతనేని వీరయ్య చౌదరి వంటివాళ్ళు ఈ ఉద్యమాన్ని ముందుకు తీసుకు వెళితే పల్నాడులో కన్నెగంటి హనుమంతు పుల్లరికి వ్యతిరేకంగా నిలబడి బ్రిటీష్ పోలీసుల తూటాలకు బలయ్యాడు. ఆంధ్రప్రదేశ్‌లో స్వాతంత్ర్యోద్యమంలో మొదటి అమరుడిగా చరిత్రకెక్కాడు.

ఈ సామాజిక, రాజకీయ, ఆర్థిక నేపథ్యమే అల్లూరిలో రాజకీయ భావాలు పెంపొంది వేళ్ళూనుకోవడానికి భూమికను తయారు చేశాయి.

ఆయన చిన్నప్పటినుంచీ నిత్య అన్వేషిగానే ఉన్నాడు. అతనిలో రాజుకున్న జ్వాల బయటకు ఉరకడానికి దారి వెత్తుక్కొనే క్రమంలో కొండలూ గుట్టలూ పట్టుకొని తిరిగాడు. సముద్రపు ఒడ్డుల్లో, సంచార యాత్రల్లో సేదదీరాలని ప్రయత్నం చేశాడు. తపస్సు చేశాడు, మూలికా వైద్యం, జ్యోతిష్యం వంటివి నేర్చుకున్నాడు. అయితే అప్పటికి అతనికి తెలీదు తను భవిష్యత్‌లో ప్రారంభించబోయే ఒక మహోద్యమానికి ఆ విద్యలన్నీ నిర్మాణాంగాలుగా పనిచేస్తాయని. అల్లూరి కమ్యూనిస్టు కాకపోయినా అద్భుతమైన నిర్మాణ దృష్టి కలిగినవాడు.

ఆధ్యాత్మిక పరమైన దారులు వెతుక్కుందామని అడవులు పట్టాడు. కృష్ణదేవి పేటలో చిటికెల భాస్కరుడు ఇంటికి చేరాడు. వారి ఇంటి నుండే గిరిజనులకు మూలికా వైద్యం, జ్యోతిష్యం రాయడం, వాస్తు చెప్పడం వంటివి చేసేవాడు. తాండవ నది ఒడ్డుకు వెళ్లి తపస్సు చేసుకునేవాడు. ఏజెన్సీలోని గ్రామాల్లో విస్తృతంగా పర్యటించాడు. ఆ క్రమంలో అక్కడి ప్రజల కష్టాలు, బాధలూ చూసి ఆధ్యాత్మికం నుంచి దృష్టిని లౌకికానికి మరల్చాడు.

బ్రిటీష్ ప్రభుత్వం మద్రాసు అటవీ చట్టం తేవడంతో గిరిజనుల కష్టాలు మరింత తీవ్రమయ్యాయి. గిరిజనులు అడివి మీద, అటవీ ఉత్పత్తుల మీద తమ హక్కులు కోల్పోయారు. వేలాది సంవత్సరాలుగా తమ పూర్వీకుల నుంచీ తమ అనుభవంలో వున్న అడవి ఈ కొత్త చట్టం మూలంగా తమకు పరాయిది అయ్యింది. అడవి బిడ్డ అడవి నుంచి వేరు చేయబడ్డాడు. తన పోడు వ్యవసాయానికి, అటవీ ఉత్పత్తుల సేకరణకు దూరమయ్యాడు. క్రమంగా అడవిమీద హక్కులు కోల్పోయాడు. ఈ కారణంగా ఏజెన్సీలో అనేక తిరుగుబాట్లు జరిగాయి. ఆ తిరుగుబాట్లకు కొనసాగింపుగానే అల్లూరి ఉద్యమాన్ని నడిపాడు.

అల్లూరి విశాఖ మన్యంలో ప్రవేశించాక ముఖ్యంగా లంబసింగి రోడ్డు వేసే సందర్భంలో అక్కడి తహశీల్దార్ బాస్టియన్ దొర అతని అసిస్టెంట్ పిళ్ళై గిరిజనులను చెప్పనలవికాని హింసలు పెట్టారు. వాళ్ళను కొరడాలతో గొడ్డుల్ని బాదినట్టు బాదడం, అతి తక్కువ వేతనాలతో పనులు చేయించుకోవడం. ఎదురు తిరిగితే చిన్న తప్పులకు కూడా పెద్ద శిక్షలు వేయించడం వంటివి చేసేవారు. గిరిజనులకు రోజంతా పని చేసినా వచ్చిన వేతనాలు చాలక చింత అంబలి చేసుకొని తాగేవారు. దీనితో వాళ్ళకి పొట్టలో పేగులకు పుళ్లు పడిపోయేవి. గిరిజనులు పడుతున్న ఈ అవస్థలన్నీ రామరాజును కార్యాచరణకు పురికొల్పాయి. బాస్టియన్ దొర ఆగడాలను ప్రశ్నించిన గాం గంతన్న దొరను మునసబు గిరీ నుంచి తప్పించారు.

మన్యంలో పరిస్థితులు ఇలా పక్వానికి వచ్చిన తరుణంలోనే రామరాజు అక్కడికి అడుగుపెట్టాడు. చిటికెల భాస్కరుడి ఇంటిదగ్గర గాం గంతన్న దొర సీతారామరాజును కలుసుకొని పరిస్థితులను వివరించాడు. అప్పటికే అంతకు ముందు కొన్ని పితూరీలు మన్యంలోని ప్రజలకు అనుభవం వుంది. అయితే ఆ పితూరీలు కొన్ని తప్పుదోవ తీసుకొని ప్రజలని దోచుకొనే వైపుగా కూడా మళ్ళాయి. గాం గంతన్న దొర ఈ విషయాలన్నీ రామరాజుతో చర్చించి, తాము నడపబోయే ఉద్యమానికి ఒక నాయకుడి అవసరం వుందని, ఆ నాయకుడు రామరాజే కావాలని కోరాడు.

రామరాజు తన మూలికా వైద్యంతో, మిగిలిన ఆధ్యాత్మిక కార్యకలాపాలతో గిరిజనులకు దగ్గరయి, వాళ్లకు రాజకీయ చైతన్యం అందించడం ప్రారంభించాడు. ఆ విధంగా గొప్ప నిర్మాణ దృష్టిని ప్రదర్శించాడు. తమ సమస్యలను పరిష్కరించగలడని ఆదివాసీ ప్రజలు నమ్మారు. తమ కష్టాలు కడతేరుస్తాడని విశ్వసించారు. ఆ కారణంగానే ఆయన్ని, ఆయన ఉద్యమాన్ని గుండెల్లో పెట్టుకొని కాపాడుకున్నారు.

రామరాజు కదలికలపై నిఘా వేసిన బ్రిటిష్ ప్రభుత్వం ఆయన భవిష్యత్‌లో మన్యం కొండల్లో విప్లవం లేవదీయనున్నాడని గ్రహించింది. అందుకే దుచ్చెర్తి ముఠాదారు చెక్కా లింగన్న దొరకు పైడిపుట్ట గ్రామంలో 50 ఎకరాల పొలం ఇవ్వమని ఆదేశించింది. కానీ తాను నేపాళం వెళుతున్న కారణంగా దానిని స్వీకరించలేకపోతున్నానని లింగయ్య దొరకు లేఖ రాసి వెళ్ళిపోయాడు. ఈ నేపథ్యంలో రామరాజు చిట్టగాంగ్

విప్లవవీరులను కలిసాడని కొంతమంది చరిత్రకారులు అభిప్రాయ పడుతున్నారు.

రామరాజు పోరాటం ప్రధానంగా గెరిల్లా ఎత్తుగడలతో సాగింది. ఆయన కార్య క్షేత్రం విశాఖ మరియు తూర్పు గోదావరి మన్య ప్రాంతం. రామరాజు తన ఉద్యమాన్ని ప్రజల ఉద్యమంగానే మలిచాడు తప్ప కొంతమంది యొక్క వీరోచిత చర్యల కారణంగానే విప్లవం సిద్ధిస్తుందనే భ్రమలలో లేడు. పోరాట సమయంలో అల్లూరితో 200 నుంచి 500 వరకూ ప్రజలు ఆయుధాలతో పాల్గొనేవారు. గ్రామం నుంచి గ్రామం వెళ్ళేటప్పుడు ఈ కూర్పు మారేది. కొత్త గ్రామానికి వెళ్ళినప్పుడు మరికొంత మంది చేరేవారు. విప్లవంలో పిల్లలు, స్త్రీలు కూడా పాల్గొన్నారని తెలుస్తుంది. రామరాజు గూఢచారి వ్యవస్థ పటిష్టంగా వుండేదని ఇంగ్లీష్ ఆఫీసర్లు తమ రిపోర్ట్‌లలో రాసుకున్నారు. బ్రిటిష్ శిబిరాల్లో రామరాజు తన దళాల కదలికల గురించి వదంతులు వ్యాపింపజేసేందుకు వేగుల వ్యవస్థను ఉపయోగించేవాడట.

రామరాజు ఉద్యమం రెండు సంవత్సరాల పాటు ఆధునిక ఆయుధాలు కలిగిన బ్రిటీష్ సైన్యంతో పోరాడి నిలబడ్డానికి, ఆ ఉద్యమాన్ని ప్రజలు సొంతం చేసుకోవడం ఒక కారణమైతే రెండవది రామరాజు అక్కడి ప్రజల జీవన విధానంలోనించే తన ఎత్తుగడలను, వ్యూహాలను రచించుకోవటం. వాళ్ళ గుండె చప్పుళ్ళు విన్నాడు కనుకనే కొండల అనుపాన్లు తెలుసుకోగలిగాడు. ఆ గుట్టల గుండెల్లో భద్రంగా ఉద్యమాన్ని నడపగలిగాడు. ఆదునిక యుద్ధంలో నిపుణులై, యుద్ధాలలో అపార అనుభవం వున్న కవార్డ్, హైదర్ వంటి సేనా నాయకులను మట్టి కరిపించాడు. కొండల్లో ఎత్తునుంచి బండలు దొర్లించడం ద్వారా వాళ్ళని రామరాజు మట్టుపెట్టగలిగాడని కొంతమంది రాస్తే మరికొంతమంది రాజు దళంలోని షార్ప్ షూటర్ లైన గోకిరి ఎర్రెసు లాంటి వాళ్ళు నేలకూల్చారని అంటారు.


రామరాజు ఉద్యమంలో కొన్ని భావవాద పోకడలు కూడా వున్నాయి. అయితే ఈ భావవాద పోకడలు కొన్ని విప్లవానికి దోహదపడితే మరికొన్ని ఉద్యమ బలహీనతలుగా వ్యక్తమయ్యాయి. అతని పూజ పెట్టె, పూజలూ, యాగాలు, వాస్తు, జ్యోతిష్యం, మూలికావైద్యం వంటివి చూసి ప్రజలు రామరాజును దైవాంశ సంభూతిడిగా భావించి అతనికి దగ్గరయ్యారు. ఆయన నెరపిన విప్లవాన్ని తాము సొంతం చేసుకున్నారు. ఒక చైతన్యం అందేవరకూ గుడ్డిగా అయినా వాళ్ళు తనని అనుసరించేటట్టు చేసుకోగలిగాడు అల్లూరి. ఆయన నిర్మాణ దృష్టికి అద్వితీయమైన ఉదంతం ప్రచారంలో పెట్టిన పూరీ జగన్నాథుడి పేరుతో లేఖ. ఎందుకంటే ఆనాటికి గిరిజన ప్రాంతంలో ఎక్కువమంది పూరీ జగన్నాథుని భక్తులు ఉండేవారు. అందుకని రామరాజును ప్రజలు అనుసరించేలాగున పూరీ జగన్నాథుడి పేరుతో లేఖని ప్రచారంలో పెట్టడం అతని ఉద్యమ నిర్మాణ దృష్టి తెలుస్తుంది.

శత్రువు భారతీయుడైతే అతనికి హాని చెయ్యకుండా విడిచి పెట్టడం, ముందే చెప్పి పోలీసు స్టేషన్‌లను కొల్లగొట్టడం వంటివి ఉద్యమానికి హాని చేశాయి. అందుకే ఆ తదుపరి పోలీసు స్టేషన్లు కొట్టడానికి వెళ్ళినప్పుడు పోలీసులు అప్రమత్తమై ముందే ఆయుధాలు తరలించడం వంటివి చేసేవారు. ఆ తర్వాత అల్లూరి దండు తీవ్రమైన మందుగుండు కొరతని ఎదుర్కొంది. మలబార్ సైన్యాలు గిరిజనులను హత్య చేసి, ఆడవాళ్లపై అత్యాచారాలు చేస్తున్నప్పుడు ఆ సైనికులు భారతీయులైనందుకు వారిని చంపడానికి ఆయన అంగీకరించలేదు. ఈ విషయమై అనుచరులకు రామరాజుకీ కొన్ని విభేదాలు కూడా పొడసూపాయి. అయినా తాను నమ్మిన విలువల నుంచి ఆయన వైదొలగలేదు. ఉద్యమం బలహీన పడ్డానికి రామరాజుకి వున్న ఈ భావవాద ధోరణి కూడా కారణం అయ్యింది.

రామరాజు అన్నవరం వెళ్ళినప్పుడు ఆయన్ని చూడ్డానికి వేలాదిమంది ప్రజలు వచ్చారు. కానీ ఆయన ఉద్యమానికి మైదాన ప్రాంతాల నుంచి తగిన మద్దతు దొరకలేదు. దీనికి ప్రధానకారణం రాజు ఉద్యమాన్ని టంగుటూరు ప్రకాశం పంతులు ఒక బందిపోటు చర్యగా కొట్టిపారేసాడు. రామరాజు తన ఉద్యమానికి మద్దతు కోసం కాంగ్రెస్ నాయకులతో నిరంతరం సంప్రదింపులు జరిపేవాడు. కాంగ్రెస్ నిజంగా అల్లూరి పోరాటాన్ని స్వీకరిస్తే మైదాన ప్రాంతపు ప్రజల మద్దతు కూడా లభించేది. బ్రిటిష్ ప్రభుత్వంపై చట్ట సభల ద్వారానూ ఇతరేతర మార్గాలలోనూ ఒత్తిడి తెచ్చే ప్రయత్నాలు జరిగేవి.

అల్లూరి తన ఉద్యమం ద్వారా గిరిజన సమస్యను ఒక ప్రధాన రాజకీయ సమస్యగా మలిచాడు. అందుకే చెరుకూరి నరసింహమూర్తి గారితో జరిపిన సంభాషణల్లో “మీ పోరాటం ఎందుకు” అని అడిగినప్పుడు “తన పోరాటం ప్రజలకు స్వాతంత్ర్యం చేకూర్చడానికే” అని అల్లూరి బదులిచ్చాడు. దీనిని బట్టి అల్లూరి ఈ విప్లవాన్ని దేశవ్యాప్తంగా విస్తరించాలనే లక్ష్యాన్ని పెట్టుకున్నాడని అర్థం అవుతున్నది. మరొకచోట తనకు పంజాబ్ విప్లవకారుల నుంచి సహాయ సహకారాలు అందు తున్నాయని రామరాజు చెప్పాడు. ఒక స్థానిక చిన్న పోరాటానికి ఒక విశాల భూమికను కల్పించాలనే రాజకీయ దృష్టిని కనబరిచాడు అల్లూరి. ఈ పోరాటాన్ని మైదానం ప్రాంతానికి విస్తరించగలిగితే, మైదానం ప్రాంతాల నుంచి కూడా ప్రజలు పెద్దయెత్తున కదిలితే ఆ పోరాట ఫలితాలు మరోరకంగా ఉండేవేమో! ✻

**పెట్టుబడిదారీవిధానం... చిన్న కథ**



వ్యాసం

శ్రీరామరాజు శతవర్ధంతి (07.05.1924 - 07.05.2024) సందర్భంగా :

# గిరిజనోద్యమ నిర్మాణమే సీతారామరాజుకి నిజమైన నివాళి

- దివికుమార్

(అల్లూరి శ్రీరామరాజు శతజయంతి సందర్భంగా 'ప్రజాసాహితి'లో ప్రతి నెలా ప్రచురించిన రచనలతోపాటు మరికొన్ని రచనలను కలిపి 1997లో జనసాహితి ప్రచురించిన 'మన్యం వీరుని పోరుదారి' పుస్తకానికి రాసిన ముందుమాటను ప్రచురిస్తున్నాం. నిర్మలానంద సంపాదకత్వంలో విడుదలైన ఈ పుస్తకాన్ని జనసాహితి ఉత్తర కోస్తా జిల్లాల ప్రాంతీయ సదస్సులో వేలాది ఆదివాసీ ప్రజల మధ్య 1997 మే 8న మహాశ్వేతాదేవి ఆవిష్కరించారు. - సం॥)

**ఈ** ప్రపంచాన్ని గురించి ఎన్నిరకాలుగానైనా వ్యాఖ్యానించవచ్చు గానీ దాన్ని మార్పు చేయటమే అన్నింటిలోకి కష్టసాధ్యమైన విషయం అన్నట్టు చరిత్రలో వీరోచితమైన, త్యాగపూరితమైన పాత్రను నిర్వహించిన వారిని ఎన్నో విధాలుగా పొగడొచ్చు. కానీ వారి వారసత్వాన్ని సమకాలీనానికి ఆచరణాత్మకంగా అన్వయించటమే కష్టాల్లోకెల్లా కష్టం.

అల్లూరి సీతారామరాజు శతజయంతి సంవత్సరమొచ్చింది. కనుక ఆయన వీరుడనీ, ధీరుడనీ, త్యాగశీలుడనీ వేనవేల విధాలుగా కీర్తించవచ్చు. ఆయనకు నిజమైన వారసులము. మేమంటే మేమని తెగ పోటీ పడొచ్చు. అయితే మనుషుల్లో ఉత్తములు, మధ్యములు, అధములు అనే విభజన వున్నట్టే అల్లూరి సీతారామరాజు లాంటి వారి గురించి మాట్లాడేవారిలో కూడా మూడు రకాలవారూ వుంటారు.




అల్లూరి సీతారామరాజు కీర్తి ప్రతిష్టలను వోట్ల కింద మార్చుకునే రాజకీయ నాయకులూ, నోట్ల పంట పండించే సినిమాలవాళ్లూ ఒక రకం. వీళ్లకు ఆయన స్ఫూర్తితో ఏ విధమైన సంబంధం వుండదు. ఆయన 'మూర్తి' (విగ్రహం)కి భజనలు చేసి, దైశాంశ సంభూతునిగా మార్చివేయగల సమర్థులు వీరు. సీతారామరాజు చనిపోలేదు అంటూ మారువేషంలో 'బెండపూడి' సాధువు రూపంలో ప్రజల్ని మోసం చేసిన తీరుకీ పైవారికీ పెద్ద తేడా లేదు. వ్యాపార పద్ధతుల్లో తేడా అంతే. ఇదంతా మూడవ రకం.

సీతారామరాజు త్యాగానికీ, దీక్షకూ వళ్లుపులకరించిపోతూ, అప్పుడప్పుడు ఆవేశం తెచ్చుకుని చప్పున జీవితంలో రాజీపడిపోతూ మళ్ళీ అటువంటి వారెవ్వరైనా వచ్చి ఈ దేశాన్ని మరమ్మత్తు చేస్తే బాగుందునని ఎదురుచూసే సహృదయులు రెండవ రకం లేక మధ్యములు. నిజంగా విప్లవ దీక్షాపరులు తటస్థపడితే తమకు యిబ్బంది లేని మేరకు సహాయ సహకారాలు కూడా అందించేతత్వం వీరిది.

అల్లూరి సీతారామరాజు పోరాట లక్ష్యాలను నెరవేర్చటానికి, ఆశయాలను అమలుపరచటానికీ తమకంటే ప్రజా ప్రయోజనాలే మిన్నగా ఆచరణలో పెట్టేవారే ఉత్తములు. సీతారామరాజు యొక్క పోరాట సారాన్ని అవగాహన చేసుకోవలసిన అవసరం, బాధ్యత, కర్తవ్యం వీరికే ఉన్నాయి. వీరి అధ్యయనం మొక్కుబడిగా వుండదు. అర్థవంతమైన ఉద్యమరూపం ధరిస్తుంది.

బ్రిటీషు సామ్రాజ్యవాదులు భారతదేశ అటవీ ఖనిజ సంపదల్నీ, కారుచౌకగా గిరిజనుల శ్రమశక్తినీ కొల్లగొట్టటానికి అడవులపైన కూడా తమ అధికారాన్నీ, ఆధిపత్యాన్నీ ప్రకటించుకున్నారు. కొన్ని వందల సంవత్సరాలుగా ఫ్యూడల్ ప్రభువులు కూడా ఈ గిరిజనుల జీవితాల్లో అంత పెద్దగా కల్లోలం రేపలేదు. వలస పాలకుల ప్రతినిధులుగా మొఖాసాదార్లు (ఒక రకం జమీందార్లు), ఫారెస్టు రెవెన్యూ అధికారులు, పోలీసులు గిరిజనులను దోపిడీ చెయ్యటంలోనూ, క్రూరంగా హింసలు పెట్టటంలోనూ నిమగ్నమై వుండేవారు. దేశ వ్యాపితంగా బ్రిటీషు వలస పాలకుల చట్టాలు, శాసనాలు, అధికార మదాంధకారులకు వ్యతిరేకంగా గిరిజన తెగలు జరిపినన్ని పోరాటాలు మరెవ్వరూ జరపలేరు.

గిరిజనుల చావు – బతుకులకు సంబంధించిన రోజువారీ ప్రశ్న అడవి ఎవరిదనేది. పోడు వ్యవసాయం కూడదన్నారు. పశువులు స్వేచ్ఛగా తిరగరాదన్నారు. ఆఖరికి వంట చెరుకు కూడా అడవి నుండి

తెచ్చుకోరాదన్నారు. తమ కాంట్రాక్టర్ల దగ్గర గొడ్డు చాకిరీ చేసి బేడ (రూపాయిలో 8వ వంతు) కూలీ పుచ్చుకుని బతకమన్నారు.

దోపిడీ పీడనలకు నలిగిపోతున్న గిరిజనులకు బ్రిటీషు పరిపాలనకు మధ్య గల తీవ్ర వైరుధ్యం, గిరిజనుల్లో నివురుగప్పిన నిప్పులా రగులుతున్న బ్రిటీషు వ్యతిరేక ద్వేషం సీతారామరాజు పసిగట్టాడు. నివురుని ఊది నిప్పుని రాజేశాడు. రెండు సంవత్సరాల పాటు బ్రిటీషు పాలకుల్ని చాలా కొద్దిమంది అనుచరులతోనే ముప్పతిప్పలు పెట్టగలిగాడు. అప్పటికే (1922-24) భారత రాజకీయాలతో జాతీయోద్యమ నేతగా బాగా ప్రాచుర్యంలోకి వచ్చిన గాంధీ తరహా పోరాటానికి పూర్తి భిన్నమైన పోరాట పంథాను సీతారామరాజు ఎంచుకున్నాడు. బెంగాల్ విభజన (1905)కు వ్యతిరేకంగా పెద్దఎత్తున ప్రజానిరసనగా పెల్లుబికిన స్వాతంత్ర్యోద్యమం తిలక్ అరెస్టుకి నిరసనగా బొంబాయి కార్మికుల సార్వత్రిక రాజకీయ సమ్మె, గదర్ వీరుల త్యాగపూరిత పోరాటం, జలియన్ వాలాబాగ్ సంఘటనలతో అట్టుడికిపోయింది. మొదటి ప్రపంచయుద్ధంలో ప్రజలపై మోపిన పన్నుల భారం బ్రిటీషు పరిపాలన పట్ల ద్వేషభావాన్ని పెంపొందించింది. రష్యాలో బోల్షివిక్ విప్లవం విజయవంతమై కార్మిక-కర్షక రాజ్యం ఏర్పడిన వార్త భారతీయులలో సంచలనాన్ని, సరికొత్త చైతన్యాన్ని రేపుతోంది.

భారతీయుల స్వాతంత్ర్యపోరాటం హద్దులు మీరకుండా, బ్రిటీషు సామ్రాజ్యవాదాన్నీ వారి తాబేదారులైన రకరకాల ఫ్యూడల్ ప్రభువుల్నీ, వీరిరువురి ముద్దుబిడ్డలైన పెట్టుబడిదారీ వర్గాన్నీ పునాదుల్తో సహా తుదముట్టనివ్వకుండా అదుపుచేయగల నాయకత్వపుటవసరం పై మూడు వర్గాలకూ ఏర్పడింది. మొదటి ప్రపంచ యుద్ధంలో బ్రిటీషువారి తరపున యుద్ధంలో పోరాడి మరణించటానికి గ్రామగ్రామానికీ తిరిగి యువకుల్ని సైన్యంలోకి రిక్రూట్ చేయించిన 'అహింసావాది'పట్ల పాలకులకు కూడా నమ్మకం కుదిరింది.

1917లో బీహార్ రాష్ట్రంలో చంపారన్‌లో నీలిమందు రైతుల పోరాటమూ, గుజరాత్ రాష్ట్రంలో ఖేడా జిల్లాలో భూమిశిస్తు పెంపుదలకు వ్యతిరేకంగా జరిగిన ఆందోళనా (1918) వీటి రెంటి మధ్యా అహమ్మదాబాదు బట్టల మిల్లు కార్మికుల సమ్మెకు మధ్యవర్తిత్వం, వీటన్నిటిలో కార్మికుల-రైతుల పోరాటాల్ని వారి మౌలిక సమస్య ల్లోతుల్లోకి పోనివ్వకుండా చూడటమూ, పోరాటం మిలిటెంట్ స్వభావం పొందకుండా, అదుపుచేయటమో, నీళ్లు చల్లటమో ఒక విధంగా గాంధీ జాతీయోద్యమాన్ని నడిపించాడు.

తర్వాత కాలంలో సహాయ నిరాకరణోద్యమం పన్నుల నిరాకరణ వ్యాప్తి చెందకుండా చేయటంలోనూ, మోప్లా (మలబారు-1921) రైతాంగ పోరాటాన్ని మతఘర్షణలుగా చిత్రించి ఖండించటంలోనూ, చౌరీచౌరీ సంఘటన (1922)తో ప్రజావెల్లువ పెల్లుబుకవలసిన తరుణంలో మొత్తంగా సహాయ నిరాకరణోద్యమాన్నే విరమించేసి ప్రజాపోరాటంపై నీళ్లుచల్లి బ్రిటీషు ప్రభువులకు ఎక్కువ యిబ్బందులు కలగనివ్వకుండా గాంధీ నాయకత్వం కృషి చేసింది.

బ్రిటీషు పరిపాలకులచేత అత్యంత క్రూరంగా దోపిడీ చేయబడుతోన్న అతి నికృష్ట జీవన పరిస్థితులలోనున్న గిరిజనుల (మొత్తం జనాభాలో 7 శాతం మంది వుండినప్పటికీ) గురించి గాంధీ నాయకత్వం కించిత్తు ఆలోచన కూడా ఎప్పుడూ చేయలేదు. వాస్తవానికి గిరిజనులపై దోపిడీ తీవ్రత ఎంత హెచ్చుగా వుందో సరిగ్గా అక్కడే బ్రిటీషువారి పరిపాలనా యంత్రాంగం యొక్క పట్టు అంత బలహీనంగా వుంది. అంతేకాదు. బ్రిటీషు ఆధిపత్యానికి వ్యతిరేకంగా దేశంలోని అనేక ప్రాంతాలలో గిరిజనులు ఎంతో అణచివేతకు గురయినా వందలాది పోరాటాలు చేశారు. ఆ పోరాటాలన్నీ అత్యంత సహజంగా 'రాజ్యం'తో ప్రత్యక్ష ఘర్షణకు గురికాకుండా వుండలేవు. వాటిల్లో శాంతియుతమనే ఆలోచనకే అవకాశం తలెత్తదు.

గిరిజనుల సమస్య ఎటుతిప్పి తీసుకెళ్లినా భూమి దగ్గరకొచ్చి కూచుంటుంది. అడవి మీద అధికారం ఎవరిది? భూముల సాగు, పంట అనుభవం ఎవరికి చెందాలి? ప్రభుత్వాల యొక్క అడవీ, రెవెన్యూ, పోలీసు యంత్రాంగపు ప్రత్యక్ష అణచివేతను ఎలా ఎదుర్కోవాలి అనే సమస్యలతో తప్పనిసరిగా ముడిపెట్టుకుని వుంటాయి. ప్రభుత్వ చట్టాలూ, శాసనాలు ఆమోదించటమో, ధిక్కరించటమో తప్ప మధ్యేమార్గం సాధనం కాని విధంగా గిరిజన సమస్య సూటిగా వుంటుంది.

దేశీయ సంపదల్ని తరలించుకుపోయే బ్రిటీషు అటవీ విధానాన్ని గానీ, గిరిజనుల్ని నికృష్టంగా దోపిడీ పీడనలకు గురిచేస్తున్న క్రూర పరిపాలనా పద్ధతుల్నిగానీ - గాంధీ నాయకత్వం, కాంగ్రెసు పార్టీ ఏనాడూ పట్టించుకోలేదు. తరతరాలుగా అనేక వందల తిరుగుబాట్లు సాగించిన గిరిజన పోరాట సంప్రదాయాన్నీ, ఆయుధం పడితే తప్ప ప్రభుత్వాల నుండి బతకలేని దుర్భర పరిస్థితుల్నీ 'జాతీయ' నాయకత్వం విస్మరించేసింది.

బ్రిటీషు సామ్రాజ్యవాదుల పరిపాలన అత్యంత బలహీనంగా వుండే ఏజెన్సీనే తన పోరాట ప్రాంతంగా మార్చుకున్నాడు అల్లూరి సీతారామరాజు. విశాఖ, తూర్పుగోదావరి ఏజెన్సీలోని గిరిజనుల్ని కూడగట్టి, సంఘటితపరచటానికి రెండు సంవత్సరాల కాలం (1920-22) తీసుకున్నాడు. ముందుగా తాను చేయబోయే పోరాటానికి వ్యూహరచన చేసుకున్నాడని చెప్పలేముగానీ, ఆచరణలో అనుభవంలో గిరిజన సంప్రదాయాల నుండీ సాయుధ పోరాట ఎత్తుగడలను అభివృద్ధి చేసుకున్నాడు. బ్రిటీషువారి చట్టాలు గిరిజనులకు వ్యతిరేకమైనవని గిరిజనులు స్వానుభవంతో అర్థం చేసుకునేట్టు కృషి చేశాడు. వేర్వేరు తెగల వారిని ఐక్యం చేయటమేకాక బ్రిటీషువాళ్లు గిరిజనుల మధ్య పెట్టిన చీలికలను, అనుభవం ద్వారా గ్రహించేట్టుచేసి అత్యధికుల్ని ఒకటిగా నిలబెట్టాడు. తమ పోరాటానికి మైదాన ప్రాంతాల జాతీయోద్యమకారులు మద్దతుగా నిలుస్తారనే భ్రమలు కూడా ఏదో ఒక మేరకు ఆయనలో ఉన్నాయి. కానీ కాంగ్రెసు నాయకత్వం (టంగుటూరి ప్రకాశం పంతులు) సీతారామరాజు బందిపోట్ల కార్యక్రమంగా భావించాడు. పెద్దాపురం కాంగ్రెసు కమిటీవారు మన్యం పోరాటానికి మద్దతునివ్వాలని చేసిన ఆలోచనని తమ ఆదేశాల ద్వారా మొగ్గలోనే కాంగ్రెసు నాయకత్వం తుంచేసింది.

గాంధీకీ, కాంగ్రెసు నాయకత్వానికీ బ్రిటీషు సామ్రాజ్యవాదానికీ, సాంఘిక పునాదిగా వుండిన భూస్వామ్య వ్యవస్థను (మహారాజులూ, నవాబులూ, జమీందార్లూ, దేశముఖులూ, మొఖాసాదార్లూ) బద్దలు కొట్టాలనే అవగాహనా, ఆలోచనే లేదు. రైతుల్ని స్వాతంత్రోద్యమంలోకి

దింపటాన్ని ప్రయత్నపూర్వకంగా నిరోధించింది. ఇక ఎస్టేట్ల (నిజాం, మైసూరు మొ॥)తో తానుగా పోరాటాన్నే ప్రారంభించలేదు. పెట్టుబడీ, పరిశ్రమలతోపాటు పెరుగుతున్న కార్మికవర్గాన్ని రాజకీయాలకూ, స్వాతంత్ర్య పోరాటానికి ఆమడ దూరంలో వుంచాలనే ప్రయత్నించింది. అటువంటి నాయకత్వానికి కొండ ప్రాంతాల్లో పరాయీకరణకు బలయిపోతున్న గిరిజనులను బ్రిటీషు వ్యతిరేక పోరాటంలోకి సమీకరించి స్వాతంత్ర్య పోరాటంలో అంతర్భాగం చేసుకుందామన్న అవగాహనే తలెత్తే అవకాశం వుండదు.

## II

20వ శతాబ్దపు భారత ప్రజాపోరాటాలలో గెరిల్లా యుద్ధ స్థాయికి చేరిన తొలి పోరాటంగా మన్యవిప్లవాన్ని మనం పరిగణించవచ్చు. దాదాపు గిరిజనుల పోరాటాలన్నీ రాజ్యంతో ప్రత్యక్షంగా తలపడక తప్పని పరిణామక్రమం ఒకటి అనివార్యమవుతుంది. గిరిజనుల సాంప్రదాయక ఆయుధాల (పనిముట్ల)తో అత్యాధునిక బ్రిటీషు సాయుధ సైనికుల్ని ఎదుర్కోవటం యుద్ధంలో అసమానతగా వుంటుంది. అందుచేత ఆధునిక ఆయుధాలు పోరాటయోధులు సమకూర్చుకోక తప్పదు. శత్రువునుండే ఆయుధాలు సంపాదించటం గెరిల్లా ఎత్తుగడల్లో ఒకటి. చింతపల్లి, కృష్ణదేవిపేట (విశాఖజిల్లా) రాజవొమ్మంగి, అడ్డతీగల, రంపచోడవరం (గోదావరిజిల్లా) పోలీసు స్టేషన్లపై దాడిచేసి ఉన్నంతలో ఆధునికమైన తుపాకులనూ, మందుగుళ్లనూ రైఫిళ్ళనూ స్వాధీనం చేసుకుని తమ ఆయుధ సంపదను ఎంతోకొంత ఆధునికం చేసుకున్నాడు. రామరాజు మిలిటరీ శిక్షణనిచ్చి గిరిజనుల్ని గెరిల్లాలుగా అభివృద్ధి చేశాడు. అందుకు గిరిజనుల సాంప్రదాయకపోరాట ఎత్తుగడలనే ఎక్కువగా వినియోగించుకున్నాడు. ఆయన నిర్మించిన సాయుధ దళ సభ్యులందరూ కలిసినా వందమందికి మించి ఎప్పుడూ లేరు. కానీ పోలీసుస్టేషన్లపై దాడిలోనూ, బ్రిటీషు పోలీసులతో యుద్ధం జరిగే సందర్భాలలోనూ అనేక రూపాలుగా గిరిజన ప్రజానీకం పోరాటంలో ప్రత్యక్షంగానో పరోక్షంగానో నిమగ్నమై వుండేలా చేసుకున్నాడు.

అత్యాధునిక ఆయుధాలతో 700కు పైగా బ్రిటీషు సాయుధ సైనికులూ, వారికి నాయకత్వంలో 30 మంది అధికారులూ వుండగా రామరాజుకి వందకు లోపుగానే దళసభ్యులుండినారు. తానూ, గాము గంటందొర, ఎండు పడాలు, ఎర్రేసు, అగ్గిరాజు – మొత్తం ఐదుగురికంటే నాయకత్వం అందించగలవారు లేరు.

ఆహార సరఫరాల్లో కూడా శత్రువుకి అందేవాటిని స్వాధీనం చేసుకోవటమో, ధ్వంసం చేయటమో తప్పనిసరి. అలాగే రోడ్లూ, టెలిగ్రాఫ్ తీగలూ శత్రువుకు ఉపయోగపడకుండా చేయగలగాలి. ఇవన్నీ బ్రిటీషువారికున్న అదనపు అనుకూలతలు.

కొండలూ, కోనలూ, గుహలూ, అడ్డదారులూ, చీకటివేళలూ, మాటుకాయటాలూ – వీటన్నిటికి తోడు గిరిజన ప్రజల సహకారం, సాంప్రదాయక ఆయుధాలను నేర్పుగా వాడగల సామర్థ్యం – ఇవే పోరాటయోధుల భౌగోళిక, సాంస్కృతిక సంపద.

మన్యం పోరాటం ఎంతో బలోపేతమైన బ్రిటీషు ప్రభుత్వాన్ని దాదాపు 2 సంవత్సరాలపాటు గుక్కతిప్పుకోకుండా చేయగలిగింది. మొత్తం పోరాటం సీతారామరాజు ఒంటరిగా నిర్మించీ, నడిపించినదే. బయట నుండి ఏ మాత్రం సహకారం కూడా లేదు. తన స్వంత అనుభవాలతో ఆలోచించి, నిర్ణయించుకుని సాగిన పోరాటానికి దాని పరిమితులు దానికుంటాయి. ఇందులో మనం గ్రహించవలసింది – మెలుకువతో కూడిన గెరిల్లా ఎత్తుగడలను అనుసరించటం ద్వారా, కొద్ది ప్రాంతంలో తక్కువమంది అనుచరులతో కూడా బలమైన ప్రభుత్వాన్ని ప్రతిఘటించ గలగటమన్న ముఖ్యమైన అంశాన్ని.

సీతారామరాజు యొక్క పోరాటంలోని సిద్ధాంత, రాజకీయ, మిలటరీ ఎత్తుగడలకు చెందిన బీజరూప అంశాల్ని గ్రహించి మారిన పరిస్థితులకనుగుణంగా వినియోగించటానికి ప్రయత్నించినవారే ఆయనకు నిజమైన వారసులు కాగలుగుతారు. అలాకాక ఆ పోరాటాన్ని ఏదో చెదురుమదురు సంఘటనగా భావించి, ఆయన వీరోచిత కృత్యాలను పొగడడానికి పరిమితమైనవారు, కొనసాగుతున్న గిరిజనోద్యమాలను చూడ నిరాకరించేవారు మహా అయితే ఆయన "భక్తు"లవుతారు.

## III

సీతారామరాజు పోరాటం ప్రధానంగా కొండకోనల్లో జీవించే అడవి బిడ్డలైన గిరిజనుల్ని దోపిడీ పీడనల నుండి విముక్తి చెయ్యాలనే లక్ష్యంతో ప్రారంభమైంది. 'రాజ్యం' (ఆనాడు బ్రిటీష్) దోపిడీవర్గాల సేవలో అటవీ సంపదలను తరలించుకుపోవటానికి రకరకాల చట్టాలూ, శాసనాలూ చేసి గిరిజనులను అడవికి దూరం చేయటమేకాక, కాంట్రాక్టర్ల కింద కూలీలుగా మార్చివేసింది. కనుక గిరిజనుల జీవితాలు మెరుగు పడాలంటే తప్పనిసరిగా సామ్రాజ్యవాదులను, దళారీలనూ, వారిచే నియమించబడిన లేక వారి ప్రభుత్వాలు చేసిన చట్టాలలోని లొసుగులను వాడుకుని గిరిజనులను వారు భూముల నుండి వెళ్ళగొట్టేవారికి వ్యతిరేకంగా పోరాటం చేయక తప్పదు.

సీతారామరాజుకి ప్రతి సంవత్సరం నివాళులర్పించే కాంగ్రెసు పాలకులు గిరిజనుల జీవనాభివృద్ధికి తోడ్పడకపోగా బ్రిటీషు సామ్రాజ్యవాదుల అడుగుజాడల్లోనే నడుస్తున్నారు. మైదాన ప్రాంతపు 'తెలివి' గల భూస్వాములూ, షావుకార్లూ, కాంట్రాక్టర్లూ 'రాజ్యం' యొక్క సమస్త అంగాల్నీ ముఖ్యంగా రెవెన్యూ, పోలీసుల్ని అడ్డం పెట్టుకుని ఈనాటికీ తీవ్రమైన దోపిడీ సాగిస్తున్నారు.

నక్సల్‌బరీ, శ్రీకాకుళం, గోదావరిలోయ, దండకారణ్యం, బీహారు తదితర ప్రదేశాల్లో సాగుతున్న పోరాటాలు – పద్ధతులూ, మార్గాల్లో తేడాలున్నా గిరిజనులను దోపిడీ పీడనల నుండి విముక్తి చెయ్యటానికి ఉద్దేశించినవే. ఆ రకంగా ఇంకా పరిపూర్తికాని అల్లూరి ఆశయాన్ని నెరవేర్చటానికి సాగుతున్నవే. వాటిని బ్రిటీషు పాలకుల్లాగానే ఎన్‌కౌంటర్లతో అణచివెయ్యాలని ఈనాటి పాలకులు కూడా ప్రయత్నిస్తున్నారు. సీతారామరాజు పేరు తలవటానికి వాళ్లకి సిగ్గు కూడా రావటంలేదు.

ఇటీవలి కాలంలో ప్రముఖంగా పత్రికలలో వస్తున్న పశ్చిమగోదావరిజిల్లా పోలవరం ఏజెన్సీ ప్రాంతంలో గిరిజనులు తమ భూముల్ని సాధించుకోడానికి మిలిటెంట్ పోరాట రూపాల్ని వినియోగిస్తున్నారు. సాయుధ పోలీసుల్నే నిరోధించే పరిస్థితి అనేక పర్యాయాలు వచ్చింది. కొండమొదలు గోదావరిలోయ ప్రాంతంలో దాదాపు 30 సంవత్సరాలుగా సాగుతున్న పోరాటపు ప్రతిఫలనమే పశ్చిమగోదావరి గిరిజనోద్యమం.

శ్రీకాకుళ గిరిజన రైతాంగ సాయుధ పోరాట ఫలితంగా 1970లో చేయబడిన 1వ రెగ్యులేషన్ (1/70 చట్టం) కాంగ్రెసు పాలకులుగానీ, తెలుగుదేశం పరిపాలకులుగానీ అమలుపరచని ఫలితంగానే తిరిగి పార్వతీపురం ప్రాంతంలో భద్రగిరి – సాలూరు ఏజెన్సీలో గిరిజనుల పోరాటం మిలిటెంటు రూపాల్ని తీసుకుంటోంది.

సీతారామరాజు సామ్రాజ్యవాదంపట్ల సమగ్ర అవగాహన కలవాడు కాకపోయినా, బ్రిటీషు సామ్రాజ్యవాదం, గిరిజనులపై సాగిస్తున్న దోపిడీ అణచివేతలు పోవాలని కోరుకున్నాడు. కానీ మనదేశం గత 50 సంవత్సరాల చరిత్ర వలసపాలన నుండి పునర్వలస పాలనకు సాగుతుండిన చరిత్రే. డంకెల్ ప్రతిపాదనలూ, గాట్ ఒప్పందాలతో మరింతగా దేశం సామ్రాజ్యవాదుల ఉచ్చుల్లో గిలగిలలాడుతోంది. అటవీ భూములు, ఎంతో విలువైన గ్రానైట్ రాళ్లూ, బొగ్గూ, ఇనుము తదితర ఖనిజాలూ దోపిడీవర్గాల భుక్తంగా మార్చటంలో ప్రభుత్వాలు పోటీపడుతున్నాయి. సీతారామరాజు ఆశయానికి తీవ్రద్రోహం చేస్తున్నాయి. పేపరు మిల్లుల యజమానులకూ, కాఫీ, టీ, తేనె, వెదురు, యూకలిప్టస్, సుబాబుల్ తదితర ప్లాంటేషన్లు వేసి కోట్లకు పడగలెత్తాలనుకునే సంపన్నవర్గాలకూ అటవీ పెంపకం పేరుతో అప్పజెబుతున్నారు. ఇప్పటికే ఫారెస్టు అధికారులు, కాంట్రాక్టర్లూ చట్టబద్ధంగా, విరుద్ధంగా అడవినంతా బోడిచేసి పర్యావరణ సమస్యల్ని కూడా సృష్టించారు.

బహుళజాతి, సామ్రాజ్యవాదులతో చేసుకున్న ఒప్పందాలలో భాగంగా గిరిజనులకు చెందాల్సిన భూముల్నీ, అటవీ సంపదల్నీ భూస్వాములకూ, వడ్డీ వ్యాపారులకూ, కాంట్రాక్టర్లకూ వీరందరి ఉమ్మడి యజమానులైన విదేశీ దోపిడీదార్లకు కట్టబెడుతున్నారు.

మన రాష్ట్రంలో శ్రీకాకుళం నుండి ఆదిలాబాదు దాకా తరతమ స్థాయిల్లో గిరిజనులు 1/70 చట్టం అమలుకోసం, తమను అడవితల్లి నుండి దూరం చేయకుండా వుండటం కొరకు పోరాటాలు చేస్తున్నారు.

గిరిజనులను దోపిడీ పీడనల నుండి విముక్తి చెందేట్టు చూసి, వారు తమ కాళ్లమీద నిలబడి విద్యా, వైజ్ఞానికరంగాలలో అభివృద్ధి చెందేట్లు కృషిచేయటానికి సంకల్పించినవారే. అందుకు జీవితాల్ని కూడా పణమొడ్డిన త్యాగధనులే సీతారామరాజుకి నిజమైన వారసులు కాగలుగుతారు.

తెలుగువారి పౌరుషాగ్నికి ప్రతీకగా నిలిచిన ఆ వీరుని బ్రిటీషు ముష్కరులు కాల్చి చంపి 'ఎన్‌కౌంటర్' అని ప్రకటించి 73 సంవత్సరాలు గడిచింది. ఇది సీతారామరాజు శతజయంతి సంవత్సరం కూడా. 4–7–1997కి ఆయనకు 100 సం॥లు పూర్తవుతాయి. గత సంవత్సరం జూలై నుండి 'ప్రజాసాహితి' పత్రికలో సీతారామరాజు గురించి వ్యాసాలూ, సాహిత్యమూ ప్రచురిస్తున్నాము. ఆయన వర్ధంతి సందర్భంగా విశాఖపట్నంలో జరిగే 'గిరిజన సదస్సు'కి ప్రముఖ బెంగాలీ రచయిత్రి, గిరిజనుల హృదయాన్ని తన సాహిత్యం ద్వారా ఆవిష్కరించిన మహాశ్వేతాదేవి ముఖ్య అతిథిగా విచ్చేస్తున్న సందర్భంగా ఈ పుస్తకాన్ని కొంత హడావుడిగా విడుదల చేయవలసి వచ్చింది.

ఈ పుస్తకాన్ని శ్రీకాకుళ గిరిజన పోరాటంలో తొలి అమరులైన కోరన్న మంగన్నల నుండి, కొండమొదలు ప్రాంతంలో 21 సంవత్సరాల 7 నెలల పాటు మొక్కవోని పట్టుదలతో అనేక ఆటుపోట్లను తట్టుకుని గిరిజన ఉద్యమాన్ని నిలబెట్టిన కా॥ సోమయ్య (నక్కా మోషే) గార్ల వరకూ పోరాటంలో అమరులైన వీరులందరికీ అంకితమిస్తున్నాము. ✺

## ఉన్మాదమే మతంగా భావించే గుంపు, వరంగల్లులో సాహిత్య సభపై జరిపిన దాడిని జనసాహితి ఖండిస్తోంది!

**తెలంగాణలో** "సమూహ" పేరుతో ఏర్పడిన సెక్యులర్ రచయితల ఐక్యవేదిక ఆధ్వర్యంలో కాకతీయ విశ్వవిద్యాలయంలో 28- 04-2024 ఆదివారంనాడు "లౌకిక విలువలు - సాహిత్యం" అనే అంశంపైన సభ జరిగింది. తెలంగాణలో జరిగిన ఈ రాష్ట్ర స్థాయి సదస్సులోనికి చొరబడి, ఉన్మాదమే మతంగా భావించే గుంపు, దాడికి తెగబడ్డారు. ఎన్నికల కాలంలో ఇలాంటి సదస్సుకు కాకతీయ విశ్వవిద్యాలయం అనుమతి ఎలా ఇచ్చింది అంటూ నిర్వాహకులతో వాదనకు దిగి, అనుమతి రద్దు చేయాలంటూ సదస్సులో గందరగోళం సృష్టించారు. సదస్సులో చర్చకోసం పెట్టిన అంశాలపై చర్చించడానికే వీలు లేదంటూ మతోన్మాదంతో ఫత్వాలు జారీచేశారు.

కార్పొరేట్ శక్తుల ప్రయోజనాలకై మణిపూరులో ఆదివాసీ మహిళలపై జరిగిన అత్యంత నీచమైన హత్యాచారాలను ఈ గుంపు ఎప్పుడూ ఖండించలేదు. ప్రపంచ స్థాయిలో పతకాలు సాధించిన మల్ల యోధురాండ్రపై జరిగిన అవమానకర వేధింపులను వీరు తప్పు పట్ట లేదు. ఎన్నికల నిబంధనలకు విరుద్ధమైన సదస్సు అయితే ఎన్నికల అధికారులను వివరణ కోరి ఉండాలి. దానికి బదులుగా సాహిత్య సమావేశాన్ని జరగనివ్వకుండా దౌర్జన్యపూరితంగా వ్యవహరించడాన్ని జనసాహితి ఖండిస్తోంది. ప్రజా సాంస్కృతిక విధ్వంసాన్ని సృష్టిస్తున్న సామ్రాజ్యవాద దళారీ శక్తుల కిరాయి మూకల లాగా వీరు ముందుకొస్తున్నారు. ఎవరు ఏమి తినాలి? ఎవరు ఏమి మాట్లాడాలి? ఎటువంటి బట్టలు కట్టుకోవాలో మేమే నిర్ణయిస్తామనే స్థాయిలో సాగుతున్న నియంతృత్వ ఫత్వాలను శ్రామిక ప్రజలు, లౌకికశక్తులు, ప్రజాతంత్రవాదులు ఆమోదించరని, ఈ అసాంఘిక శక్తులకు అర్థమయ్యేలా మన సాహిత్య కృషిని కొనసాగిద్దాం. ప్రజలు నిత్యం ఎదుర్కొనే జీవన్మరణ సమస్యలపై ఎన్నడూ మాట్లాడని ఈ ఉన్మాదశక్తుల అసలు లక్ష్యాన్ని ప్రజలకి తెలియజేయాలి. ఇటువంటి పాలకవర్గ అనుకూల శక్తులపై ఆచరణలో నిత్యం సంఘటితంగా పోరాడాల్సిన అవసరాన్ని ప్రజలకు తెలియచెప్పాల్సిన సాంస్కృతిక బాధ్యత నేడు మనందరిపై వుంది.

వరంగల్లు రచయితలపైన, నిర్వాహకులపైన దాడి చేసి గాయపర్చడాన్ని జనసాహితి సంస్థ తీవ్రంగా ఖండిస్తోంది. దేశంలోనూ, తెలుగు రాష్ట్రాల్లోనూ లౌకిక ప్రజాస్వామ్య విలువలను కాపాడుకోవాలని, ప్రజాస్వామిక హక్కులను, భావ ప్రకటనా స్వేచ్ఛను కాలరాసే ఇలాంటి ధోరణులను ముక్త కంఠంతో ప్రజాస్వామికవాదులంతా ఖండించాలని కోరుతున్నది.

**29-4-2024**

**జనసాహితి,** తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలు

వ్యంగ్యం

# మేక్ ఇన్ ఇండియా సూచీ

- శంకరం

**దేశ** చరిత్రలో మొట్టమొదటిసారిగా భారతదేశం తన స్వంత ప్రజ్వాస్వామిక సూచికను తయారుచేసుకోవడం భారత ప్రజాస్వామ్యానికే గర్వకారణం. పశ్చిమ దేశాలు తయారుచేసిన సూచికలను పక్కన పడేద్దాం అని నేను చాలాకాలంగా అంటున్నాను. అవి ఏకపక్షంగా అతిపెద్ద సామ్రాజ్యవాద దేశాలకే మొదటి పది ర్యాంకులను కేటాయించాయి. కానీ ప్రజాస్వామ్యానికే పుట్టినిల్లైన భారతదేశానికి కనీసం వందవ ర్యాంకును కూడా ఈయలేదు. ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్యానికి ఇది ఘోర అవమానం కదూ!

అయితే పశ్చిమ దేశాలకు మాదిరిగా తన స్వంత ప్రజాస్వామిక సూచికను రూపొందించుకున్న తూర్పు దేశం భారత్ ఒక్కటే కాదు. ప్రజాస్వామ్య, గణతంత్ర ఉత్తర కొరియా ఇప్పటికే తన సూచికను రూపొందించుకున్నది. ఉత్తర కొరియా రాజధాని ప్యాంగాంగ్ కేంద్రంగా కొందరు మేధావుల కూటమి తాజా సూచిక-2024ను రూపొందించింది. ఈ సూచిక ప్రకారం వంద పాయింట్లతో ఉత్తర కొరియా ప్రపంచ ప్రజాస్వామిక దేశాలలో మొట్టమొదటి స్థానంలో వుంది. 99 పాయింట్లతో చైనా రెండవ స్థానంలోనూ, 95 పాయింట్లతో రష్యా, ఇండియాలు ఉమ్మడిగా మూడవ స్థానంలోనూ ఉన్నాయి. ఇక అతిపెద్ద సామ్రాజ్యవాద దేశమైన అమెరికా కేవలం ఐదు పాయింట్లతో చిట్టచివరి (180 దేశాల్లో 180వ స్థానం) స్థానంలో వుంది. అంటే ఉత్తర కొరియా సూచిక ప్రకారం ప్రపంచంలో అతి తక్కువ ప్రజాస్వామిక విలువలను కలిగిన దేశం అమెరికా అన్నమాట. ఇంతవరకూ యూరోపియన్ సామ్రాజ్యవాద దేశాలనే ప్రజాస్వామిక విలువల సూచీతో మొదటి స్థానాల్లో చూస్తూ వచ్చిన మిగిలిన దేశాలకు ఇది గొప్ప ఉత్సాహాన్నిచ్చింది.

వింటూ వుండగా ఒకరోజు నా పాత మిత్రుడు, కొంతకాలం నాతో పాటు కలిసి పనిచేసిన వ్యక్తి అనుకోకుండా తారసపడ్డాడు. ఆయన భారతదేశం రూపొందిస్తున్న ప్రజాస్వామ్య సూచీని తయారుచేసే మేధావుల కూటమిలో సబ్ జూనియర్, సీనియర్ సభ్యునిగా ఉన్నాడు. అంతేనా.... సదరు కూటమి అధ్యక్షవర్గంలో నా మిత్రుడు కూడా ఉన్నాడని తెలిసి ఆశ్చర్యం, ఆనందం రెండూ చుట్టుముట్టాయి నన్ను.

వెంటనే అన్నాను "మనం ఉత్తరకొరియా నమూనానే ఫాలో అయిపోదాం" అని. నువ్వు చెప్పింది వాస్తవం. కొరియా నమూనా మనవాళ్ళను బాగా ఆకర్షించింది. అయితే మనం దానిని యథాతథంగా కాకుండా మనదైన పద్ధతిలోనే రూపొందించుకుందాం.

ఏమిటా విధానం?

మనం ఏ అంశానికి ఎంత ప్రాధాన్యతనిస్తామన్నదానిపైనే అది ఆధారపడి ఉంటుంది. ఉదాహరణకు 'జీవించే హక్కు'ను తీసుకుందాం. ఇది ప్రజాస్వామ్యానికి పునాది వంటిది. ఔనా?

'ఖచ్చితంగా!'

కనుక మనం రూపొందించబోయే ప్రజాస్వామ్య విలువల సూచీలో తుపాకుల నుండి మన ప్రజలకు ఎంత రక్షణ కల్పిస్తున్నాం అనే దానికే అధిక ప్రాధాన్యతనిస్తాం. వాస్తవం నీకు తెలిసిందే. ప్రపంచంలోనే అత్యల్ప సంఖ్యలో తూటాలకు బలవుతున్నవారు భారతీయులే.

'అద్భుతంగా చెప్పావు'!

మహిళా సాధికారత లేకుండా ప్రజాస్వామ్యాన్ని ఊహించుకోలేం. ఏమంటావు?

అంతేకదా!.... అంతేకదా!

కనుక.... మన ప్రజాస్వామ్య సూచీలో రెండవ ప్రాధాన్యతాంశంగా మహిళలకు 'గర్భస్రావ హక్కు'ను చేరుస్తున్నాం. దీనితో వి-డెమ్ సంస్థ, స్వీడన్‌లోని గులెన్‌బర్గ్ విడుదల చేసే ప్రజాస్వామ్య దేశాల సూచీలో మనమే అగ్రపీఠిన నిలుస్తాం.

'సూపర్ భయ్యా!'

ఇహపోతే మూడవ ప్రాధాన్యతాంశంగా 'వలసల'ను తీసుకుంటాం. యూరప్ దేశాలు వలసదారుల పట్ల ఎంత కఠినంగా వ్యవహరిస్తున్నాయో చూడు. అదే సందర్భంలో మన పౌరసత్వ సవరణ చట్టం (సిఏఏ) చూడు. వలసదారులకు మనదేశ పౌరసత్వం ఇవ్వడానికి మనం రూపొందించిన సమగ్రమైన నూతన చట్టం.

నువ్వు జీనియస్ బ్రో! మరి ప్రతిపక్షాలను, ప్రభుత్వ వ్యతిరేకులను తీవ్రంగా అణచివేస్తున్నారని అంటున్నారు కదా. దాని సంగతేమిటి? ఈ విషయాన్ని పక్కనబెడితే మనం రూపొందిస్తున్న ప్రజాస్వామ్య సూచీకి విశ్వసనీయత ఉంటుందంటావా?

ఎవరు చెప్పారు మనం పట్టించుకోమని? అన్నాడు నా ప్రశ్నకు చిరాకు పడుతున్నట్టు. స్పష్టమైన గణాంకాల ఆధారంగా మనం దీనిని తయారుచేస్తాం. మొత్తం జనాభాను ప్రాతిపదికగా తీసుకొని, నమోదవుతున్న తప్పుడు కేసులు మరియు అరెస్టులను లెక్కిస్తే అసమ్మతిపై మనం తీసుకుంటున్న చర్యలు నామమాత్రమే. ప్రతిపక్షాల నాయకులపై మనం చేయిస్తున్న పలురకాల దాడులు గానీ, అరెస్టులు గానీ లేదా విపక్షాలవారిని కొనివేయడం గానీ కేవలం 0.00000000000001 శాతం మాత్రమే. అమెరికా తీసుకో.... మాజీ అధ్యక్షుడనే కనీసపాటి గౌరవం కూడా చూపకుండా అధ్యక్ష ఎన్నికలకు ముందు అతిపెద్ద ప్రతిపక్ష నాయకుడు కూడా అయిన ట్రంప్‌ను విచారిస్తున్నారు. అయినప్పటికీ పశ్చిమ (యూరోపియన్) దేశాలు రూపొందించిన ప్రజాస్వామ్య సూచీలో అమెరికాను భారత్ కంటే ముందు స్థానంలో ఉంచారు.

దీనిని గురించి నేనెప్పుడూ ఇలా ఆలోచించలేకపోయాను సుమీ! ఇందులో నీ తప్పేమీ లేదు. నీ ఆలోచనలను అలా అదుపుచేసారు.

కానీ ఈ సూచీలు కూడా ప్రజాభిప్రాయాన్ని వెల్లడి చేస్తాయి కదా!

నిజమే అనుకో, కానీ వాళ్ళు సూచీని రూపొందించే విధానమే పూర్తిగా పక్షపాత ధోరణిలో ఉంటుంది. మనం మాత్రం ఆ తప్పు చేయం. మనం అవలంభించే విధానం నిష్పాక్షికంగా ఉంటుంది అని నేను ఖచ్చితంగా చెప్పగలను. ఎందుకంటే మనం జరిపించే సర్వేను చేపట్టే వారిని ముగ్గురు సభ్యుల కమిటీ ఎంపిక చేస్తుంది. దానిలో ప్రధానమంత్రి, ఒక కేబినెట్ మంత్రి మరియు ఎన్నికల రాజకీయాల పట్ల ఆసక్తి కలిగిన ఒక మాజీ రిటైర్డ్ హైకోర్టు న్యాయమూర్తి ఉంటారు.

బహుబాగుంది. మరి మనం తయారుచేసే సూచీ నమూనా (Sample) బాగా పెద్దదిగా ఉంటుందా? ఆసక్తిగా అడిగాను.

"యూరోపియన్ దేశాల్లో తమకు తామే స్వయంగా నియమించుకున్న ప్రతినిధులు రూపొందించిన సర్వే కంటే పెద్దదిగానే ఉంటుంది నిస్సందేహంగా. దాన్ని ఎలా జరుపుతామంటే.... యాదృచ్ఛికంగా జరిపినట్లు, పాక్షిక నియంత్రణతో, రెండు దొంతరలుగా, బహుళ ప్రయోజనకారిగా ఉండే నమూనాను ఐటి విభాగంలోని విస్తృతమైన డేటాబేస్ ఆధారంగా రూపొందిస్తాం".

భయ్యా, ఐటి సెల్ అంటే నాకొక సందేహం కలుగుతోంది. సాధారణంగా దానిలోని డేటాబేస్ ఏదో ఒక్క పార్టీనే సపోర్ట్ చేస్తుందేమో కదా!

దానికేం సంబంధం? అంటూ బ్రో ఒక నిమిషం స్పందన లేకుండా ఉండిపోయాడు. మరలా మాట్లాడుతూ "ఏ ప్రజాస్వామ్యానికైనా ఒక ప్రధానమైన విధి ఉంటుంది. ఆ దేశ ప్రజలందరూ పేరుమోసిన నేత పరిపాలనలో ఉండేలా చూడడం. గత పది సంవత్సరాలుగా భారత్‌కు ఆ ఘనత దక్కింది. అదేవిధంగా ఉత్తరకొరియా, చైనా, రష్యాలు కూడా" అన్నాడు.

"అయినాసరే...."

నోటిమీద వేలు పెట్టుకొని బ్రో నన్ను నిశ్శబ్దంగా ఉండమని సైగ చేసి, "ప్రజాస్వామ్యాలు నిరంతరం శ్వాసిస్తూ, జీవిస్తూ, పరిణామం చెందుతూ ఉండే సజీవుల వంటివి. భారతదేశం కూడా బహుళపార్టీ ప్రజాస్వామ్యం నుండి ఏక పార్టీ ప్రజాస్వామ్యం వైపుగా – పరిణామం చెందుతుంది. పశ్చిమ దేశాలకు ఏక పార్టీ లేదా ఏకైక నేతతో కూడిన ప్రజాస్వామ్యం అనే భావనే తెలియదు. అందుచేతనే వాళ్ళు "క్షీణిస్తున్న ప్రజాస్వామ్యం" వంటి అర్థం పర్థం లేని పదబంధాలు వాడుతున్నారు. విచారించాల్సినదేమంటే క్షీణిస్తున్న వారి మేధో విలువలకు చిహ్నం అది.

గొప్పగా చెప్పావు బ్రో! ఇంతకీ మనమే రూపొందించుకుంటున్న మన దేశ పెద్ద ర్యాంకింగులతో కూడిన ప్రజాస్వామ్య సూచీ ఎప్పుడు విడుదలవుతుంది?

తొందరలోనే, మన దేశపు చివరి ఎన్నికలు అయ్యేలోగా.

చివరి ఎన్నికలా?!

అబ్బెబ్బె, నా ఉద్దేశ్యం అది కాదు. చివరిదశ ఎన్నికలు అయ్యేలోగా!!!

– హిందూ పత్రిక సౌజన్యంతో ✺

కవిత

# నేను మాత్రం

– ఎ. మన్మథరావు

మీరెలాగైనా చూసుకోండి –
నేను మాత్రం
ముళ్ళదారుల ఎండమావుల్ని,
పూలమాలల ప్రగతి పథాలని
గుర్తించలేను....

మీరెలాగైనా మాట్లాడుకోండి –
నేను మాత్రం
అబద్ధాల అపశృతులని,
అమృత వాక్కులని
ఆస్వాదించలేను...

మీరెలాగైనా చెప్పుకోండి –
నేను మాత్రం
విరిగిపోతున్న వెన్నెముకని చూసి,
వికసిస్తున్న మహా వృక్షమని
పొరబడలేను....

మీరెలాగైనా అనుకోండి
నేను మాత్రం
విరగబడుతున్న విషపు చీకట్లని,
విరబూస్తున్న నిండు వెలుతురులని
ప్రచారం చేయలేను....

మీరెలాగైనా ఊహించుకోండి –
నేను మాత్రం
మట్టి గుండెల
కన్నీటి చుక్కల నుండి పుట్టిన
నిజంలా తప్ప
మరోలా ఉండలేను....

(ఉగాది శుభాకాంక్షలతో....)

సినిమా సమీక్ష

## భాజపా కోసం మరో ప్రాపగాండా చిత్రం

# ఆర్టికల్ 370 (2024)

- బాలాజీ (కోల్‌కతా)

**2019**వ సంవత్సరం. దేశం సార్వత్రిక ఎన్నికల కోసం ఎదురుచూస్తోంది. ఆ ఏడాది జనవరి నెలలో ఒకే రోజు రెండు సినిమాలు రిలీజయ్యాయి. ఒకటోది **'ది యాక్సిడెంటల్ ప్రైమ్ మినిస్టర్'** మన్మోహన్ సింగ్‌ను గాంధీ కుటుంబ వత్తిడిలో నలిగిన చేతకాని ప్రధానిగా చూపింది. రెండోది **'ఉరి: ది సర్జికల్ స్ట్రయిక్'** శత్రువు ఇంట్లోకి జొరబడి దెబ్బకు దెబ్బతీసే 'న్యూ ఇండియా' వీరుడిగా మోదీని ఆకాశానికెత్తింది. నెల తిరక్కుండా ఫిబ్రవరిలో పుల్వామా సంఘటన, వెనువెంటనే బాలాకోట్‌లో 'ఉరి'లో చూపిన మాదిరి మరో సర్జికల్ దాడి! (జరిగింది లేదా భారీ స్థాయిలో జరిగినట్టు ప్రచారం జరిగింది.) దాంతో దేశభక్తి కట్టలు తెంచుకుని అటు సినిమా హిట్టయితే, ఇటు మోదీ భారీ మెజారిటీతో మళ్ళీ ప్రధాని అయ్యాడు. 'ఉరి' ఉపకారానికి కృతజ్ఞతగా మధ్యంతర బడ్జెట్ సెషన్‌లో ఆర్థిక మంత్రి పీయూష్ గోయల్ ఈ సినిమాను ఘనంగా కీర్తించాడు. ఇది వీక్షకుల్లో దేశభక్తి ఉద్వేగాన్ని రేకెత్తించిందన్నాడు. ఓటర్లను కూడా ప్రేరేపించిందన్నది ఆయన మనసులోని మాట కావచ్చు. ఏలిక వారు 'ఉరి'ని జాతీయ అవార్డుతో సత్కరించారు.




2024లో మనం మరో లోక్‌సభ ఎన్నికల మధ్య ఉన్నాం. 'ఉరి' దర్శకుడు ఆదిత్యధర్ ఈసారి నిర్మాతగా మారి 'ఆర్టికల్ 370' అనే మరో సినిమా తీసుకొచ్చాడు. కశ్మీరులో 370వ అధికరణాన్ని రద్దు చేయడం మోదీగారి మరో మెరుపు దాడి అనీ, ఈ పనిని ఈసారి 'అహింసాయుతంగా' సాధించాడనీ చెప్పడం ఈ సినిమా ఉద్దేశం. 'ది కశ్మీర్ ఫైల్స్', 'ది కేరళా స్టోరీస్' లాంటి సినిమాలకు ప్రధాని మోదీ ప్రచారం చేయడం తెలిసిందే. జమ్మూ సభలో 'ఆర్టికల్ 370' సినిమాను రిలీజుకు ముందే మోదీ పొగిడాడు. ఐతే ఈ సినిమా కొంత వ్యాపార విజయం చవిచూసినా, ఈసారి ఎన్నికల్ని ప్రభావితం చేసేంత శక్తి లేదని తెలుస్తోంది.

'ఉరి'లో హీరోయిన్‌గా నటించిన యామీ గౌతమ్ (ప్రస్తుతం ఆదిత్య ధర్ భార్య కూడా) ఇందులో ఇంటిలిజెన్స్ అధికారిగా ప్రధాన పాత్రలో కనిపిస్తుంది. మళయాల నటి ప్రియామణి పీఎంఒ ఆఫీసులోని సెక్రటరీగా మరో ముఖ్యమైన భూమికను పోషించింది. ఓ రాష్ట్రపతి ఆదేశం, కొన్ని తీర్మానాలూ, జమ్మూ-కశ్మీర్ పునర్వ్యవస్థీకరణ బిల్లు ద్వారా 2019 ఆగష్టు 5వ తేదీన మోదీ ప్రభుత్వం 370వ అధికరణాన్ని రద్దు చేసింది. దానికి అనుబంధంగా ఉండే 35ఎ అధికరణాన్ని కూడా తొలగిస్తూ జమ్మూ-కశ్మీర్ స్వయం ప్రతిపత్తిని కాలరాసింది. మేధావులంతా ఈ చర్యను రాజ్యాంగంపై, ఫెడరలిజం, లౌకికవిధానంపై దాడిగా విమర్శిస్తుంటే ఈ సినిమా మాత్రం తప్పనిసరి పరిస్థితుల్లో చేపట్టిన ఓ సాహసిక చర్య అన్నట్టు కథను ఓ నాలుగేళ్ల మునుపటి నుండీ అల్లుకుంటూ వస్తుంది.

### కథ సారాంశం :

నిజ సంఘటనల నుండి ప్రేరణ పొందిన కల్పిత కథ అంటూ చాంతాడంత నిరాకరణ పత్రం తెరపై రెండు నిమిషాల పాటు చూపిన వెంటనే, అజయ్ దేవగన్ వాయిస్ ఓవర్‌లో అబద్ధాల దండకం మొదలౌతుంది. బీజేపీవారు చెప్తున్నదాని ప్రకారం భారతదేశ సమస్యలన్నింటికీ నెహ్రూ, కాంగ్రెస్ పార్టీలే కారణమవ్వాలి. ఆ స్పిరిట్‌తోనే కశ్మీర్ నేపథ్య చరిత్ర మొదలౌతుంది. దేశ విభజన తర్వాత కశ్మీరు రాజు హరిసింగ్ భారతదేశంలోనే కలవాలని కోరుకున్నాడట! కానీ కశ్మీర్‌ను భారత్‌లో విలీనం చేయడంలో జాప్యం నెహ్రూ వల్లే జరిగిందట! కశ్మీరు అధికారపగ్గాలు తన సన్నిహిత మిత్రుడు షేక్ అబ్దుల్లా చేతిలోనే ఉండాలన్నది నెహ్రూ అభిమతమట! ఈలోగా పాకిస్తాన్ సైనికులూ, ఆఫ్ఘన్ గిరిజన తెగలూ కశ్మీర్‌పైకి దండెత్తి వచ్చాయట! తత్ఫలితంగా, మహారాజా హరి సింగ్ గత్యంతరంలేక నెహ్రూ కోరిన షరతులమేరకు పత్రాలపై సంతకాలు చేశాడట! భారత సైన్యం పాకిస్తానీయులను పూర్తిగా వెనక్కి నెట్టేలోగానే భారత ప్రభుత్వం ఐక్యరాజ్య సమితి 'కాల్పుల విరమణ' ఒప్పందాన్ని అంగీకరించడంతో కశ్మీరులోని మూడొంతుల భూభాగం పాకిస్తాన్ చట్టరహిత కబ్జాలోకి వెళిపోయిందట! భారతదేశంలోని ఒకే ఒక ముస్లిం బహుళ రాష్ట్రం కావడంతో షేక్ అబ్దుల్లా కశ్మీర్ కోసం ఒక ప్రత్యేక ప్రతిపత్తిని ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరాడట! అలా 370వ అధికరణం మనుగడలో కొచ్చిందట! దాంతో ఒకే దేశంలో రెండు రాజ్యాంగాలూ, ఇద్దరు

ప్రధానులూ, రెండు జెండాలతో దేశంలోనే మరో దేశం తయారయిందట! దీన్ని ఆసరా చేసుకుని 1990లలో వేర్పాటువాదులూ, తీవ్రవాదులూ, కొందరు రాజకీయ నాయకులూ భారతదేశాన్ని ముక్కలు చేయడానికి ఎన్నో ఎత్తుగడలు వేశారట! కశ్మీరీ పండితులపై దాడిచేసి లోయ నుండి వెళ్లగొట్టారట! 2015లో సోషల్ మీడియా పుణ్యమా అని బుర్హాన్ వనీ అనే కొత్త ముజాహిదీన్ హీరో ముందుకొచ్చి యువకులను తీవ్రవాదంవైపు ఆకర్షించాడట! ఈ సమస్యలన్నింటితో సతమతమౌతున్న ప్రస్తుత పాలకులు ఇక లాభం లేదనీ, 70 యేళ్ల నాటి ఒక చారిత్రక తప్పిదాన్ని సరిదిద్దే సమయం ఆసన్నమైందనీ భావించారని చెప్పడంతో తెరపై సినిమా టైటిల్ కార్డు పడుతుంది.

కట్ చేస్తే, బుర్హాన్ వనీని అంతమొందించే మిషన్‌లో ఉంటుంది కశ్మీరీ పండిట్ అయిన జూనీ హక్సర్ (యామీ గౌతమ్) అనే ఇంటెలిజెన్స్ ఆఫీసర్. ఈ సినిమా కల్పిత కథ అని చెప్పినప్పటికీ బుర్హాన్ వనీనీ (ఉపోద్ఘాతంలో చెప్పిన చారిత్రక వ్యక్తుల్నీ) అసలు పేరుతోనే గుర్తించారు. హోమ్ మినిస్టర్, ప్రధానితో సహా మిగతా అందరికీ వేరే పేర్లు పెట్టారు. కానీ వారి వేష భాషల్ని బట్టి మనం అమిత్‌షా, మోదీ, జగ్‌మోహన్, మెహబూబా ముఫ్తీ, ఫారూక్ అబ్దుల్లా వంటి వ్యక్తులని ఇట్టే కనిపెట్టేయవచ్చు. దర్శకుడు ఎవర్ని హీరోలుగా చూపదలుచుకున్నాడో ఆ రకంగానే కథ రాసుకున్నాడు. 'ఉరి' మాదిరిగానే ఈ సినిమా కూడా చాప్టర్లవారిగా నడుస్తుంది.

బుర్హాన్ వనీని వెతకడానికి త్రాల్ ప్రాంతంలోని ఓ ఇంటిపై రాత్రిపూట దాడి చేస్తారు జూనీ బృందం. పారిపోతున్న బుర్హాన్‌ను కాల్చిచంపుతారు. ఈ ఆపరేషన్ జరిపినందుకు ప్రశంసలు దొరుకుతాయనుకుంటే తనను సంప్రదించనందుకు పై అధికారి ఆమెపై మండిపడతాడు. బుర్హాన్ అంత్యక్రియల్లో వేలాదిమంది పాల్గొనడం, 'ఒక బుర్హాన్ చస్తే వేలాది బుర్హానీలు పుడతార'ని యువకులను రెచ్చగొట్టే రాజకీయ నాయకుల్ని తెరపై చూపిస్తాడు దర్శకుడు. కశ్మీర్ యువకులంతా సెక్యూరిటీ బలగాలపై రాళ్లు రువ్వేవారుగానో, తీవ్రవాదులుగా మారడానికి సిద్ధంగా వున్నవారిగానో సినిమా పొడుగునా చూపించారు.

కశ్మీరును అస్థిరపరిచిందన్న నెపంతో జూనీని ఢిల్లీకి బదిలీ చేస్తాడు ఆమె పై అధికారి. ఇలా సినిమా ప్రథమార్థంలో కథానాయకురాలిని బాధితురాలిగా చిత్రీకరించారు. జూనీని ఆమె చిన్ననాటి విషాదమొకటి వెంటాడుతూ వుంటుంది. ఆమె తండ్రి ఒక బ్యాంకు స్కామును వెలుగులోకి తెచ్చినందుకు అతడ్ని అప్పటి సీఎం హత్య చేయించి, దాన్ని ఆత్మహత్యగా చెలామణి చేయిస్తాడు. 370వ అధికరణమే కశ్మీరు నేతల అవినీతికీ, ఆగడాలకూ కారణమని ఆమె నమ్మకం. "ఉగ్రవాదం ఓ వ్యాపారంగా మారింది. ఆజాదీ అన్నది ఒట్టి నాటకం మాత్రమే. కశ్మీరును బాగుచేయడం ఎవరి తరమూ కాదు" అన్న నిర్ణయానికి వచ్చేసిందామె.

సరిగ్గా అప్పుడే ఆమెను సంప్రదిస్తుంది రాజేశ్వరీ స్వామినాథన్ (ప్రియమణి) అనే ప్రధానమంత్రి కార్యాలయ కార్యదర్శి. "కశ్మీరును బాగుచేసే నాయకులే కాదు దేవుళ్ళున్నారమ్మా. (మోషాలన్నమాట!) వారు 370వ అధికరణాన్ని ధ్వంసించే ప్రయత్నంలోనే ఉన్నారమ్మా. (370వ అధికరణం రద్దు ఆర్ఎస్ఎస్ చిరకాల వాంఛ అని మనకు తెలుసు.) అధికరణం రద్దు చేసేటప్పుడూ, ఆ తర్వాతా కశ్మీరులో 'ఒక్క రక్తపు బొట్టు కూడా కిందపడకుండా' (మనకు షేక్స్‌పియర్ 'మర్చెంట్ ఆఫ్ వెన్నీస్' గుర్తొస్తుంది) జాగ్రత్త చర్యలు తీసుకోడానికి కశ్మీరు గురించి క్షుణ్ణంగా తెలిసిన నిన్ను ఎన్ఐఏ అధికారి హోదాలో కశ్మీరుకు పంపిస్తున్నాను. మూడో కంటికి తెలీకుండా ఏర్పాట్లు జరగాలి' అని చెబుతుంది. అక్కడ్నుంచీ యామీ హిందీ విజయశాంతిలా విజృంభిస్తుంది. 'The end justifies the means' అన్న స్కీములో భాగంలో కశ్మీరులో జరిగిన సెక్యూరిటీ బలగాల ఆగడాలూ, అన్యాయాలూ, ఒక అమాయక గ్రామస్తుడిని జీపుకు కట్టేసి మానవ కవచంగా వాడడాలూ, ఇద్దరు పూర్వ ముఖ్యమంత్రుల్నీ, ఒక సిటింగ్ ఎంపీనీ గృహబందీలుగా చేయడాలూ, సంవత్సరాల తరబడి ఫోన్ లైన్లూ, ఇంటర్నెట్ సంబంధాలూ నిలిపివేయడాల వంటి అతిచర్యలన్నింటి వెనుకా ఒక పవిత్రమైన ఉద్దేశం ఉన్నట్టు సినిమాను నెరేట్ చేశారు. 370వ అధికరణం రద్దును అసాధ్యం చేయడానికి మాజీ జమ్మూ కాశ్మీర్ రాష్ట్ర అసెంబ్లీలు వేసిన రహస్య ఎత్తుగడలను చట్టపరంగా ఛేదించడం ఈ థ్రిల్లర్లో భాగంగా సాగుతుంది.

పుల్వామా ఘటనను గ్రాఫిక్స్‌తో రీక్రియేట్ చేసి, మరణించిన సైనికులను ప్రధాని సన్మానించడాన్ని అతడి ప్రతిష్టను ఎలివేట్ చేసే విధంగా చాలా ప్రత్యేకంగా చూపించారు. (300 కేజీల ఆర్డీఎక్స్ ఎలా వచ్చిందనీ, సత్యపాల్ మల్లిక్ ఏం చెప్పాడనీ ఈ సినిమాలు పిచ్చి ప్రశ్నలు వేయవని తెలిసిందే.) 'ఏక్ దేశ్ మే దో విధాన్, దో నిషాన్, దో ప్రధాన్, నహీ చల్ సక్తే' (ఒకే దేశంలో రెండు రాజ్యాంగాలూ, రెండు జెండాలూ, ఇద్దరు దేశాధినేతలూ ఉండే వీల్లేదు) అని ఆంతరంగిక సమావేశంలో ప్రధాని ముక్కుసూటిగా చెప్పేస్తాడు. (ఒకప్పటి టీవీ రాముడు అరున్ గోవిల్ ఇందులో మోదీ పాత్రను పోషించాడు. ప్రస్తుతం ఆయన రాముడి ఫొటో పట్టుకుని ఓట్లు అడుక్కుంటున్న ఎంపీ అభ్యర్థి.) పీఎం అర్థరాత్రి పూట రాష్ట్రపతి నుండి సంతకం సేకరిస్తాడు. ఆగస్టు 5న అమిత్ షాలా కనిపించే హోం మినిస్టర్ పార్లమెంటులో బిల్లును ప్రవేశపెట్టి నెగ్గించుకోవడానికి ప్రయత్నిస్తుంటే, అటు కశ్మీర్‌లో తీవ్రవాదుల ఎత్తులను చిత్తుచేస్తుంటుంది జూనీ.

370వ ఆర్టికల్‌ను రద్దు చేసినప్పుడు ఒక్క అమాయకుడు కూడా ప్రాణం కోల్పోలేదని తెరపై రాత కనిపిస్తుంది. (వాస్తవంలో 87 మంది పౌరులూ, 99 మంది భద్రతా సిబ్బందీ మరణించినట్లు ప్రభుత్వ గణాంకాలే చెబుతున్నాయి.) ఇక ఎండ్ క్రెడిట్స్‌కి ముందొచ్చే సన్నివేశం ఖచ్చితంగా లోక్‌సభ ఎన్నికల కోసమే! ప్రధాని చేతిలోని వార్తాపత్రికలో ఓ శీర్షిక కనిపిస్తుంది. "ప్రధానమంత్రి తన 30 ఏళ్ల వాగ్దానాన్ని నెరవేర్చారు : ఆర్టికల్ 370 అంతు తేలింది. అతడి తదుపరి ప్లాన్ ఏమిటో?" అని రాసివుందందులో. తననెలానూ ప్రజలు నెగ్గిస్తారన్న ధీమాతో నిదానంగా కారు కిటికీ బయటకు చూస్తాడు ప్రధాని.

## సినిమా చూపినదేమిటి? వాస్తవాలేమిటి?

## భారత్‌లో కశ్మీర్ విలీనంలో జాప్యం

కశ్మీరు మహారాజా హరిసింగ్ రైతాంగాన్ని దోపిడీచేసే కిరాతక ఫ్యూడల్ పాలకుడు. రాష్ట్ర ఆదాయంలో మూడో వంతు తన సొంత

ఖర్చుల కోసమే ఉపయోగించేవాడు. ఆయనకు వ్యతిరేకంగా పీడితులు షేక్ అబ్దుల్లా నేషనల్ కాన్ఫరెన్స్ నేతృత్వంలో ఎన్నో యేళ్ళుగా పోరాడుతూనే వున్నారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత హరిసింగ్ ఏ దేశంలోనూ చేరకుండా స్వతంత్రంగానే ఉండాలనుకున్నాడు. ముస్లిం ప్రజల మెజారిటీ కనుక కశ్మీరు తనకేననుకుంది పాకిస్తాన్. కానీ పాకిస్తాన్ మతరాజ్యంగానే కాక, ఫ్యూడల్ రాజ్యంగా వుంటుందని షేక్ అబ్దుల్లాకు తెలుసు. అందుకని ఆయన పాకిస్తాన్‌తో కలవకూడదనుకున్నాడు. అవసరమైతే భారతదేశం వంటి సెక్యులర్ ప్రజాస్వామ్యదేశాన్ని ఇష్టపడ్డాడు షేక్ అబ్దుల్లా. బ్రిటీష్ మద్దతుతో పాకిస్తాన్ సైనికులూ, ఆఫ్ఘన్ గిరిజన తెగలూ దాడికి వచ్చినపుడు నేషనల్ కాన్ఫరెన్స్ నాయకత్వంలోని ప్రజా సైన్యాలే వారితో పోరాడాయి. దురాక్రమణదారులు శ్రీనగర్ వరకూ వచ్చేసరికి డోగ్రా రాజు తన బంధుగణంతో సహా జమ్మూకు పారిపోయాడు. ఆ తర్వాతే భారత్‌తో విలీనానికి ఒప్పుకున్నాడు. (అసలు పిరికితనంతో పారిపోయిన వాడికి విలీన నిర్ణయం చేసే హక్కేలేదు.) షేక్ అబ్దుల్లాకూ, నెహ్రూకూ సారూప్యత ఏమిటంటే వారిద్దరూ లౌకికవాదాన్నీ, సామ్యవాదాన్నీ ఇష్టపడతారు. కాబట్టి విలీనంలో జాప్యానికి కారణం హిందూత్వ శక్తులు ఇష్టపడే కశ్మీరు మహారాజే కానీ సినిమా ఉపోద్ఘాతంలో చెప్పినట్టు నెహ్రూ కాదు.

## పాక్‌తో యుద్ధాన్ని నిలిపివేయడం

ప్రస్తుత హిందూత్వ పాలకులు ఇష్టపడే సర్దార్ వల్లభాయ్ పటేల్ రాజగోపాలాచారి అయ్యంగార్‌కి 1948 జూన్ 4వ తేదీన రాసిన వుత్తరంలో 'భారత సైన్యం వద్ద యుద్ధం కొనసాగించడానికి తగిన సదుపాయాలు లేనందున యుద్ధం ఆపడం అనివార్యమైంద'ని రాశాడు. పాకిస్తాన్‌కు బ్రిటన్, అమెరికాల మద్దతువుంది. ఐక్యరాజ్య సమితి వద్దకు ఈ విషయాన్ని తీసుకుపోయినది మౌంట్ బాటన్ మాత్రమే. ఆయనను పటేల్ సమర్థించాడు. అప్పటికింకా మన సైన్యంలో బ్రిటీష్ వారి పాత్ర వుండేది. బ్రిటీష్ వత్తిడి వల్లనే భారతసైన్యం 'ఉరి' సరిహద్దు వద్ద ఆగిపోయింది. ఇక్కడ పటేల్‌కు సంబంధించిన మరో ఆసక్తికర విషయాన్ని కూడా తెలుసుకోవాలి. 'హైదరాబాదును తమకు వదిలేస్తే, కశ్మీరు సంస్థానాన్ని పాకిస్తాన్ తీసుకున్నా పర్వాలేద'ని పటేల్ అన్నట్టు రాజ్‌మోహన్ గాంధీ తన పుస్తకంలో రాశాడు. కశ్మీర్ ప్రజలు రెండు జాతుల సిద్ధాంతాన్ని త్రిప్పికొడతారని గాంధీజీకి గొప్ప నమ్మకం. ఆ నమ్మకం నిజమైంది. షేక్ అబ్దుల్లాతో నెహ్రూకున్న స్నేహం కూడా భారత్‌లో కశ్మీరు విలీనానికి కారణమైంది.

## స్వయం ప్రతిపత్తి గురించి

భారత్ తమ సంస్కృతినీ, జీవన విధానాన్నీ, స్వయం ప్రతిపత్తినీ, మొత్తంగా 'కశ్మీరియత్'నూ రక్షిస్తుందని కశ్మీరీ ప్రజలు భావించారు. ఆ విధంగానే స్వయం ప్రతిపత్తి ఒప్పందం జరిగింది. స్వయం ప్రతిపత్తిని పటేల్ వ్యతిరేకించాడని బీజేపీ చెప్పే మాటలు కూడా అబద్ధాలే. 1949 మే 5, 6 తేదీల్లో ఈ విషయంపై జరిగిన సమావేశం పటేల్‌గారి ఇంట్లోనే జరిగింది. అందులో నెహ్రూ, షేక్ అబ్దుల్లాలు పాల్గొన్నారు. నెహ్రూ మంత్రి వర్గంలో శ్యామా ప్రసాద్ ముఖర్జీ కూడా వున్నాడు. రాజేంద్ర ప్రసాద్ అధ్యక్షతన 370వ అధికరణాన్ని ఆమోదించినపుడూ నాయకులంతా ఏకగ్రీవంగా అంగీకరించారు. భారతదేశ ధనికులు కశ్మీరు లోయలో భూములు కొనేస్తారన్న భయం మహారాజా కాలం నుండే వుంది. అందుకే 'హెరిడిటరీ స్టేట్ సబ్జెక్ట్ ఆర్డర్'ను 1927లోనే ఆమోదించారు. దానికి ప్రతిరూపమే 35ఎ అధికరణం. 370వ అధికరణం కశ్మీరుకే ప్రత్యేకం కావచ్చు. కానీ కొన్ని ఇతర రాష్ట్రాలకు కూడా 371వ అధికరణంలోని అనేక నిబంధనల ప్రకారం ప్రత్యేక హోదాలున్నాయి. ఇక ఆదివాసీ, గిరిజన ప్రాంతాల భూరక్షణ కోసం 5, 6 వంటి వేర్వేరు షెడ్యూళ్ళున్నాయి.

## మేజర్ గొగోయ్ నిర్వాకం

ఫరూక్ దర్ అనే కశ్మీరీ గ్రామస్తుడ్ని ఆర్మీ మేజర్ గొగోయ్ తన జీపుకు కట్టేసి తిప్పాడు. ఐదు గంటల పాటు 17 గ్రామాల్లో మొత్తం 30 కిలోమీటర్ల దూరం ఆ స్థితిలోనే తిప్పాడు. రాళ్ళు రువ్వే జనాల నుండి రక్షణ కోసం ఇలా చేశానని అతడన్నాడు కానీ, అది సరికాదని ఒక ఎంక్వయిరీలో తేలింది. అదే ఆర్మీ అధికారి ఒక 18 ఏళ్ళ అమ్మాయితో శ్రీనగర్‌లోని ఒక హోటల్లో దొరికిపోగా అతడిపై కోర్ట్ మార్షల్ కూడా జరిగింది. కానీ ఈ సినిమాలో ఇటువంటి ఒక సంఘటనను గ్లోరిఫై చేసి చూపించారు. అబ్దాలీ అనే ఐఎస్ఐ డబుల్ ఏజెంటును రాళ్ళు రువ్వే జనాల నుండి రక్షణ కోసం జీపుకు కట్టి తీసుకెళ్ళినట్టు చూపించారు.

## సెక్యూరిటీ బలగాలకు విశేషాధికారాలు

అబ్దాలీని జీపుకు కట్టేసిన తన సహచరుడ్ని మెచ్చుకుంటుంది జూనీ. ఒకప్పుడు బుర్హాన్ శవాన్ని అప్పగించడమే తను చేసిన తప్పనీ, ఇకపై శవాన్ని కూడా కనిపించనీకుండా చేస్తాననీ రాజేశ్వరితో చెబుతుంది జూనీ. అలానే కానివ్వమని ఆమోదముద్ర వేస్తుంది రాజేశ్వరి. ఈ విధంగా మిలటరీకీ, సెక్యూరిటీ ఏజెన్సీకీ ఏమైనా చేసే అధికార ముంటుందనీ, ఇదంతా దేశ భద్రత కోసమేననీ కితాబిస్తుందీ సినిమా. ముందునుండే 'Armed Forces Special Powers Act' (AFSPA) కశ్మీరులో అమల్లో వుంది. చిన్నపిల్లలు కూడా పెల్లెట్ గుళ్ళ కారణంగా అంధులైన ఉదంతాలు ఎన్నో వున్నాయి. ఇవేవీ ఈ సినిమా కథలో కనిపించవు. సెక్యూరిటీ బలగాల చర్యలన్నీ మహోన్నత ఆశయాల కోసం జరిగినవే అని చెబితే మనం నమ్మాలి. ఈ సినిమాలో కథానాయకురాలు స్త్రీ అయినా పురుషాధిక్య ప్రపంచపు ప్రతినిధిలానే వ్యవహరిస్తుంది.

## ఇది కల్పిత కథే

2023 లెక్కల ప్రకారం ప్రెస్ ఫ్రీడమ్ ఇండెక్సులో మొత్తం 180 దేశాల్లో 161 వ స్థానంలో ఉంది మనదేశం. వాస్తవం ఇలా వుండగా బ్రిందా ఘోష్ అనే టీవీ జర్నలిస్టు ప్రధానమంత్రి కార్యాలయానికి వచ్చి దేశం తీసుకుంటున్న గోప్యమైన నిర్ణయాల గురించి గుచ్చి గుచ్చి అడిగినట్టు చూపించారు. మన దేశంలో జర్నలిస్టులు ఇందులో కొంతలో కొంతైనా ధైర్యం చూపగలిగే స్థితిలో వుంటే దేశానికీ గతి పట్టేది కాదు. అలానే ప్రతిపక్ష నాయకుడు రాజ్యసభలో హోం మినిష్టర్ను తన ప్రశ్నలతో ముప్పతిప్పలు పెట్టేస్తున్నట్టూ, సభను నడవనీకుండా

కుట్ర పన్నుతున్నట్టూ చూపారు. క్రాస్ ఓటింగ్ చేసిన వారంతా దేశం కోసమే ఈ పని చేశారన్నట్టు చూపించారు. వాస్తవంలో చూస్తే మొత్తం ప్రతిపక్ష ఎంపీలను సస్పెండ్ చేసిన ఉదంతాలు మన కళ్ళముందున్నాయి. కశ్మీరు పాత్రల ఉర్దూ వింటే లక్నో వాళ్ళు మాట్లాడుతున్నట్టు వుంటుంది. 'కొందరి నేరానికి గ్రామస్తులందర్నీ శిక్షించకండి' అని ఆర్మీ అధికారిని అభ్యర్థిస్తాడు ఓ వృద్ధుడు. 'అబ్బే .. మేమలా ఏనాడూ చేయం' అని జూనీ సహచరుడైన ఆ అధికారి బదులిస్తాడు. రవిందర్ సింగ్ అనే డీఎస్పీ తీవ్రవాదులను తన కారులో తీసుకుపోతూ జమ్మూ-కాశ్మీర్ పోలీసులకు చిక్కాడు. ఆ కేసును ఆఘమేఘాల మీద ఎన్ఐఏకి మార్చారు. ఆ తర్వాత ఆ సంగతేమైందో ఎవరికీ తెలీదు. ఇటువంటి ఇబ్బందికర సంగతులేవీ ఈ సినిమా లేవనెత్తదు. కాబట్టి ఏ రకంగా చూసినా ఖచ్చితంగా ఇది కల్పిత కథే.

## 370 రద్దు తర్వాత నాలుగేళ్ళ చరిత్ర

ధరల పెరుగుదల లాభాలను వీక్షకులకు తన ప్రైమ్ టైం షోలో వివరించే సుధీర్ చౌదరీలా, 370వ అధికరణం రద్దు తర్వాత కశ్మీరు స్వర్గతుల్యమైందన్నట్టు తెరపై వార్తా శీర్షికలు చూపాడు దర్శకుడు. కానీ వాస్తవాలు చాలా భయంకరంగా వున్నాయి. కశ్మీరు విభజనను మొదట్లో స్వాగతించిన లదాక్ నాయకుడు సోనమ్ వాంగ్చుక్‌కు కనువిప్పు కలగడంలో అట్టే సమయం పట్టలేదు. లదాక్ ప్రాంతానికి రాష్ట్ర హోదా కల్పించాలని ఆయన ఇటీవల చాలా రోజుల పాటు నిరాహార దీక్ష చేశాడు. కశ్మీరులో కనుగొన్న లిథియం నిల్వలపై మోదీ మిత్రుడి కన్ను పడింది. కశ్మీరులో ఆస్తులు కొని టూరిజం ద్వారా లాభపడాలని ఎంతో మంది ఇతర ప్రాంతాల ధనికుల ఆశ. జమ్మూ కశ్మీర్‌ను ముక్కలు చేసిన తర్వాత నెలకొన్న వేదనాభరిత స్థితిని పాత్రికేయురాలు అనురాధా బాసిన్ తన 'A Dismantled State: The Untold Story of Kashmir After Article 370' అనే పుస్తకంలో వివరిస్తుంది. జనాల పెదాలు కుట్టేయగా ఏర్పడిన ఒక నిస్తబ్దతను 'సరికొత్త సాధారణ స్థితి' అని అభివర్ణిస్తుందామె. ఒకప్పుడు తోలుబొమ్మ ప్రభుత్వాలైనా వుండేవి. వాటికి పరిమిత హక్కులైనా వుండేవి. 2019 నిర్ణయం తర్వాత ఆ హక్కులు కూడా అంతమయ్యాయని ఆమె అంటుంది. మిలిటెన్సీ పెరిగింది. ప్రభుత్వానికి అనుకూలంగా లేని జర్నలిస్టులపై దాడులు పెరిగాయి. గత నాలుగేళ్లుగా నిఘాల మధ్యా, సెక్యూరిటీ ఏజెన్సీల మధ్యా గడుపుతున్నామని స్వయంగా మాజీ ముఖ్యమంత్రి మెహబూబా ముఫ్తీ అల్ జజీరాకు చెబుతోంది. కశ్మీరులో జనాభా లెక్కల్ని మార్చే ఉద్దేశంతో ఏడాది తిరక్కుండానే 2020లో కొత్త స్థిరనివాస చట్టం తీసుకొచ్చారు. టూరిజం సంగతి మినహాయిస్తే కశ్మీరీలను ఆర్థికంగా దెబ్బతీసేందుకు పండ్ల వ్యాపారాలనూ, ఇతర పరిశ్రమలనూ నాశనం చేస్తున్నారు. కశ్మీరులో ఇజ్రాయెల్ పాలసీలను పాలకులు అమలు చేస్తుంటే ఈ సినిమా 'పాలస్తీనా ఇంతిఫాదా' అంటూ అకారణ పిచ్చి గొణుగుడు గొణిగింది.

'హిందీ సినిమా పాలకులను మెప్పించే ప్రయత్నాలు ఎల్లకాలమూ చేస్తూనే వచ్చింది. కానీ ఇప్పటి దర్శకులు ప్రభుత్వ ప్రాపగాండాను నెత్తిన పెట్టుకు ఊరేగుతున్నారు' అని తీవ్రంగా విమర్శిస్తున్నాడు యోగేశ్ పవార్ అనే సినీ జర్నలిస్టు. ప్రత్యేకించి ఈ సినిమా '370వ అధికరణం రద్దు తర్వాత కశ్మీరీలూ, భారతీయులూ ఆనందంగా వున్నారని చెప్పడానికి ప్రయత్నించింది. 'కశ్మీరీలు ప్రతిఘటించడం లేదన్నది నిజమే అయినా సెక్యూరిటీ బలాగాలు తమను అణిచివేస్తాయన్న భయంతోనే వారు నోరు విప్పడం లేదు' అని చెబుతున్నాడు మరో కశ్మీరు పాత్రికేయుడు. ✺

కవిత

# మేడే యశస్సు - ఉద్యమ ఉషస్సు

-వై. నేతాంజనేయ ప్రసాద్

న్యాయంకై నినదించగ
చిగురించిన కార్మిక జనచైతన్యం
చికాగో నగరంలో వినిపించిన
తొలికేక - పోరాటపు పొలికేక
నిరంకుశ యజమానులు
దాహార్తి ద్రోహచింతనతో
సాగించిన హింసారతిలో
అమరులు చిందించిన రక్తంతో
ఎరుపెక్కగ - రగిలిన గుండెలు ప్రభవించిన
సమరనినాదం - "మేడే వర్ధిల్లాలి"
ఉద్వేగం - ఉత్తేజం - ఉత్సాహాన్నిచ్చే
ఒక స్ఫూర్తిదాయక సందేశం
"సకల దేశ శ్రామికులారా ఏకంకండి"
అనే పిలుపు శ్రామిక జనావళికి మేల్కొలుపు -
అమరుల త్యాగాలతో సస్యశ్యామలమై
పోరుఫలాలు నిండిన ఉద్యమాల సీమ
నేడు - బహుళజాతి కలుపు మొక్కలతో నిండి
విషసాంస్కృతిక తెగుళ్ళు సోకి
విధ్వంసక - విద్వేషపు - విచ్ఛిన్నపు
విషరసాలయనాలతో తడిసి
కాలుష్యకాసారమయింది -
దయ్యాలు వేదాలు వల్లించినట్లు
యజమానులే 'మేడే' సందేశాలిస్తూ
సమర దీప్తినిచ్చే దీక్షా దినంను
జాతరలు - కొలుపుల పండుగల్లా దిగజార్చి
మాయజేసి మైమరపిస్తుంటే
పాలకుల మార్మిక విధానాలతో
కార్మిక చట్టాలు కనుమరుగవుతూ
కాంట్రాక్ట్ - ఔట్‌సోర్సింగ్ విధానాలూ
అపరిమిత పనిగంటలూ -
అభద్రతాపరిస్థితులూ
ఆయాచిత వరాలై వస్తున్నాయి -
పిల్లికూతలు పులిగాండ్రింపులుగావు
కొక్కెర అరపులు కోకిలగానం కాదు
ఉడుత పూపులకు పెను 'ఉప్పెన'లాగవు
కార్మికవర్గం యథార్థమెరిగి
వ్యథాసాగర మథనం చేసి
విద్వత్తునెరిగి - విద్యుత్తయ్యి మెరిసి
విముక్తి మార్గపు శక్తిని పొంది
కదం తొక్కుతు కదనానికి కదిలితే
మేడే యశస్సు ఉద్యమ ఉషస్సయి
నింగికెగసి నిలిచి వెలుగును
అవనినంతా ఆవరించిన
మంచు మబ్బులు కరిగిపోవును. ✺




**దాసరి శివకుమారి బాలసాహిత్య రచనలు కొన్ని :** దాసరి శివకుమారి హిందీ ఉపాధ్యాయినిగా రిటైరయ్యారు. వీరు ఇప్పటివరకు వందకు పైగా కథలు, 90 బాలల కథలు, 33 హిందీ అనువాద కథలు, 5 నవలలు మొదలగునవి రాసారు. వీటిలో బాలల మనస్తత్వ చిత్రణతో రాసిన 'ఆదివారం సందడి', 'అక్బర్–బీర్బల్ కథలు', 'బాలల సంపూర్ణ రామాయణం', 'కిచకిచ', 'బాలల భాగవతం', 'ఆటవిడుపు' మొదలైనవి గతంలో విడుదలయ్యాయి. ఇప్పుడు అరిగెపూడి రమేశ్‌చౌదరి హిందీలో రాసిన వాటిని 'బాలల వినోద కథలు'గా; శివకుమారి రాసిన 'చిలుక జోస్యం' కథలను బ్రెడ్ సంస్థ 2023లో విడుదల చేసింది. ఈ రెండూ అమ్మకానికి కాదు – పాఠశాలలకు బ్రెడ్ సంస్థ ఉచితంగా ఇస్తుంది. వారి email : breadsociety@gmail.com 'చిలుక జోస్యం'లో ఐదు, 'బాలల వినోద కథలు'లో ఆరు కథలూ వున్నాయి.

'పొత్తిళ్ళ సందడి'లో శివకుమారి తన మనమడు పుట్టిన నెల నుండి, పన్నెండవ నెల వరకు అంటే మొదటి పుట్టినరోజు వరకు 12 కథనాలుగా అందించారు. 1/8 డెమ్మీలో 60 పుటల ఈ పుస్తకం అమూల్యం. ప్రచురణ : రత్న లలిత ప్రచురణలు. ఫోన్ : 99089 62305.

**సాహిత్య సంగమం :** రచన – నిఖిలేశ్వర్

దిగంబర కవిగా, విప్లవ కవిగా ప్రసిద్ధి చెందిన నిఖిలేశ్వర్ తన ఆరు దశాబ్దాల సాహితీ యాత్రలో పరిచయమైన మిత్రులు, పెద్దల గురించిన 35 జ్ఞాపకాలను ఈ గ్రంథంలో పొందుపరిచారు. శీలావీ, త్రిపుర, చలసాని ప్రసాద్, సి.వి. శేషాద్రి, బాలగోపాల్, కె.వి.ఆర్, కంఠంనేని రవీంద్రరావు, యం.వి. రమణారెడ్డి, భద్రిరాజు కృష్ణమూర్తి మొదలైనవారు మరణించిన సందర్భంగా రాసిన నివాళులతోపాటు దిగంబర, విప్లవ కవితా ఉద్యమాలలో సహచరులైనవారితో సంబంధాల గురించి మొత్తం 35 చిరువ్యాసాలు దీనిలో వున్నాయి.

ఉరికంబం నీడలోంచి ఒక బహుజన ఆత్మకథ అనే వ్యాసంలో రజక కుటుంబం నుంచి ఎదిగిన రచయిత, జర్నలిస్టు కె. రాజన్న గురించీ, ఆయన రాసిన హిందీ నవల 'ఫాన్సీ' గురించి ఈ వ్యాసం ద్వారానే తెలిసింది. అలాగే కామ్రేడ్ మోహనరెడ్డి గురించి కూడా.

1/8 సైజులో 120 పుటలు. వెల : రూ. 100/– ప్రథమముద్రణ : ఆగస్టు 2023. ప్రచురణ : ఎమెస్కో బుక్స్ ప్రై లి. email : emescobooks @gmail.com విజయవాడ. ఫోన్ : 0866–2436643

**దేశ స్వావలంబనకు కీలకం రైతు వ్యవసాయం :** రచన – ప్రొ॥ ఎన్. వేణుగోపాలరావు

రైతు రక్షణ వేదిక, గుంటూరువారు అక్టోబరు 2023లో దీనిని ప్రచురించారు. ఆచార్య ఎన్.జి.రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయంలో వ్యవసాయ శాస్త్రవేత్తగా పనిచేసిన వేణుగోపాలరావు 10 అధ్యాయాలుగా దీనిని రచించారు. మనది వ్యవసాయ ప్రధాన దేశమైనా, గత వందేళ్ళ నుంచీ ఇంకా అంతకు ముందు నుంచీ రైతుల బాధలు కొనసాగుతూనే వున్నాయి. నల్లదొరల పాలనలోనూ వారికి విముక్తి లభించలేదు. రైతులను మోసం చేసే చట్టాలను రైతులందరూ ఎదుర్కొని వాటిని రద్దు చేయించుకున్నారు.

రైతుకు రక్షణ కల్పించలేని ప్రభుత్వాలు మాకొద్దు అంటున్నారు ప్రజలు. ఈ పరిస్థితిలో 'ఎవరు అసలైన రైతులు?', 'అప్పుల ఊబిలో రైతులు', 'వ్యవసాయ విధానాల వైఫల్యం', 'ఆహార భద్రతకు కీలకం కుటుంబ వ్యవసాయం', 'వ్యవసాయ సంక్షోభ అదుపుకు ఆచరణీయమైన అంశాలు', 'ఆంధ్రప్రదేశ్ సమగ్రాభివృద్ధి – వ్యవసాయరంగం' అనే అధ్యాయాలతో ఈ పుస్తకాన్ని రచించారు.

1/8 డెమ్మీలో 92 పుటల ఈ పుస్తకం వెల : రూ. 100/– ప్రథమముద్రణ : అక్టోబరు 2023. ప్రతులకు : రైతురక్షణ వేదిక 5–90–33, 7/1 చంద్రమౌళీనగర్, గుంటూరు – 522007. సెల్ : 94900 98905.

**వనపర్తి ఒడిలో :** చిన్నప్పటి జ్ఞాపకాలు. రచన – రాఘవశర్మ.

తన నాల్గవ ఏట నుండి ఇంటర్మీడియట్ ఫైనల్ పరీక్షలు రాసేవరకూ వనపర్తి ఒడిలో సేద తీరిన రచయిత, జర్నలిస్టు ఆలూరు రాఘవశర్మ, వారి నాన్నగారు బదిలీతో వనపర్తి వదిలి తిరుపతిలో స్థిరపడి ఏభైఏళ్ళు (25–7–2023) పూర్తయిన తర్వాత – వనపర్తి జ్ఞాపకాలు రాశారు. 'పచాస్ సాల్ బాద్' (యాభై ఏళ్ళ తరువాత) అంటూ ప్రారంభమైన ఈ జ్ఞాపకాలు స్థానిక చరిత్రకు వుపయోగిస్తాయి. ప్రొఫెసర్ జి. హరగోపాల్, చరిత్రకారుడు వకుళాభరణం రామకృష్ణ దీని విశిష్టతను వివరించారు.

అరవై ఏళ్ళు దాటిన తర్వాత, ఏభై ఏళ్ళక్రితం తాను నివసించిన ప్రదేశాలనూ, ఆనాటి మిత్రులనూ, శత్రువులనూ, వివిధ సంఘటనలనూ, ఆ వూరి ప్రజల జీవన విధానమూ, ఆనాటి ఉపాధ్యాయులూ, విద్యా విధానమూ, వనపర్తి సంస్థాన విశేషాలూ ఇలా ఎన్నెన్నో సూక్ష్మరూపంలో జ్ఞాపకముంచుకొని వాటిని గ్రంథస్తం చేయడమే ఒక విశేషం. ఇక రచయిత ఆనాటి వ్యక్తుల గురించీ, వారి కృషి గురించీ చెబుతుంటే వారితో పరిచయమున్నవారు కూడా ఆ జ్ఞాపకాలలోకి తొంగిచూసే అవకాశం దీని ద్వారా లభించింది.

పదకొండేళ్ళ రాఘవశర్మ, 1966, 67లో ప్యాలెస్ ఆడిటోరియంలో కార్యక్రమానికి హాజరై, ఆనాటి దిగంబర కవి జ్వాలాముఖి ఉపన్యాసంలో 'జందెం తెంచేశాను' అన్నమాట విన్నాడు. ప్రేక్షకులు ఎందుకు చప్పట్లు కొట్టారో అప్పుడు అర్థంకాలేదు కాని డిగ్రీ చదువుతూ తన 19వ యేట తానూ ఆ పనే చేసినపుడు అర్థం అయింది. ఎందుకు ప్రేక్షకులు చప్పట్లు కొట్టారో! (పుట 50). ఇప్పుడు గ్యాస్ పొయ్యి మాత్రమే తెలిసినవారికి పొట్టుపొయ్యి, కట్టెలపొయ్యి, బొగ్గుల కుంపటి, కిరసనాయిల్ గ్యాస్ స్టౌ మొదలైనవి ఆశ్చర్యాన్ని కలుగచేస్తాయి. ఎనిమిదో తరగతి చదువు తున్నపుడు వచ్చిన జై తెలంగాణ ఉద్యమం – ఆనాటి నినాదాలు – విద్యాలయాలు మూసివేత – ఉద్యమకారుల అరెస్టులు, పోలీసులు వారిని హింసించడం మొదలైన వివరాలు రికార్డు చేశారు.

ఇలా ఎన్నెన్నో జ్ఞాపకాలు అందించడమేకాక – చరిత్రకు సంబంధించిన స్థలాల చిత్రాలు, వనపర్తి సంస్థానపు కోటలు, మేడల చిత్రాలు ఎన్నో ఈ పుస్తకంలో అందించారు. వనపర్తి కోట్నీస్ డా॥ బాలకృష్ణ సేవా కార్యక్రమాలు, భారత – చైనా మిత్రమండలిలో పౌరహక్కుల ఉద్యమంలో కృషి, శ్రీశ్రీ ఆర్థిక పరిస్థితి బాగాలేని కాలంలో ఆయనకు సన్మానం చేసి పర్సును బహూకరించడం మొదలైనవెన్నో రచయిత పొందుపరిచారు.

ఇంకా ఎన్నెన్నో విశేషాలున్న ఈ పుస్తకం వెల : రూ. 150/– 1/8 డెమ్మీలో 152 పుటలు. ప్రథమముద్రణ : 2024. పాలమూరు ప్రచురణలు : సంఖ్య 55. ప్రతులకు : 9493226180. ✺

## దేశవ్యాప్తంగా ఉన్న 60 వేర్వేరు వస్తువులకు భౌగోళిక గుర్తింపు (GI ట్యాగింగ్)

మొదటిసారిగా ఒకేసారి 60కి పైగా దేశవ్యాప్తంగా ఉన్న సాంప్రదాయ వస్తువులకు భౌగోళిక గుర్తింపు (GI) లభించింది. వాటిలో బెనారస్ థెండై అనే పానీయం, అస్సాంకు చెందిన వెదురుతో చేసే టోపీ 'జాపి' 'బిహు'డోలు మొదలైనవి కూడా ఉండడం విశేషం. శతాబ్దాల తరబడి ఒక ప్రాంతపు సంస్కృతిలో కలిసిపోయి భౌగోళికంగా, చారిత్రకంగా గుర్తింపు తెచ్చే వస్తువులకు GI ట్యాగింగు ఇస్తుంటారు. వందలాది ఏళ్ళుగా కంచు, ఇత్తడి హస్తకళలకు పేరుగాంచిన సర్తెబారి లోహపు వస్తువులకు, అలాగే అస్సాం జానపదాలలో ముఖ్య సంగీత వాయిద్యమైన 'బిహు'డోలుకు, అషరికాండి ప్రాంత మృణ్మయ పాత్రలకు, తామర తూళ్ళ వంటి వాటితో 'పానీమటేకా' హస్తకళా వస్తువులకు, మిసింగ్ ప్రాంత గిరిజన చేనేత వస్త్రాలకు ఈ GI ట్యాగింగ్ లభించింది. GI ట్యాగింగ్ పేర ఒనగూడిన అదనపు పేరు మరియు విలువల వలన ఆయా వస్తువుల ఉత్పత్తిలో భాగస్వాములైన పేదలకు లాభం వస్తే సంతోషమే. కానీ అన్నింటిలాగానే దీనినీ కార్పొరేటు తిమింగలాలే మింగేస్తాయనటం నిస్సందేహం. ✺

## కన్నడ కవయిత్రి మమతా జి.సాగర్‌కు అంతర్జాతీయ సాహిత్య పురస్కారం

కన్నడ కవయిత్రి, నాటక రచయిత, విద్యావేత్త ఐన మమతా జి. సాగర్ సాహిత్యరంగానికి చేసిన సేవకుగానూ, ప్రపంచ సాహిత్య పురస్కారం (World Literary Prize) అందుకున్నారు. ప్రపంచ రచయితల సంస్థ (World Organization of writers) వారు ఏప్రిల్ 6న ఈ పురస్కారాన్ని ఆమెకు అందించారు. అసోసియేషన్ ఆఫ్ నైజీరియన్ ఆథర్స్ (ANA) మరియు పాన్ ఆఫ్రికన్ రైటర్స్ అసోసియేషన్ (AAWA) సంయుక్తంగా నైజీరియాలో నిర్వహించిన మూడురోజుల ప్రపంచ రచయితల సంస్థ సమావేశాల మొదటిరోజున ఈ పురస్కార ప్రధానం జరిగింది.

'కాద నివిలింగ హెజ్జె' (1992) మరియు 'నదియ నీరిన తేవ' (1999) వంటి తన రచనల ద్వారా ఆమె లింగవివక్ష, మానవహక్కుల హననం, మరియు రాజకీయ అసమానత్వాలకు వ్యతిరేకంగా బలమైన గొంతు వినిపించారు. కవిత్వం ఎయిర్ కండిషన్డ్ రూములకు చెందినది కాదంటారామె. అందుకు నిదర్శనంగానే కబ్బన్ పార్క్ మెట్రో రైల్వేస్టేషన్ గోడలపై ఆమె కవిత్వం కనిపిస్తుంది. పబ్లిక్ ప్లేసులలో కవితాలాపన, స్థానిక, జాతీయ, అంతర్జాతీయ కవులతో ఆన్లైను కవితాలాపన వంటి కార్యక్రమాల నిర్వహణలో ఆమె ప్రస్తుతం కేంద్రీకరించి పనిచేస్తున్నారు. ఒక అనువాదకురాలిగా ఆమె, వర్ధమాన కవులకు, రచయితలకు..... వారి వారి భాషల్లో సృజన చేస్తూనే ఇతర భాషల్లో అనువాదాలుగా కూడా తమ గొంతు వినిపించాలని పిలుపునిస్తున్నారు. ✺

## గాజా ప్రజలపై జరుగుతున్న మారణహోమాన్ని ప్రతిఘటిద్దాం

రెండు వందల రోజులు దాటిన గాజాపై ఇజ్రాయిల్ చేస్తున్న దాడిలో 35 వేలమందికి పైగా పాలస్తీనియన్ల ప్రాణాలు కోల్పోయారు. మరో 75 వేలమంది క్షతగాత్రులయ్యారు. ప్రతి పది నిముషాలకు ఒక చిన్నారి ప్రాణాలు కోల్పోతున్నది. 23 లక్షలమంది జనాభా గల గాజా నుంచి 85 శాతం మంది తరలిపోయారు. శరణార్థులకు కనీసపాటి అన్నపానీయాలు అందకుండా చేసి వారినీ ఆకలి చావులకు గురిచేస్తూంది ఇజ్రాయిల్. గాజా ప్రజలకు ఎటువంటి విరాళాలూ, సహాయం అందకుండా చేస్తున్న అమెరికా ఇజ్రాయిల్‌కు ఆయుధాలను సరఫరా చేస్తూంది. భద్రతామండలిలో ఇజ్రాయిల్ వ్యతిరేక తీర్మానాలను అడ్డుకుంటూ గాజా ప్రజలపై ఊచకోతలకు అమెరికా ఊతమిస్తూంది. ఇప్పుడు గాజాను దాటి ఇజ్రాయిల్ సేనలు రఫాలోకి అడుగుపెట్టబోతున్నాయి. ఈ జాతి హనన మారణహోమాల్ని ప్రజలందరూ ఐక్యమై ప్రతిఘటించాలి. ✺

## ఆర్‌పీఎఫ్‌లో ఉద్యోగాలు.. 4,660 ఎస్సై, కానిస్టేబుల్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్..!

నిరుద్యోగులకు శుభవార్త... ఆర్‌పీఎఫ్‌లో ఉద్యోగాల భర్తీకీ నోటిఫికేషన్ విడుదలయ్యింది. దేశవ్యాప్తంగా ఉన్న అన్నీ రైల్వే రీజియన్లలో భర్తీకి రైల్వేశాఖ నోటిఫికేషన్ జారీ చేసింది. రైల్వే ప్రొటెక్షన్ ఫోర్సు(ఆర్‌పీఎఫ్) / రైల్వే ప్రొటెక్షన్ స్పెషల్ ఫోర్స్ (ఆర్‌పీఎస్ఎఫ్)లో మొత్తం 4,660 ఎస్సై, కానిస్టేబుల్ పోస్టుల భర్తీకి రైల్వే శాఖ ఉద్యోగ ప్రకటనను విడుదల చేసింది. అర్హత, ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. ఏప్రిల్ 15వ తేదీ నుంచి మే 14వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. ఈ ఉద్యోగాలకు రాత పరీక్ష, శారీరక దారుఢ్య వైద్య పరీక్షల ఆధారంగా ఉద్యోగాలను ఎంపిక చేస్తారు.

విద్యార్హత : కానిస్టేబుల్ పోస్టులకు పదో తరగతి. ఎస్సై ఉద్యోగాలకు డిగ్రీ ఉత్తీర్ణతతో పాటు నిర్దిష్ట శారీరక ప్రమాణాలు కలిగి ఉన్న వారు ఈ పోస్టులకు దరఖాస్తు చేసుకునేందుకు అర్హులు.. వయసు : కానిస్టేబుల్ పోస్టులకు 01.07.2024 నాటికి 18-28 ఏళ్ల మధ్య ఉండాలి. ఎస్సై పోస్టులకు 20-28 ఏళ్ల మధ్య ఉన్నవారు అర్హులు.. ఆన్‌లైన్‌లో మాత్రమే దరఖాస్తు చేయాల్సి ఉంటుంది. ✺

కవిత

# డాన్ కోర్ జెస్క్యూ ఇంగ్లీషు కవితలు రెండు

అనువాదం : **కొత్తపల్లి రవిబాబు**

## 1

కేంద్రీకరించు
నీవు చూస్తున్నదానిపై....
ప్రజలు హత్యకు గురికావడం
చూస్తున్నావు
నేల రక్తసిక్తమై
మలినమైపోవడం చూస్తున్నావు
కలల్నీ హతమార్చడం
గమనిస్తున్నావు
ఇవన్నీ చూస్తూకూడా
మీ దేశాధ్యక్షుడిని,
మీ ఛాన్సలర్‌లను,
మీ ప్రధానమంత్రులను
నమ్ముతున్నావే
వీరందరూ నిన్ను రక్షిస్తారని
అంతా సక్రమంగా వుందని!
కాని అలాకాదు మిత్రులారా!
మరువరాదు సుమా
గాయాలతో కుములుతున్నవారిని
వికలాంగులైపోయినవారిని
మరణించినవారిని
వీరందర్నీ మరచిపోరాదు
ప్రైవాటి స్థానంలో
కొత్తగా సాగే అన్యాయాలను
ఏకరువు బెడతారు
వాటిని పట్టించుకుంటాయి
మన ప్రజాస్వామ్యాలు
మన ధర్మసంస్థలు
వెలుగులీనుతున్న మన నాగరికతలు!
అవును, వాటిని పట్టించుకుంటారు
రాజధానిలోని నల్లదొంగలు
రహస్య సంస్థలు
పరిపాలకులు!
నీవు చూసే ప్రపంచం
బలహీనుల నిరంతర ఘోష!
జాతి హననం!
కళ్ళు తెరచి చూడు
ఇక తరువాత
నీదే వంతు!

## 2

ఎవర్నీ గౌరవించకు
జడ్జి మొఖాన కాండ్రించి ఉమ్ము!
అధ్యక్షుడిని చాచి లెంపకాయ ఇవ్వు!
డాక్టరును నమ్మనే నమ్మకు
లాయరును నోరు మూసుకోమను
మతాధికారితో
అబద్ధాలు మానేయమని చెప్పు
ఎంతటి అధికారైనా లెక్కచేయవద్దు
వారు నీకేమీ ఇవ్వరు!
వారు తమ అధికారం, సంపద
పెంపొందించుకునే దారిలో
నీవొక పెద్ద అడ్డంకివి!
వాడే అసలు నేరస్తుడు
తెలివితక్కువ దద్దమ్మ
కాని అలా కనబడడు
కపటాలూ, అబద్ధాలకోరుల చేతుల్లో
వున్నాయి జైళ్ళ తాళంచెవులు
నీవీ ప్రపంచంలో నటించకుండా
ఈ పటిష్టమైన గోడను
సత్యంతో కూల్చాలని చూస్తే
వారందరూ నీకు
శిలువ వేస్తారు!
కుక్క చావు చస్తావు
నిన్ను పిచ్చోడివంటారు
లేదా ఉగ్రవాదివంటారు
క్షమించరాని నేరం చేశావంటూ
నీ పేరు తుడిచివేస్తారు
అబద్ధాల వాస్తవంలో
వారు జీవిస్తుంటారు
జాగ్రత్త!

ఇంగ్లీషులో కవితలు రాస్తున్న ఈ కవి (Don Corjescue) జర్మనీలోని University of Tubingenలో అధ్యాపకులు. ఇంగ్లీషు కవితలు Counter currentsలో ప్రచురితం.

PRAJA SAAHITI May 2024 (TELUGU) Rs. 20/- RNI No.APTEL/1977/00571 Postal Regd. No. Vj/030/2024-2026
No. of Pages : 36 Date of Publication : 28th of Last Month Posting : 1st or 2nd of Every Month



## హైకూ

– పి. మోహన రామ ప్రసాదు

ఎర్రని జెండా
నెత్తుటి గాయాలని
ఆరవేస్తోంది

ఎర్రని జెండా
ఆగ్రహ నెగడుని
ఎగరేస్తోంది

ఎర్రజెండా నీడలో
చెమటచుక్క
పదునెక్కింది!!

ప్రజాసాహితి 30-7-6, అనపర్తివారి వీధి, అన్నదాన సమాజం రోడ్డు, దుర్గాఅగ్రహారం, విజయవాడ – 520002.
Editor : P.S. NAGARAJU, Edited, Printed and Published by K. RAVI BABU at Vanaja Press, Vijayawada - 520 002 for Co-operative Press, Vijayawada
A PUBLICATION OF JANASAAHITHI